సత్యమేవ జయతే

# సాక్షి

గురువారం 19-3-2020

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 358

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'సామాన్యులకు వైద్యం ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు. అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'



**మాంద్యం కోరల్లో..**

1,710 పాయింట్లు పతనమైన సెన్సెక్స్. 28,870 వద్ద ముగింపు -బిజినెస్‌లో



**కౌంటీలకు విహారి**

తొలిసారి కౌంటీ క్రికెట్ ఆడేందుకు సిద్ధమైన ఆంధ్ర బ్యాట్స్‌మన్ -స్పోర్ట్స్‌లో

---

● 'జేఈఈ, సీబీఎస్ఈ'.. బ్రేక్

### పరీక్షలు వాయిదా..

10, 12 తరగతులకు జరుగుతున్న బోర్డు పరీక్షలను సీబీఎస్ఈ మార్చి 31 వరకు వాయిదా వేసింది. అలాగే ఐఐటీ ఇతర ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ మెయిన్ పరీక్ష కూడా వాయిదా పడింది. ఈ పరీక్షలు వాయిదా వేసినట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ బుధవారం ప్రకటించింది.




- 5లో

● అసలైన మందు ఇదే..

### ధైర్యం 500mg

చైనాలో కరోనా వస్తే మనకూ వచ్చేసిందని బెంబేలెత్తిపోతామా? మహమ్మారులు చాలా భయపెడతాయి. నష్టం చేస్తాయి. కాని అంతకన్నా నష్టం చేసేది అకారణ భయం. పిరికితనం. కొందరు బయటి వార్తలను తమకు ఆపాదించుకుంటారు. వారికి ధైర్యం చెప్పాలి. అదే వారికి అసలైన మాత్ర.



- ఫ్యామిలీలో

● సుప్రీం ప్రశ్న..

### 'భోజనం' పరిస్థితేంటి?

కోవిడ్ కారణంగా దేశంలోని పాఠశాలలను మూసివేయడంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఎలా అందిస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం పలు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు బుధవారం నోటీసులు జారీ చేసింది.



- 5లో

● ఏపీలో నివారణ చర్యలు

### విద్యా సంస్థల మూసివేత

కరోనా నివారణకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వ విద్యాలయాలు, వసతి గృహాలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు సహా కోచింగ్.. శిక్షణ కేంద్రాలన్నీ 19 నుండి 31 వరకు మూసి వేయాలని సీఎస్ నీలం సాహ్ని ఆదేశించారు.




- 3లో

---

## కోవిడ్ కల్లోలం..

**2,00,000** ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు

**8,000** వైరస్ కారణంగా మరణించిన వారు

**1,135** ఒక్క ఇరాన్‌లోనే మృతుల సంఖ్య

**105** అమెరికాలో వైరస్‌తో మృతి చెందిన వారు

**475** ఇటలీలో బుధవారం ఒక్కరోజే మృతి చెందిన వారు

**454** ఆస్ట్రేలియాలో వైరస్ బారిన పడిన వారు

**158** భారత్‌లో కోవిడ్ బాధితుల సంఖ్య

**25** వీరిలో విదేశీయుల సంఖ్య

**5,700** దేశవ్యాప్తంగా క్వారంటైన్ సెంటర్లలో ఉంచిన వారు

**14** చికిత్స అనంతరం కోలుకుని డిశ్చార్జ్ అయిన వారు

**42** దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో నమోదైన కేసులు

**276** విదేశాల్లోని భారతీయుల్లో వైరస్ సోకిన వారు

**255** ఒక్క ఇరాన్‌లోనే 'కరోనా' భారతీయుల సంఖ్య



# రాష్ట్రంలో హై అలర్ట్

## ఒక్కరోజే 8 మందికి కోవిడ్ పాజిటివ్

**రాష్ట్రవ్యాప్తంగా 13కు చేరిన కేసులు**

**వారిలో 8 మంది ఇండొనేసియా వారే..**

**వారితో ఉన్న 11 మందికి పరీక్షలు చేయనున్న అధికారులు**

**స్కాట్లాండ్ నుంచి వచ్చిన యువకుడికీ వైరస్**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంపై కోవిడ్ పంజా విసిరింది. బుధవారం ఒక్కరోజే 8 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య 13కు చేరింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కలకలం చెలరేగుతోంది. పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. 13 కోవిడ్ పాజిటివ్ కేసుల్లో 8 మంది ఇండొనేషియాకు చెందినవారే ఉండటం గమనార్హం. మొత్తం 10 మంది ఇండొనేసియా బృందం కరీంనగర్‌కు వచ్చిన విషయం తెలిసిందే. వారిలో ఒకరికి మంగళవారమే కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. స్కాట్లాండ్ నుంచి వచ్చిన 21 ఏళ్ల యువకుడితో పాటు, మరో ఏడుగురు ఇండొనేసియన్లు కోవిడ్ బారిన పడినట్లు ప్రజారోగ్య డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు బుధవారం రాత్రి 11 గంటల తర్వాత విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. దీంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇండొనేసియా బృందంలోని మరో ఇద్దరికీ మరోసారి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఈటల రాజేందర్ 'సాక్షి'కి తెలిపారు. వారికి సహకరించిన హైదరాబాద్ వాసికి కూడా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కరీంనగర్‌లో వీరిని కలిసిన 11 మందిని హైదరాబాద్‌కు తీసుకొచ్చి పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఇంకా వీరు ఎవరెవరిని కలిశారో జల్లెడ పడుతున్నామని చెప్పారు. కోవిడ్ కేసులు బయటపడటంతో బుధవారం రాత్రి మొత్తం కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యాలయంలోనే ఉండి మంత్రి ఈటల పర్యవేక్షిస్తున్నారు.

**మరో యువకుడికి పాజిటివ్..**

స్కాట్లాండ్లో బీబీఏ చదువుతున్న మేడ్చల్ జిల్లా నాచారానికి చెందిన యువకుడి(22)కి బుధవారం కరోనా మిగతా 2వ పేజీలో ▶

## అత్యవసరమైతేనే బయటకు రండి...

- కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం
- ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలి.. ప్రభుత్వ ఆఫీసులకు రావొద్దు: ఈటల
- టూర్లు, ఫంక్షన్లకు వెళ్లొద్దు.. విదేశాల్లోని వారు రావొద్దు
- వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది సెలవులు పూర్తిగా రద్దు

-వివరాలు 2లో



### టెన్త్ విద్యార్థులకు మాస్కులు..

గురుకుల, ఆశ్రమ పాఠశాలు, సంక్షేమ వసతి గృహాల్లో పంపిణీ

దాదాపు లక్ష మంది విద్యార్థులకు అందజేత

- వివరాలు 2లో

### ఆరు నెలల రేషన్ ఒకేసారి

కోవిడ్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం

- వివరాలు 5లో

### ఈ వైరస్ కృత్రిమం కాదు

సహజ సిద్ధంగా పరిణమించిన సూక్ష్మజీవే: శాస్త్రవేత్తలు

- వివరాలు 5లో

# నేడు కీలక భేటీ

## మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం కేసీఆర్ అత్యున్నత స్థాయి సమావేశం

- కరోనా విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భేటీలో విస్తృత చర్చ
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ పిలుపు
- విదేశాల నుంచి వచ్చేవారికి సంపూర్ణ వైద్య పరీక్షలు తప్పనిసరి
- ప్రజలు గుమిగూడే అన్ని కార్యక్రమాల రద్దుకు నిర్ణయం



**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో కరోనా వైరస్ వ్యాపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు గురువారం ప్రగతిభవన్‌లో అత్యవసర, అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను ఆహ్వానించారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. ఇండోనేసియా నుంచి కరీంనగర్ వచ్చిన కొందరు విదేశీయులకు కరోనా లక్షణాలు ఉన్నట్లు తెలియడంతో రాష్ట్రవ్యాప్తంగా అప్రమత్తంగా ఉండాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తలెత్తిన పరిస్థితిని, తీసుకోవాల్సిన జాగ్రత్తలను, పాటించాల్సిన నియంత్రణ పద్ధతులను గురువారం నాటి సమావేశంలో విస్తృతంగా చర్చిస్తారు. విదేశాల నుంచి వచ్చిన వారి ద్వారానే కరోనా వ్యాప్తి చెందుతున్నందున, వారు సంపూర్ణ వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తమై ప్రభుత్వానికి సమాచారం అందించాలని, స్వీయ ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశాల నుంచి వచ్చిన ఎవరినైనా సరే సంపూర్ణ పరీక్షలు జరిపిన తర్వాతే ఇళ్లకు పంపాలని సీఎం అధికారులను ఆదేశించారు.

కరోనా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇప్పటికే కొన్ని అంశాల్లో 15 రోజుల కార్యాచరణ, మరికొన్ని అంశాల్లో వారం రోజుల కార్యాచరణ ప్రకటించి అమలు చేస్తోంది. గురువారం అత్యవసర సమావేశం నిర్వహించి మరిన్ని నియంత్రణ చర్యలు ప్రకటించే అవకాశముంది. రాష్ట్రంలో ప్రజలు ఎక్కువగా

### మరిన్ని నియంత్రణ చర్యలు

గుమిగూడే కార్యక్రమాలన్నింటినీ రద్దు చేయాలని నిర్ణయించింది. సామూహికంగా జరిగే పండుగలు, ఉత్సవాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సీఎం పిలుపునిచ్చారు. కరోనా వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం తీసుకునే చర్యలను ప్రజలు అర్థం చేసుకుని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలని, జనం ఒకేచోట గుమిగూడొద్దని సీఎం పిలుపునిచ్చారు.

## ఆ బోగీలో 82 మంది

- ఏపీ సంపర్క్ క్రాంతి ఎస్9 బోగీలో ప్రయాణించిన ఇండొనేషియన్లు..
- మరికొంతమంది వచ్చినట్లు ప్రచారం.. మిగిలిన వారి ఆచూకీ కోసం వెతుకుతున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/హైదరాబాద్

ఇండొనేసియా నుంచి కరీంనగర్ వచ్చిన 10 మంది బృందంప్రయాణించిన రైలు బోగీలో 82 మంది ప్రయాణికులున్నట్లు అధికారులు గుర్తించారు. వీరిలో 8 మందికి కోవిడ్ పాజిటివ్ అని తేలడంతో వైద్య శాఖ అప్రమత్తమైంది. వారు ప్రయాణించిన రైలుతో పాటు, ఎక్కడెక్కడ తిరిగారు.. ఎవరిని కలిశారనే దానిపై ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా వారి వివరాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు రైల్వే అధికారులు అందించారు. ఢిల్లీ నుంచి ప్రయాణించిన 12708 నంబర్ ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఎస్ 9 బోగీలో వారు ప్రయాణించినట్లు రైల్వే శాఖ అధికారులు గుర్తించారు. టికెట్లు రిజర్వ్ చేసుకునే సమయంలో అందించిన ఫోన్ నంబర్లను కూడా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు అందజేశారు. ఆ వివరాల ఆధారంగా ప్రయాణికులను గుర్తించి చర్యలు తీసుకుంటున్నారు. ఆ తర్వాత రైలు మిగతా 2వ పేజీలో ▶

## నిజామాబాద్ 'ఎమ్మెల్సీ'గా కవిత నామినేషన్

**హాజరైన మంత్రి వేముల, జిల్లా ఎమ్మెల్యేలు**

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి మాజీ ఎంపీ, సీఎం కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలసి కలెక్టరేట్‌కు చేరుకున్న కవిత.. రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ సి. నారాయణరెడ్డికి అందజేశారు. ఉదయం హైదరాబాద్‌లోని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో మిగతా 2వ పేజీలో ▶



నామినేషన్ పత్రాలను కలెక్టర్‌కి అందజేస్తున్న మాజీ ఎంపీ కవిత. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, హన్మంత్ షిండే, జీవన్‌రెడ్డి



### దేశీయ ప్రయాణం కూడా అంతంతే..

సాధ్యమైనంత వరకు విమాన ప్రయాణాలను తగ్గించుకోవాలని ప్రభుత్వం హెచ్చరించడంతో దేశీయ విమానయాన ప్రయాణికుల సంఖ్య పడిపోయింది. శంషాబాద్ నుంచి ప్రతిరోజూ 389 దేశీయ విమానాలు దేశంలోని ప్రదేశాలకు రాకపోకలు సాగిస్తాయి. కోవిడ్ నేపథ్యంలో వీటిలో 60 సర్వీసులను ఆయా సంస్థలు నిలిపివేయగా, షెడ్యూల్ ప్రకటించినప్పటికీ, ప్రయాణికుల సంఖ్య సరిపడా లేదనే కారణంతో బుధవారం ఒక్క రోజే 27 విమానాలను రద్దు చేశారు.

# 10 శాతమే ఆక్యుపెన్సీ..

**భారత్‌కు వస్తున్న విమానాల్లో అరకొర ప్రయాణికులే**

- శంషాబాద్ నుంచి దేశీయ, అంతర్జాతీయ సర్వీసులు నిలిపివేత
- దుబాయ్, బ్యాంకాక్ మినహా ఇతర దేశాలకు అరకొర సర్వీసులే
- బుధవారం ఒక్క రోజే 27 దేశీయ సర్వీసులు నిలిపివేత.. పోలండ్‌లో చిక్కుకున్న 50 మంది భారతీయులు
- అందులో ఆరుగురు తెలుగు వాళ్లు

సాక్షి, హైదరాబాద్

కోవిడ్ వైరస్ విశ్వరూపంతో విమానయానం డోలాయమానంలో పడింది. ప్రపంచ దేశాలను వణికిస్తున్న ఈ వైరస్ విమాన రంగాన్ని ఓ రకంగా కుదేలు చేసింది. ఈ ప్రభావం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపైనా పడింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల రాకపోకలతో నిత్యం సందడిగా కనిపించే ఎయిర్‌పోర్టు ప్రస్తుతం వెలవెలబోతుంది. విమానయాన సంస్థలు సేవలను నిలిపివేయడంతో వివిధ దేశాలకు రాకపోకలు సాగించే అంతర్జాతీయ విమానాల్లో సగానికి పైగా రద్దయ్యాయి. ప్రతిరోజూ ఇక్కడి నుంచి 38 అంతర్జాతీయ విమానాలు.. దుబాయ్, మలేసియా, కువైట్, మస్కట్, ఖతర్, యూఏఈ, ఒమన్, బ్యాంకాక్, హాంకాంగ్ తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయి. అయితే కోవిడ్ ప్రభావంతో దుబాయ్, బ్యాంకాక్ మినహా ఇతర దేశాలకు ప్రస్తుతం విమాన సర్వీసులు నిలిపివేశారు. తాజాగా లండన్ సహా యూరప్ దేశాలకు కూడా విమాన సేవలను నిలిపివేస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆయా దేశాలకు ఇక్కడి నుంచి వెళ్లే కనెక్టింగ్ ఫ్లైట్స్ కూడా రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి పలు దేశాలకు రాకపోకలు సాగించే విమానాల్లో మిగతా 2వ పేజీలో ▶






ఇదండీ సంగతి



# పదో తరగతి విద్యార్థులకు మాస్కులు

**సాక్షి, హైదరాబాద్:** కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు సంక్షేమ శాఖలు ఉపక్రమించాయి. గురువారం నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండటంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాయి. గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న పదో తరగతి విద్యార్థులకు మాస్కులు పంపిణీ చేస్తున్నాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఇప్పటికే వాటిని జిల్లా సంక్షేమ శాఖాధికారులకు పంపిణీ చేశాయి. వీటిని సంబంధిత అధికారులకు అందించి పిల్లలకు పంపిణీ చేశారు.



**లక్ష మందికి పంపిణీ..**

ఎస్సీ అభివృద్ధి శాఖ, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల ద్వారా రాష్ట్రంలో 1,750 సంక్షేమ వసతి గృహాలు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో దాదాపు 25 వేల మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 325 ఆశ్రమ పాఠశాలల్లో దాదాపు 20 వేల మంది విద్యార్థులుంటారు. గురుకుల సొసైటీల పరిధిలో 906 గురుకుల పాఠశాలలున్నాయి. వీటిలో 622 పాఠశాలల్లో పదో తరగతి వరకు ఉంది. వీటిలో దాదాపు 48 వేల మంది విద్యార్థులున్నారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆయా పాఠశాలలు, హాస్టళ్లలో ఉన్నారు. వీరు నేటి నుంచి పరీక్ష కేంద్రానికి వెళ్లి పరీక్ష రాశాక తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కరోనా బారిన పడకుండా మాస్కులను పంపిణీ చేశారు. పరీక్ష కేంద్రం నుంచి తిరిగి వచ్చాక చేతులు శుభ్రపర్చుకోవడానికి హ్యాండ్‌వాష్‌లు, సబ్బులు సైతం పంపిణీ చేశారు. మొత్తంగా లక్ష మంది విద్యార్థులకు పంపిణీ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

# విమానాశ్రయంలో పది అంబులెన్స్‌లు

**రోజుకు రెండు వేల నుంచి 2500 మందికి థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు**

**హైదరాబాద్:** వివిధ దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను తప్పనిసరి 14 రోజుల క్వారంటైన్‌కు తరలిస్తుండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో బుధవారం ఉదయం 10 అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. విమానాశ్రయంలో ప్రతిరోజు 2వేల నుంచి 2,500 మంది ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో కరోనా అనుమానిత లక్షణాలు కనిపించిన వారితో పాటు సెల్ఫ్ రిపోర్టింగ్ ఇస్తున్న ప్రయాణికులకు నగరంలోని గాంధీ, ఫీవర్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. మిగతా వారిని వికారాబాద్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రాలకు తరలిస్తున్నారు.



**విమానాలు భారీగా రద్దు..**

కొన్ని రోజులుగా ఆయా దేశాల ఆంక్షలతో పాటు ప్రయాణికులు కూడా రాకపోకలకు రద్దు చేసుకుంటుండటంతో అంతర్జాతీయ ట్రాఫిక్‌తో పాటు, దేశీయ ట్రాఫిక్ కూడా తగ్గుముఖం పడుతోంది. కోవిడ్ ప్రభావంతో బుధవారం నాలుగు అంతర్జాతీయ విమాన సర్వీసులతో పాటు 25 దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. విమానాల్లో ప్రయాణికుల రాకపోకలు తగ్గడంతో పలు ఎయిర్‌లైన్స్ సంస్థలు, ఢిల్లీ, కొచ్చిన్, బెంగళూరు, చెన్నై లాంటి ప్రధాన నగరాలకు రాకపోకలు సాగించే విమాన సర్వీసులను రద్దు చేశాయి.

# నేటి నుంచి చిలుకూరు ఆలయం బంద్

**మొయినాబాద్ (చేవెళ్ల):** తెలంగాణ తిరుపతిగా పేరొందిన చిలుకూరు బాలాజీ దేవాలయంపై కోవిడ్ వైరస్ ప్రభావం పడింది. ఈ నెల 19 నుంచి 25 వరకు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ బుధవారం ప్రకటించారు. కోవిడ్ ప్రభావం ఉన్నప్పటికీ ప్రతి రోజూ చిలుకూరు బాలాజీ దేవాలయానికి భక్తులు బాగానే వస్తున్నారని ఆయన చెప్పారు. బాలాజీ ఆలయం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేస్తూ ఎక్కువ సమయం ఉంటున్నారని, దీని వల్ల వైరస్ సోకే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కొంత మంది భక్తులు విదేశాల నుంచి నేరుగా ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేస్తుంటారని అలాంటి వారిని ప్రత్యేకంగా గుర్తించలేమని చెప్పారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆలయాన్ని మూసివేస్తున్నట్లు వెల్లడించారు. రోజు మాదిరిగా నిత్యం స్వామివారికి అభిషేకం, పూజలు, అర్చన, ఆరాధన జరుగుతాయని.. కానీ భక్తులకు మాత్రం స్వామివారి దర్శనం ఉండదని తెలిపారు.



# దయచేసి బ్యాంకులకు రావద్దు

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ విస్తరణ నేపథ్యంలో వినియోగదారుల భద్రతను దృష్టిలో పెట్టుకుని నిరంతరాయంగా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పలు బ్యాంకులు ప్రకటించాయి. బ్యాంకులకు రాకుండానే లావాదేవీలు నిర్వహించాలని వినియోగదారులకు సూచించారు. ఐఎంపీఎస్, నెఫ్ట్, ఆర్‌టీజీఎస్, యూపీఐ, బిల్లులను డిజిటల్ విధానంలో వినియోగదారులు చెల్లింపులు జరిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు బ్యాంకింగ్ వర్గాలు వెల్లడించాయి. లావాదేవీల కోసం యాప్‌లు వినియోగించడంతో పాటు, రిటైల్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు, కార్డుల ద్వారా ఇంటి నుంచే బ్యాంకింగ్ అవసరాలు తీర్చుకోవాలని బ్యాంకులు వినియోగదారులకు సూచించాయి.



# కడచూపునకు 'కరోనా' దెబ్బ

- సాయంత్రం 4లోపు అంత్యక్రియలు పూర్తి చేయాలి.. కేవలం 50 మందికి మాత్రమే అనుమతి

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ భూతం శ్మశానవాటికలనూ తాకింది. దగ్గరి బంధువులను సైతం చివరి చూపు చూడకుండా కట్టడి చేస్తుంది. వివిధ కారణాలతో ఎవరైనా చనిపోతే వారి బంధువులు, స్నేహితులు శ్మశానవాటిక వరకు వస్తారు. అంతిమయాత్రకు కూడా పరిమితమైన సంఖ్యలోనే సందర్శకులు రావాలని, దీనికి కూడా నిబంధనలు వర్తిస్తాయంటూ శ్మశానవాటిక నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం 50 మందితో మాత్రమే అంతిమయాత్రకు అనుమతి ఉంటుందని, అది కూడా సాయంత్రం నాలుగు గంటలలోపు ఈ తంతు పూర్తి చేయాలని శ్మశానవాటిక నిర్వాహకులు తేల్చి చెబుతున్నారు.



**చివరిచూపు లేకుండా...**

బంధువుల్లో ఎవరైనా చనిపోతే చిన్నాపెద్దా తేడా లేకుండా అందరూ వచ్చి చివరిచూపు చూసి ఆ కుటుంబ సభ్యులను పరామర్శిస్తుంటారు. ప్రస్తుతం కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. రోజురోజుకూ పాజిటివ్ కేసులు పెరుగుతుండడంతో అంతిమయాత్రలో 50 మందికి మించొద్దని ఆదేశించింది. పరిమిత సంఖ్యలో హాజరు కావాలని ప్రభుత్వం సూచించడంతో ఎవరెవరిని అంతిమ యాత్రకు అనుమతించాలి అనేది ఆయా కుటుంబాల్లో ఆందోళనకు దారితీస్తోంది. ఎవర్నీ కాదనే పరిస్థితి లేకపోవడం సమస్యగా మారి, కొన్ని సందర్భాల్లో ఘర్షణలకు కూడా దారితీస్తోంది.

# బస్సుల్లో హ్యాండ్ శానిటైజర్లు

**సొంతంగా తయారు చేసుకుంటోన్న ఆర్టీసీ – ప్రయాణికులందరికీ అందుబాటులోకి..**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సొంతంగా హ్యాండ్ శానిటైజర్లు తయారు చేసుకుంటోంది. కోవిడ్ వైరస్ విస్తరించే ప్రమాదం ఉండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా బస్సుల్లో ప్రయాణికులందరికీ హ్యాండ్ శానిటైజర్లు అందుబాటులోకి తెచ్చింది. డిపోల పరిధిలో సొంతంగా శానిటైజర్ తయారీ ప్రారంభించింది. అధికారులు ఆయా జిల్లాల వైద్యాధికారులను సంప్రదించి శానిటైజర్ తయారీ విధానం తెలుసుకుని, ముడి పదార్థాలు తెప్పించి రూపొందిస్తున్నారు. దాన్ని చిన్న చిన్న ప్లాస్టిక్ సీసాల్లో నింపి అన్ని బస్సుల్లో అందుబాటులో ఉంచుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్లో డ్రైవర్ వెనుక భాగంలో 500 మిల్లీ లీటర్ల సామర్థ్యంతో డబ్బాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతోపాటు కండక్టర్ల వద్ద చిన్న సీసాలు ఉంచుతున్నారు. ప్రయాణికులు బస్సు ఎక్కగానే ముందుగా శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో పాటు బస్టాండ్లలో వాష్‌బేసిన్‌ల వద్ద లిక్విడ్ సోప్ (సబ్బు ద్రావణం) అందుబాటులో ఉంచారు. ప్రయాణికులు బస్సు ఎక్కేముందు కచ్చితంగా అక్కడ చేతులు కడుక్కోవాలంటూ మైకుల ద్వారా ఆదేశిస్తున్నారు. బస్సు ఎక్కేముందు డ్రైవర్లు, కండక్టర్లు కూడా ఆ విషయాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎక్కిన తర్వాత శానిటైజర్‌తో శుభ్రం చేయిస్తున్నారు. టికెట్ ఇచ్చేప్పుడు కూడా కండక్టర్లు తమ వద్ద ఉన్న చిన్న సీసాల ద్వారా వారికి శానిటైజర్ అందించి చేతులు శుభ్రం చేసుకోమని చెబుతున్నారు. ఇక డ్రైవర్, కండక్టర్లకు ప్రత్యేకంగా సబ్బులు అందిస్తున్నారు. వారు వీలైనప్పుడల్లా వాటితో చేతులను శుభ్రం చేసుకోవాలని అధికారులు ఆదేశించారు.

**రవాణా నిలిపివేస్తే ఇబ్బందులు..**

'కోవిడ్ భయంతో ప్రజా రవాణాను నిలిపివేస్తే ఇబ్బందులు వస్తాయి. అలా అని వదిలేస్తే బస్సుల్లో ఒకేచోట ఎక్కువ మంది ప్రయాణించడం సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంటుంది. అందుకోసం ఈ ఏర్పాట్లు చేశాం. అన్ని బస్సుల్లో శానిటైజర్లు కావాలంటే భారీ మొత్తంలో అవసరం ఉంటుంది. అందుకోసం సొంతంగా తయారు చేయడమే మంచిదని భావించాం. ఐసోప్రొఫైల్ ఆల్కహాల్, గ్లిజరిన్, డిస్టిల్డ్ వాటర్‌లతోపాటు అవసరమైన ముడిపదార్థాలు వాడి శానిటైజర్లు రూపొందిస్తున్నాం'అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు.



ప్రయాణికురాలికి శానిటైజర్ అందిస్తున్న కండక్టర్

# అత్యవసరమైతేనే బయటకు రండి..

**కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం**

**ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలి.. ప్రభుత్వ ఆఫీసులకు రావొద్దు: ఈటల**

**ప్రజలు టూర్లు, పెళ్లిళ్లు, ఫంక్షన్లకు వెళ్లొద్దు.. విదేశాల్లోని వారు రావొద్దు**

**సాక్షి, హైదరాబాద్:** 'కోవిడ్ వైరస్ ఆషామాషీగా లేదు. తేలిగ్గా తీసుకోవద్దు. అత్యవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఇళ్లలోంచి బయటకు రావొద్దు. ప్రజలు సాధారణ పనుల కోసం పది, పదిహేను రోజులపాటు ప్రభుత్వ కార్యాలయాలకు రావడం మానుకోవాలి. మసీదులు, దేవాలయాలు, ఇతర ప్రార్థనా మందిరాలకు వెళ్లకూడదు. ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలి'అని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. గల్ఫ్ దేశాల్లోని మసీదుల్లో నమాజు చేసుకోకూడదని, ఇళ్లలోనే ప్రార్థనలు చేసుకోవాలని ఆదేశించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. శ్రీరామనవమిని లక్షలాది మందితో నిర్వహించేవారమని, అలాంటిది ఇప్పుడు కేవలం గుడికే పరిమితం చేశామని ఆయన పేర్కొన్నారు.

**చేయి దాటితే ఇంకేం చేయలేం..**

ఇప్పుడే జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితి చేయిదాటితే ఇంకేమీ చేయలేమని మంత్రి ఈటల చెప్పారు. మనిషి ప్రాణం కంటే ఏదీ ముఖ్యం కాదన్నారు. ప్రజల క్షేమం కోసమే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కోవిడ్ వైరస్ దేశవ్యాప్తంగా విస్తృతమవుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. నిన్నా మొన్నటివరకు సాధారణంగా మాట్లాడిన ఆయన.. ఇప్పుడు మాత్రం పరిస్థితి తీవ్రతను మీడియా ముందుంచారు. పాఠశాలలు, కాలేజీలు, ఇతర కోచింగ్ సెంటర్లు, థియేటర్లు తదితరమైన వాటిని మూసేశామని, ఈ పరిస్థితుల్లో ప్రజలు టూర్లు పెట్టుకోవద్దని విన్నవించారు. చుట్టాల ఇళ్లకు, పెళ్లిళ్లు, పేరంటాలకు వెళ్లొద్దన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులను కలిసేందుకు రావొద్దని స్పష్టం చేశారు. పిల్లలను మాల్స్‌కు, పార్కులకు, చుట్టాల ఇళ్లకు తీసుకెళ్లవద్దని, వారిని ఇళ్లలోనే జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఎవరి ఇళ్లలో వారు ఉండాలని, పత్రికలు, టీవీల్లో ప్రభుత్వం ఇచ్చే సూచనలను పాటించాలని ఆయన వేడుకున్నారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని, తేలిగ్గా తీసుకోవద్దన్నారు. ఆషామాషీగా తీసుకోవడం వల్ల ఇటలీలో ఏం జరుగుతుందో అందరం చూస్తున్నామన్నారు. అమెరికాలో కర్ఫ్యూ వాతావరణం నెలకొందన్నారు. ఆ దేశం అనేక కార్యకలాపాలను నిషేధించిందన్నారు. పెళ్లిళ్లు ముందుగా నిర్ణయించుకున్నందున 200 మంది కంటే ఎక్కువ మందితో చేయొద్దని సూచించారు.

**ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకోవాలి..**

ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, ఆలయాలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో శానిటైజర్లు, సోప్‌లు అందుబాటులో ఉంచాలని ఈటల చెప్పారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని.. ఎవరికివారు జాగ్రత్తలు తీసుకుంటే తప్ప, వైరస్ సోకే అవకాశమే ఉండదన్నారు. బస్సులు, రైళ్లల్లో ప్రయాణించాల్సి వస్తే మనిషికి మనిషికి దూరం పాటించాలన్నారు. వైద్యులు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది సెలవులన్నింటినీ రద్దు చేస్తున్నట్లు మంత్రి ఈటల ప్రకటించారు. వయసు పైబడిన వారు, బీపీ, షుగర్, కిడ్నీ, గుండె వ్యాధులున్న వారికే ఈ వైరస్‌తో ప్రమాదమన్నారు. తీవ్రతను బట్టి పక్క రాష్ట్రాలతో ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**టెన్త్ సహా ఏ బోర్డు ఎగ్జామ్స్ రద్దు చేయలేదు..**

రాష్ట్రంలో ప్రతీ వెయ్యి మందికి ఒక ఆశ వర్కర్ ఉన్నారని, అలాగే గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, ఇతర ఉద్యోగులు ఉన్నారని మంత్రి ఈటల తెలిపారు. వీరంతా అప్రమత్తమైతే కోవిడ్ వైరస్‌ను కట్టడి చేయవచ్చన్నారు. ఎవరెవరు ఎక్కడెక్కడి నుంచి వస్తున్నారన్న దానిపై ఆరా తీయాలన్నారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తులతో కాంటాక్ట్ ఉన్నవారిని, విదేశాల నుంచి వచ్చే వారిని గుర్తించాలని ఆయన వారికి విన్నవించారు. రిటైర్డ్ డాక్టర్లు, ఇతర సిబ్బందిని నియమించుకోవాలన్నారు. ఇప్పటివరకు ఏ డాక్టర్, నర్సుకు కూడా కోవిడ్ పాజిటివ్ సోకలేదన్నారు. పదో తరగతి పరీక్షలు సహా ఎటువంటి బోర్డు ఎగ్జామ్స్ రద్దు చేయలేదని తెలిపారు.



బుధవారం హైదరాబాద్‌లో మాట్లాడుతున్న మంత్రి ఈటల. చిత్రంలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు

**25 వేల మందిని క్వారంటైన్ చేసేలా ఏర్పాట్లు...**

కోవిడ్ నేపథ్యంలో ముందస్తు అంచనాతో 25 వేల మందిని కూడా క్వారంటైన్ చేసేలా ఏర్పాట్లు చేశామని మంత్రి ఈటల వెల్లడించారు. ఒక్కో క్వారంటైన్ కేంద్రానికి ఒక డాక్టర్, ఇతర వైద్య సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉంటారన్నారు. కలెక్టర్ల ఆధ్వర్యంలో ఈ క్వారంటైన్ కేంద్రాలు ఆయా జిల్లాల్లో నడుస్తాయన్నారు. ఏ జిల్లాలో ఎక్కడెక్కడ ఐసోలేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్న దానిపై నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటికే వికారాబాద్ హరిత హోటల్, హైదరాబాద్ దూలపల్లిలోని ఫారెస్ట్ అకాడమీని ఉపయోగించుకుంటున్నామని చెప్పారు. హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సైబరాబాద్ కమిషనర్, మరో ఇద్దరు ఐఏఎస్‌లను నియమించామన్నారు. వారు అక్కడ పర్యవేక్షణ చేస్తారన్నారు. ఎయిర్‌పోర్టు వద్ద 40 బస్సులు సిద్ధంగా ఉంచామన్నారు. విదేశాల నుంచి వచ్చే వారిని క్వారంటైన్‌కు తరలించేందుకు ఈ ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటికే వివిధ దేశాల నుంచి వచ్చే వారిని గుర్తిస్తున్నామన్నారు. క్వారంటైన్‌లో ఉండేవారెవరూ బయటకు వెళ్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**కోవిడ్‌పై ముఖ్యమంత్రి సమీక్ష...**

కోవిడ్‌కు యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం సమీక్ష నిర్వహించారని ఈటల తెలిపారు. కోవిడ్ నియంత్రణకు తీసుకునే ఏర్పాట్లలో ఏ మాత్రం సీరియస్‌నెస్ తగ్గకూడదని సీఎం ఆదేశించారన్నారు. 24 గంటలూ పనిచేయాలని సీఎం సూచించారన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారని చెప్పారు. మరోవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ కూడా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారన్నారు. భారతీయ వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) నివేదిక ప్రకారం కోవిడ్ వైరస్ ఇప్పటివరకు విదేశాల నుంచి మాత్రమే వచ్చిందని, వారితో అనుబంధంగా ఉన్నవారికి మాత్రమే సోకిందని నివేదిక ఇచ్చిందని తెలిపారు. అంటే స్థానికంగా సామూహికంగా ప్రజల్లోకి వైరస్ సోకలేదని ఐసీఎంఆర్ పేర్కొందని వివరించారు.

**వెయ్యి మందికి వచ్చినా చికిత్స చేసేలా ఏర్పాట్లు..**

రాష్ట్రంలో వెయ్యి మందికి కోవిడ్ వచ్చినా చికిత్స చేసేలా.. 5 వేల మందిని సైతం ఐసోలేషన్‌లో ఉంచేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇప్పటివరకు ఆరు పాజిటివ్ కేసుల్లో ఐదు కేసులకు చెందిన వారి కుటుంబాలకు నెగెటివ్ వచ్చిందన్నారు. గుల్బర్గా కేసుకు సంబంధించిన వ్యక్తి మృతి చెందగా, ఆయన అంత్యక్రియలకు ముగ్గురు ఇక్కడి నుంచి వెళ్లారన్నారు. వారిని పరీక్షించగా, వారికి కూడా నెగెటివ్ వచ్చిందన్నారు. జిల్లాల్లోనూ ఐసీయూలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తగు ఆదేశాలు ఇచ్చిందని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**మన దేశ ప్రజలకు ద్రోహం చేసినట్లే..**

ప్రజల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని విదేశాల్లో ఉన్న భారతీయులు ఇక్కడకు రావొద్దని మంత్రి ఈటల సూచించారు. ఆయా దేశాల్లోనే అక్కడి ప్రభుత్వ ఆధ్వర్యంలో క్వారంటైన్ కావాలని, వారు ఏర్పాటు చేసే కేంద్రాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైరస్ తీవ్రంగా ఉన్న దేశాల నుంచి ఇక్కడకు వస్తే, ఇక్కడి ప్రజలకు తీవ్రమైన నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ విమానాశ్రయాలన్నింటినీ మూసేయాలని తాను కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రి హర్షవర్ధన్‌ను కోరినట్లు తెలిపారు. ఒకవేళ అత్యవసరమైన వారు వస్తే, వారిని ఢిల్లీలో క్వారంటైన్ చేయాలని కేంద్రానికి సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. ఆయా దేశాల్లోని వారికి అన్ని ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ విషయాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుందన్నారు. అంతేకాదు అక్కడి ప్రభుత్వాలు ఏం చేయాలన్న దానిపై కేంద్రం సరైన సూచనలు చేస్తుందన్నారు. కొందరు విదేశాల నుంచి వచ్చి దాచిపెడుతున్నారని, ఇది మన దేశ ప్రజలకు ద్రోహం చేసినట్లు లెక్కేనని మంత్రి తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు.

# స్వీయ గృహ నిర్బంధమే మేలు

**విదేశాల నుంచి వచ్చినవారి ఇళ్లకు ఏపీ సర్కారు నోటీసులు**

**సాక్షి, అమరావతి:** కరోనా వైరస్ (కోవిడ్–19) వ్యాప్తి నిరోధానికి ఏపీ ప్రభుత్వం మరింత కఠిన చర్యలు చేపట్టింది. విదేశీ ప్రయాణికులు ఇకపై 14 రోజుల పాటు స్వీయ గృహ నిర్బంధంలోనే ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రతి ప్రయాణికుడి ఇంటికెళ్లి ఈ మేరకు గృహ నిర్బంధ నోటీసులు అతికించాలని వైద్య, ఆరోగ్య శాఖ ఆదేశించింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికులకు ఎయిర్ పోర్ట్‌లోనే ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించి కరోనా లక్షణాలున్నాయని తేలితే ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్వారంటైన్‌కు పంపిస్తారు. ఏపీలో ఇప్పటివరకూ కరోనా అనుమానిత లక్షణాలున్న 105 మందిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించగా..93 మందికి కరోనా లేదని తేలింది. ఇప్పటివరకూ ఒక్కటి మాత్రమే పాజిటివ్ కేసు నమోదైంది.

# రాష్ట్రంలో హై అలర్ట్

▶ మొదటి పేజీ తరువాయి

పాజిటివ్ అని తేలింది. ఈ నెల 14న బయల్దేరి 16న శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్నాడు. అక్కడ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి తర్వాత ఇంటికి పంపారు. ఆ రోజంతా ముగ్గురు కుటుంబసభ్యులతో గడిపాడు. 17న ఉదయం దగ్గు, జలుబు, జ్వరం లక్షణాలు కన్పించడంతో చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి వెళ్లాడు. కోవిడ్ పరీక్షలు చేయడంతో పాజిటివ్ అని తేలింది. అతడితో కలసి విమానంలో 150 ప్రయాణించినట్లు తెలిసింది. వారందరినీ గుర్తించే పనిలో వైద్య ఆరోగ్యశాఖ నిమగ్నమైంది.

**నేరుగా ఎవరికీ సోకలేదు..**

ఇప్పటివరకు రాష్ట్రంలో నేరుగా ఎవరికీ వైరస్ సోకలేదు. అయితే ఇండోనేసియన్ల ద్వారా ఇక్కడి వారికి వైరస్ సోకిందా అనే దానిపై ఉత్కంఠ రేపుతోంది. తొలుత దుబాయి నుంచి వచ్చిన వ్యక్తికి కోవిడ్ సోకినట్లు తేలింది. ఆ తర్వాత అతడు కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. ఆ తర్వాత బయటపడిన పాజిటివ్ కేసులు కూడా విదేశాల్లో సోకినవారే. అయితే వారు వచ్చాక.. ఇక్కడి వారెవరికీ సోకకపోవడం గమనార్హం. కోవిడ్ పరీక్షల్లో నెగెటివ్ అనే వచ్చింది.

# ఎమ్మెల్సీ అభ్యర్థిగా కవిత నామినేషన్

▶ మొదటి పేజీ తరువాయి

ఆమె జిల్లా మంత్రి, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. నిజామాబాద్ చేరుకుని అత్తమామలు, భర్త అనీల్‌రావు ఆశీర్వాదం తీసుకున్న అనంతరం నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్న కవిత మళ్లీ రావడంతో అనుచరులు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నామినేషన్ వేసేందుకు వచ్చిన కవితకు పార్టీ నేతలు, కార్యకర్తలు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, స్థానిక సంస్థల్లో టీఆర్‌ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. జిల్లా పరిషత్, మండల పరిషత్‌లు, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు మొత్తం 824 ఉండగా, ఇందులో 550 పైగా టీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులే ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కవిత విజయం ఖాయంగా కనిపిస్తోంది.

# 10శాతమే ఆక్యుపెన్సీ..

▶ మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం 15 మాత్రమే నడుస్తున్నాయి.

**ఖాళీగా.. డీలాగా..**

కోవిడ్ ప్రభావంతో రాష్ట్రం నుంచి విదేశాలకు వెళ్లే వారి విమాన ప్రయాణాలు గణనీయంగా తగ్గాయి. అలాగే వివిధ దేశాల నుంచి విమాన సర్వీసులు నిలిపివేయడంతో అక్కడే చిక్కుకుపోయిన భారతీయులు స్వదేశానికి రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతర్జాతీయ విమానాల్లో దాదాపు 90 శాతం టికెట్లు రద్దు చేసుకుంటుండటంతో విమానాలు ఖాళీగా తిరుగుముఖం పడుతున్నాయి. పది రోజుల క్రితం వరకు ఆగ్నేయాసియా దేశాలు, గల్ఫ్ దేశాలకే పరిమితమైన కోవిడ్ ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంతో ఆయా దేశాలకు వెళ్లాలనుకుంటున్న తెలుగు ప్రజలు ప్రయాణాలను నిరవధికంగా వాయిదా వేసుకుంటున్నారు. ఎప్పుడు వెళ్లాలనే షెడ్యూల్ కూడా ఖరారు చేసుకునే పరిస్థితి లేకపోవడంతో టికెట్ల రద్దుకే మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ఆయా దేశాల నుంచి వస్తున్న విమానాల్లో కేవలం 10 శాతం సీట్లు మాత్రమే నిండుతున్నట్లు విమానయాన వర్గాలు తెలిపాయి.

**పోలాండ్‌లో తెలు'గోడు'..**

పోలాండ్ రాజధాని వార్సా ఎయిర్‌పోర్టులో 50 మంది భారతీయులు చిక్కుకుపోయారు. భారత్ రావడానికి 'లాట్'ఎయిర్‌లైన్స్‌లో టికెట్లను బుక్ చేసుకున్న ప్రయాణికులకు నిరాశే మిగిలింది. యూరోప్ దేశాల నుంచి విమాన రాకపోకలను నిలిపివేస్తూ మన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విమాన సర్వీసును నిలిపివేస్తున్నట్లు లాట్ సంస్థ ప్రకటించింది. దీంతో స్వదేశానికి రావాలనుకున్న భారతీయులు ఎయిర్‌పోర్టులోనే చిక్కుకుపోయారు. వీరిలో ఆరుగురు తెలుగువారు ఉన్నట్టు వార్సా ఎయిర్‌పోర్టులో ఉన్న నల్లగొండ జిల్లాకు చెందిన నగేశ్ 'సాక్షి'కి తెలిపారు. వార్సా దాదాపుగా షట్‌డౌన్ కావడం, యూనివర్సిటీలు మూసివేయడంతో భయానక వాతావరణం నెలకొందని, విమాన సర్వీసులను కూడా నిలిపివేయడంతో తమ పరిస్థితి దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలాండ్‌లోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడామని, భారత ప్రభుత్వం అనుమతిస్తే వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తామని వారు హామీ ఇచ్చారని నగేశ్ చెప్పారు.

# ఆ బోగీలో 82 మంది

▶ మొదటి పేజీ తరువాయి

తిరుపతి వరకు వెళ్లింది. అంటే ఆ బోగీలో తెలంగాణతో పాటు ఏపీకి చెందిన వారు కూడా ఉన్నారు.

**వారి రాకతో కలకలం..**

ఇండోనేసియా నుంచి 10 మంది విమానంలో తొలుత ఢిల్లీ వచ్చారు. అక్కడ ఉత్తరప్రదేశ్‌కు చెందిన మరో వ్యక్తితో కలసి ఈనెల 13న ఏపీ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఈనెల 14న రామగుండంలో దిగారు. అక్కడి నుంచి కరీంనగర్ వచ్చారు. ఆ రోజు రాత్రి ప్రార్థనా మందిరంలో బసచేశారు. 15న ఉదయం పోలీసులకు రిపోర్టు చేసేందుకు వెళ్లగా, స్థానికంగా వైద్య పరీక్షలు చేయించుకుని నివేదికలు ఇవ్వాలని పోలీసులు అడిగారు. దీంతో వైద్య పరీక్షల కోసం ఉత్తరప్రదేశ్‌కు చెందిన గైడ్‌తో పాటు ఇద్దరు స్థానికులతో కలసి కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. విదేశీయులు కావడంతో ఐసోలేషన్ వార్డుకు తరలించి పరీక్షలు నిర్వహించారు. దీంతో వారిలో ఒకరు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని గాంధీకి తరలించారు. వారికి పరీక్షలు నిర్వహించగా తొలుత ఒకరికి పాజిటివ్ అని తేలగా, బుధవారం మరో ఏడుగురికి కూడా కోవిడ్ సోకినట్లు నిర్ధారించడంతో రాష్ట్రం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వీరందరికీ గాంధీ ఐసోలేషన్ వార్డులో చికిత్స అందిస్తున్నారు.

**ఎక్కడెక్కడ తిరిగారు..?**

కరీంనగర్‌కు వచ్చిన ఇండోనేసియాకు చెందిన 10 మంది ఎక్కడ బస చేశారు.. ఎక్కడెక్కడ తిరిగారు.. ఎవరిని కలిశారనే అంశాల పై పోలీసులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆరా తీస్తోంది. కలెక్టరేట్ సమీపంలోని ఓ ప్రాంతంలో బసచేసినట్లు తెలుసుకున్న పోలీసులు ఆ ప్రాంతం చుట్టూ ఉన్న దుకాణాలను మూయించారు. వారు ఎవరెవరిని కలిశారనే దానిపై స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. కరీంనగర్‌లోని పలు ప్రార్థనా మందిరాలతో పాటు రేకుర్తికి కూడా వెళ్లినట్లు సమాచారం. పలు చోట్ల కరచాలనంతో పా టు ఆలింగనం చేసుకున్నట్లు తెలిసింది. దీం తో అన్ని ప్రాంతాల ప్రజలను వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తం చేసింది. ప్రాథమిక ఆరోగ్య సిబ్బందితో ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. ఇండొనేషియన్లు బస చేసిన ప్రాంతాలకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రజలందరికీ పరీక్షలు చేస్తామని మంత్రి గంగుల కమలాకర్ ప్రకటించడం గమనార్హం.

**అసలు ఎంతమంది వచ్చారు..**

ఇండోనేసియా బృందం ఢిల్లీ నుంచి రైలు మార్గంలో రామగుండం, అక్కడి నుంచి కరీంనగర్ చేరుకున్నారు. వీరితో పాటు మరో 20 మంది కూడా భారత్ వచ్చినట్లు తెలుస్తోంది. వారిలో మరో 10 మంది రామగుండం నుంచి జగిత్యాలకు వెళ్లినట్లు అనధికారిక సమాచారం. వీరు ఎక్కడున్నారనే దానిపై పోలీసులు దృష్టి సారించారు. కాగా, ఇంకో పది మంది ఎక్కడున్నారనే విషయంపై కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల పోలీసులను అప్రమత్తం చేసినట్లు తెలిసింది.



బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు రాంచందర్‌రావు, మోత్కుపల్లి నర్సింహులు, కె.లక్ష్మణ్, డీకే అరుణ, చింతల రామచంద్రా రెడ్డి, వివేక్

# సమగ్ర వికాసానికి కేంద్రంగా ఐటీడీఏలు

**మంత్రి సత్యవతి రాథోడ్**

**సాక్షి, హైదరాబాద్:** సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను సమగ్ర వికాసానికి కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐటీడీఏలకు కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కార్యాచరణ ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని మూడు ఐటీడీఏలకు కొత్తగా నియమితులైన ప్రాజెక్టు అధికారులతో బుధవారం డీఎస్ఎస్ భవన్‌లో మంత్రి తొలిసారిగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పలు అంశాలపై చర్చించి ఆదేశాలు జారీ చేశారు. గిరిజనుల కోసం ఎలాంటి పథకాలు రూపొందిస్తే బాగుంటుందో ప్రభుత్వానికి సూచించవచ్చని, ఏయే పనులు చేస్తే వారి వికాసానికి ఉపయోగపడుతాయో పరిశీలించి ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లోని నిరక్షరాస్యత నిర్మూలించేందుకు సీఎం కేసీఆర్ చెప్పిన 'ఈచ్ వన్ టీచ్ వన్'పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు.



**కోవిడ్‌పై అవగాహన పెంచండి..**

ఐటీడీఏ ప్రాంతాల్లో కోవిడ్ వ్యాప్తిపై అవగాహన కల్పించాలని ప్రాజెక్టు అధికారులను మంత్రి ఆదేశించారు. ఐటీడీఏల్లోకి కొత్తగా వచ్చే వ్యక్తుల ద్వారా గానీ, ఇతర మార్గాల ద్వారా గానీ కోవిడ్ వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు భవేష్ మిశ్రా, గౌతమ్, హన్మంతు, అఖిలేశ్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




**PUBLIC NOTICE** MARUTI SUZUKI
**Maruti Suzuki India Limited**
Palam Gurgaon Road, Gurgaon - 122015

**Pre-Qualification of Traders for Disposal of Press Shop Steel Scrap**

Last date of submission of duly filled application form along with signed Terms & Conditions is **06-Apr-2020.**

Interested parties may visit MSIL website or contact the following MSIL persons (during office hours only) latest by 06-Apr-2020.

https://www.marutisuzuki.com/corporate/reach-us/business-opportunities.aspx

**Pramendra Kumar Pandey**
0124-4392449
PramendraKumar.Pandey@maruti.co.in

**Satyapal Sharma**
0124-4393668
Satyapal.Sharma@maruti.co.in

**Aranya Adhikary**
Dy. General Manager - SVR
Maruti Suzuki India Ltd.

## లక్ష దాటిన ఎంసెట్ దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** ఎంసెట్ దరఖాస్తులు లక్ష దాటాయి. బుధవారం సాయంత్రం 5:30 వరకు 1,09,155 దరఖాస్తులు వచ్చినట్లు ఎంసెట్ కమిటీ వెల్లడించింది. అందులో ఇంజనీరింగ్ కోసం 67,667 మంది, అగ్రికల్చర్ కోసం 41,488 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొంది. గత నెల 21న ప్రారంభమైన దరఖాస్తుల గడువు ఈ నెల 30తో ముగియనుంది. అప్పటివరకు మరో 50 వేల వరకు దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెల 30 తర్వాత ఆలస్య రుసుముతో దరఖాస్తులను స్వీకరించనుంది.

## పాలిటెక్నిక్ డిప్లొమా సెమిస్టర్ పరీక్షలు వాయిదా

**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్ వైరస్ ప్రభావంతో ఏప్రిల్ 4 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించాల్సిన పాలిటెక్నిక్ డిప్లొమా సెమిస్టర్ పరీక్షలను రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి (ఎస్‌బీటీఈటీ) వాయిదావేసింది. ఇప్పటికే అన్ని విద్యా సంస్థలను ఈనెల 31వ తేదీ వరకు మూసివేసిన నేపథ్యంలో ఆ ప్రభావం రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలపై పడకుండా ఈ చర్యలు చేపట్టినట్లు ఎస్‌బీటీఈటీ కార్యదర్శి మూర్తి తెలిపారు. 13 రోజుల పాటు ఈ పరీక్షలను వాయిదా వేశామని, ఏప్రిల్ 20వ తేదీ తర్వాతే పరీక్షలను నిర్వహిస్తామని చెప్పారు. ఇక వచ్చే నెల 17వ తేదీన పాలీసెట్–2020 ప్రవేశ పరీక్ష యథాతథంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

## ఇంటర్ పరీక్షలు పూర్తి

**సాక్షి, హైదరాబాద్:** ఇంటర్మీడియట్ ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 4వ తేదీన ప్రారంభమైన ఈ పరీక్షలు ఈనెల 23న (తక్కువ మంది ఉన్న కొన్ని ఇతర సబ్జెక్టుల) పూర్తి కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు మొత్తం 9.65 లక్షల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా బుధవారంతో ముగిసిన ప్రధాన పరీక్షల నాటికి 95.72శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు.

# తీర్మానం ఉపసంహరించుకునేలా ఆదేశించండి

**సీఏఏకు వ్యతిరేకంగా అసెంబ్లీ తీర్మానంపై రాష్ట్ర గవర్నర్‌కు బీజేపీ విజ్ఞప్తి**

**సాక్షి, హైదరాబాద్:** అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), ఎన్‌పీఆర్‌కు వ్యతిరేకంగా చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకునేలా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును ఆదేశించాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర బీజేపీ విజ్ఞప్తి చేసింది. బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, మాజీ ఎంపీ జి.వివేక్, మాజీ మంత్రి డీకే అరుణ, మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తదితరులు బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌పీఆర్ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. గవర్నర్‌ను కలసిన అనంతరం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించినందుకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పేలా చర్యలు చేపట్టాలని గవర్నర్‌ను కోరినట్లు వెల్లడించారు. ఎన్ఆర్‌సీపై కేంద్రం ఇంకా నిర్ణయమే తీసుకోలేదని, సీఏఏ దేశ ప్రజలకు వ్యతిరేకం కాదన్నారు. సీఏఏకు వ్యతిరేకంగా చేసిన అసెంబ్లీ తీర్మానం చెల్లదని తెలిసినా, ఎంఐఎం కోసమే దాన్ని చేశారన్నారు. పాకిస్తాన్ ముస్లింలకు దేశంలో పౌరసత్వం ఇవ్వాలని కేసీఆర్ అడుగుతున్నారని పేర్కొన్నారు. పాకిస్తాన్‌ని ఒప్పిస్తే అఖండ భారత్ ఏర్పాటు చేద్దామన్నారు. జిన్నా పాత్రను పోషిస్తున్న అసదుద్దీన్‌కు కేసీఆర్ వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు.

# రేవంత్‌రెడ్డికి బెయిల్

**నాటకీయ పరిణామాల మధ్య జైలు నుంచి తరలింపు**



**సాక్షి, హైదరాబాద్/కుషాయిగూడ:** ప్రముఖుడి నివాసంపై డ్రోన్ కెమెరాతో చిత్రీకరించారన్న అభియోగాల కేసులో అరెస్టయిన మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డికి బుధవారం హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల వ్యక్తిగత పూచీకత్తు సమర్పించాలని, రాజేంద్రనగర్ కోర్టు నిర్ణయించిన మొత్తానికి మరో ఇద్దరి పూచీకత్తులు సమర్పించాలని షరతులు విధించింది. దర్యాప్తునకు అధికారులకు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. బుధవారం ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గండికోట శ్రీదేవి బెయిల్ ఉత్తర్వులు జారీ చేశారు.

**నాటకీయ పరిణామాల మధ్య..**

చర్లపల్లి జైలులో ఉన్న రేవంత్‌రెడ్డికి బెయిల్ రావడంతో బుధవారం భారీ బందోబస్తు నడుమ పోలీసులు అతన్ని జైలు నుంచి తరలించారు. రేవంత్‌కి బెయిల్ మంజూరైన విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున చర్లపల్లి జైలు వద్దకు తరలిరావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రేవంత్‌రెడ్డి తరఫున వాదించిన సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్‌ను కలిసి వచ్చిన మాజీ ఎంపీ మల్లు రవిని పోలీసులు చక్రిపురం చౌరస్తాలో అడ్డుకున్నారు. ఈ క్రమంలో మల్లు రవికి పోలీసులకు నడుమ తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది.

**ఇక ఇక్కడే ఉండి పోరాటం చేస్తా: రేవంత్**

ఇక ఢిల్లీ వెళ్లకుండా హైదరాబాద్‌లోనే ఉంటానని, గొంతులో ప్రాణం ఉన్నంత వరకు టీఆర్ఎస్‌పై పోరాటం చేస్తానని రేవంత్‌రెడ్డి అన్నారు. జైలు నుంచి విడుదలైన అనంతరం మీడియాతో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఈ పోరాటం నా వ్యక్తిగతం కాదని, రెండు నెలల క్రితం కేసీఆర్ అవినీతిని బయటపెట్టాలని రాష్ట్ర ఇన్‌చార్జి కుంతియా నాకు బాధ్యతలు అప్పగించారన్నారు. కుంతియా ఆదేశాల మేరకు జన్వాడలోని కేటీఆర్ ఫామ్‌హౌస్‌ను రంగారెడ్డి జిల్లా నేతలతో కలిసి ప్రజలకు చూపించానన్నారు.



1035.2020

# సురక్షితంగా వైద్య విద్యార్థుల రాక

- కౌలాలంపూర్ నుంచి స్వదేశానికి చేరుకున్న 185 మంది విద్యార్థులు
- ఎయిర్ ఏషియా విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాక
- వైద్య సిబ్బంది స్క్రీనింగ్.. ఎవరిలోనూ కనిపించని కరోనా లక్షణాలు

**సాక్షి, విశాఖపట్నం:** కౌలాలంపూర్‌లో చిక్కుకుపోయిన వైద్య విద్యార్థులు ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి ఫలితంగా స్వదేశానికి చేరుకున్నారు. ఫిలిప్పీన్స్‌లో వైద్య విద్య అభ్యసిస్తున్న తెలుగు విద్యార్థులు కరోనా కారణంగా స్వస్థలాలకు బయలుదేరి, మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో విమాన సర్వీసులు రద్దు కావడంతో 185 మంది చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. వీరిలో విశాఖపట్నంతో పాటు శ్రీకాకుళం, తూర్పు గోదావరి, గుంటూరు, నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన వారితో పాటు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, వరంగల్.. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు చెందిన వారున్నారు. ఏం చేయాలో పాలుపోక దిక్కుతోచని స్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అభయమిచ్చింది. స్వయంగా సీఎం వైఎస్ జగన్ కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సంప్రదింపులు చేశారు. సీఎం కార్యాలయం, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ఏపీ భవన్ అధికారులు సమన్వయం చేసుకుంటూ కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం కౌలాలంపూర్ నుంచి ఢిల్లీ, విశాఖలకు ఎయిర్ ఏషియా విమాన సర్వీసు పునరుద్ధరణకు అనుమతించింది. దీంతో 185 మంది విద్యార్థులు బుధవారం సాయంత్రం 6.20కి విశాఖ (మరో 85 మంది ఢిల్లీ వెళ్లారు) చేరుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్ట్‌లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారుల ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి స్క్రీనింగ్ చేశారు. ఎవ్వరిలోనూ కరోనా లక్షణాలు కనిపించలేదు. అయినప్పటికీ 14 రోజుల పాటు ఇళ్లలోంచి బయటకు రావొద్దని సూచిస్తూ 6 ప్రత్యేక బస్సుల్లో చెన్నై, కర్ణాటక ఆయా ప్రాంతాలకు పంపించేశారు. కాగా కౌలాలంపూర్ నుంచి వచ్చిన విద్యార్థుల్లో తెలంగాణ నుంచి 10 మంది, ఏపీ నుంచి 91 మంది ఉన్నారు.

## అనాథ పిల్లల కోసం చట్టం తేవాలి

**రాజ్యసభలో ఎంపీ బండ ప్రకాష్**

**సాక్షి, న్యూఢిల్లీ:** అనాథ పిల్లల సామాజిక భద్రతకు చట్టం తేవాలని కేంద్ర ప్రభుత్వాన్ని టీఆర్ఎస్ ఎంపీ బండ ప్రకాష్ కోరారు. బుధవారం ఆయన రాజ్యసభ జీరోఅవర్‌లో ఈ అంశంపై మాట్లాడారు. 'దేశంలో 17 ఏళ్ల లోపు వయసున్న అనాథ పిల్లలు 2.57 కోట్ల మంది ఉన్నారని అంచనా. అనాథ పిల్లలను అనేక మంది దత్తత తీసుకుంటున్నప్పటికీ అనాథాశ్రమాల్లో, ఇతరత్రా ఆధారపడి జీవిస్తున్న పిల్లలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. అనాథల సమస్యను పరిష్కరించడానికి సంస్థలు ముందుకు వచ్చాయి. కానీ వారి హక్కుల రక్షణ కోసం నిలబడటం, సామాజికంగా వారిని శక్తివంతం చేయడం కోసం అవి పనిచేయవు. అనాథల హక్కులకు సంబంధించి పార్లమెంటులో నాలుగు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జువైనల్ జస్టిస్ యాక్ట్ కేవలం పదిహేడేళ్ల లోపు వారి గురించి పనిచేస్తుంది. ఆపై వయసున్న వారు ఈ చట్టం పరిధిలో రారు' అని అన్నారు.

## ఏపీలో అన్ని విద్యా సంస్థలు, హాస్టల్స్ మూత

**కరోనా నివారణ చర్యల్లో భాగంగా**
**జిల్లా కలెక్టర్లకు సీఎస్ నీలం సాహ్ని ఆదేశం**



**సాక్షి, అమరావతి:** కరోనా వైరస్ నివారణకు ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఏపీలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, వసతి గృహాలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు సహా కోచింగ్.. శిక్షణ కేంద్రాలన్నీ ఈ నెల 19వ తేదీ నుండి 31వ తేదీ వరకూ మూసి వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఆదేశించారు. కోవిడ్–19 నివారణకు ముందు జాగ్రత్త చర్యలపై బుధవారం సచివాలయంలో వివిధ శాఖల కార్యదర్శులతో సమీక్షించిన తర్వాత ఆమె జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 10 మందికి మించి ప్రజలు ఒక చోట గుమికూడకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ సోషల్ డిస్టెన్స్ (మనిషి మనిషికి మధ్య ఒక మీటర్ దూరం) పాటించేలా ప్రజలందరిలో అవగాహన కలిగించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# ఏపీలో 'కోడ్' రద్దు

**ఎన్నికల కోడ్ తొలగించాలని ఎస్ఈసీకి సుప్రీం ఆదేశం**



**సాక్షి, న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎత్తివేసి తిరిగి స్థానిక సంస్థల ఎన్నికల తేదీ నిర్ధారించాకే అమల్లోకి తేవాలని సుప్రీం కోర్టు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. ఎన్నికల తేదీ నిర్ధారణకు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఆదేశించింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థల ఎన్నికలను ఈనెల 15న అర్ధాంతరంగా వాయిదా వేయడాన్ని సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.ఎ.బాబ్డే, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం బుధవారం విచారించింది. 'ఎన్నికల కమిషన్ ఇప్పటికే స్థానిక ఎన్నికలను వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నందున తదుపరి ఎన్నికల తేదీ నిర్ణయించడానికి ముందు ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎన్నికల తేదీ కంటే 4 వారాలు ముందుగా తిరిగి అమల్లోకి తేవాలి. కోడ్‌ను తిరిగి అమల్లోకి వచ్చే వరకు ప్రస్తుత అభివృద్ధి కార్యక్రమాలకు అంతరాయం కలిగించరాదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏదైనా కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలనుకున్న పక్షంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ముందస్తు అనుమతితో చేపట్టాలి. కరోనా వైరస్‌ను ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏ పరిస్థితుల్లోనూ అడ్డుకోరాదు..'అని ఉత్తర్వులు జారీ చేస్తూ పిటిషన్‌ను పరిష్కరించింది.



# పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకోండి

## నేటి నుంచే టెన్త్ పరీక్షలు

- వీణావాణీ పరీక్షలు రాసేందుకు ఇద్దరు సహాయకులు
- వీలైనంత మేరకు మాస్క్‌లు ధరించండి: సత్యనారాయణరెడ్డి



### పరీక్ష రాసే విద్యార్థుల వివరాలు

| | |
|---|---|
| పాఠశాలలు: | 11,045 |
| పరీక్ష కేంద్రాలు: | 2,530 |
| మొత్తం విద్యార్థులు: | 5,34,903 |
| వీరిలో బాలురు: | 2,73,971 |
| బాలికలు: | 2,60,932 |
| రెగ్యులర్ విద్యార్థులు: | 5,09,079 |
| ప్రైవేటు విద్యార్థులు: | 25,824 |
| ఇన్విజిలేటర్లు: | 30,500 |
| సిట్టింగ్ స్క్వాడ్స్: | 144 |
| ఫ్లైయింగ్ స్క్వాడ్స్: | 4 |

సాక్షి, హైదరాబాద్

పదో తరగతి పరీక్షలు గురువారం ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వ పరీక్షల విభాగం పూర్తి చేసింది. ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు పరీక్ష సమయం కంటే కనీసం గంట ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఆలస్యంగా వెళ్లి నష్టపోవద్దని స్పష్టం చేశారు. కోవిడ్ నేపథ్యంలో విద్యార్థులు మాస్క్‌లు ధరించాలని, వాటర్ బాటిళ్లను అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో సబ్బులు, లిక్విడ్ సబ్బులు, శానిటైజర్లను అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అనారోగ్యంతో ఉన్న వారు ప్రత్యేక గదుల్లో పరీక్ష రాసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లపై ఎవరి సంతకం అవసరం లేకుండానే అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. సమస్యలు ఉంటే తమ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు (040–23230942) ఫోన్ చేయవచ్చని సూచించారు. అవిభక్త కవలలు వీణావాణీలకు స్టేట్ హోం సమీపంలోని పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, వారు సొంతంగా పరీక్ష రాస్తామని మొదట్లో చెప్పినా అది సాధ్యమయ్యే పరిస్థితి లేదన్నారు. అందుకే వారి విజ్ఞప్తి మేరకు సహాయకులను (స్క్రైబ్స్) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాధారణ పరీక్ష సమయం కంటే వారికి అదనంగా అరగంట సమయం ఇస్తామని తెలిపారు.



రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి నరసింహాచార్యులు నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న సురేశ్‌రెడ్డి, కె.కేశవరావు. చిత్రంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, హరీశ్‌రావు తదితరులు

# రాజ్యసభకు కేకే, సురేశ్‌రెడ్డి ఏకగ్రీవం

## పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామని వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర కోటాలో రాజ్యసభ సభ్యులుగా టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత డాక్టర్ కే.కేశవరావు, అసెంబ్లీ మాజీ స్పీకర్ కేఆర్ సురేశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. రాష్ట్ర కోటాలో ఖాళీగా ఉన్న రెండు రాజ్యసభ స్థానాలకు టీఆర్‌ఎస్ పక్షాన కేకే, సురేశ్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. శ్రమజీవి పార్టీ తరఫున నామినేషన్లు వేసిన జాజుల భాస్కర్, భోజరాజ్ కోయల్కర్ నామినేషన్లను ఈ నెల 16న జరిగిన పరిశీలనలో ఎన్నికల అధికారి తిరస్కరించారు. బుధవారం నామినేషన్ల ఉప సంహరణకు గడువు ముగియడంతో టీఆర్‌ఎస్ తరఫున నామినేషన్లు వేసిన కేకే, సురేశ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ ప్రకటించింది. రాజ్యసభలో రాష్ట్ర కోటా నుంచి ఏడుగురు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ప్రస్తుత ఎన్నికతో అన్ని స్థానాలు టీఆర్‌ఎస్ ఖాతాలో చేరాయి. అయితే టీఆర్‌ఎస్ తరఫున రాజ్యసభకు ఎన్నికైన డి.శ్రీనివాస్ ప్రస్తుతం పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు.

**కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం**

తనను వరుసగా రెండోసారి రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ అధినేత కేసీఆర్‌కు కేకే కృతజ్ఞతలు తెలిపారు. సురేశ్‌రెడ్డితో కలసి బుధవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో నెలకొన్న సంక్షోభ పరిస్థితుల్లో కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని కేశవరావు ప్రకటించారు. రాష్ట్ర ప్రజలు, పార్టీ కార్యకర్తలు గర్వపడేలా తన పనితీరు ఉంటుందని కేఆర్ సురేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై టీఆర్‌ఎస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కవిత ఎంపికతో పార్టీలో ఉత్సాహం: కర్నె



**సాక్షి, హైదరాబాద్:** నిజామాబాద్ మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితను శాసన మండలి స్థానిక సంస్థల కోటా అభ్యర్థిగా ఎంపిక చేయడంపై టీఆర్‌ఎస్‌లో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొందని మండలిలో ప్రభుత్వ విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. బుధవారం అసెంబ్లీ ఆవరణలోని టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు, పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. మాజీ ఎంపీ కవిత శాసన మండలి అభ్యర్థిత్వంపై పార్టీలో రెండో మాటలేదని, అందరూ ముకుమ్మడిగా స్వాగతించారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కవిత ఓటమి పట్ల ప్రజలు, పార్టీ నేతలు బాధ పడ్డారని, ప్రస్తుతం కవితకు శాసన మండలి ఎన్నికల్లో పోటీకి అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలిగా రాష్ట్ర సాధన ఉద్యమంలో కవిత కీలక పాత్ర పోషించారని, ఎంపీగా నిజామాబాద్‌కు ఆమె ఎంతో సేవ చేశారని ప్రభాకర్ తెలిపారు.

## క్రీడా మైదానాలను మూసేయాలి



**సాక్షి, హైదరాబాద్:** కోవిడ్–19 వ్యాప్తి చెందకుండా టూరిజం హోటల్స్, బోటింగ్‌లు, బార్లు, జిమ్‌లు, ప్రైవేటు స్విమ్మింగ్ పూల్స్, క్రీడా మైదానాలను స్వచ్ఛందంగా మూసివేయాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కోరారు. కోవిడ్ నియంత్రణకు ప్రభుత్వం విడుదల చేసిన నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలని, పర్యాటకులకు దీనిపై పూర్తి అవగాహన కల్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. రవీంద్రభారతి కార్యాలయం నుంచి కోవిడ్ నివారణకు తీసుకోవాల్సిన ముందుస్తు చర్యలపై అధికారులతో మంత్రి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ప్రైవేటు బస్ ఆపరేటర్లు, విదేశీ పర్యాటకుల ట్రావెల్స్ హిస్టరీని సేకరించాలని, ప్రైవేటు టూర్ ఆపరేటర్లు, ఆపరేట్ చేసే బస్సులలో ఎప్పటికప్పుడు శానిటైజేషన్‌ను చేయాలని సూచించారు. విమానాశ్రయం నుంచి విదేశీ పర్యాటకులను ప్రైవేటు టూర్స్ ఆపరేటర్లు తీసుకువచ్చిన వెంటనే సంబంధితశాఖ అధికారులకు వివరాలు అందజేయాలని మంత్రి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతికశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, ఎండీ మనోహర్, సంచాలకులు మామిడి హరికృష్ణ, క్రీడా అధికారులు సుజాత, టూరిజం అధికారులు ఓం ప్రకాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే విడతలో రుణమాఫీ చేయాలి

### సీఎంకు అఖిలభారత కిసాన్‌సభ విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ జీవో అమలులో భాగంగా రూ.50 వేల వరకు రుణం పొందిన రైతులకు ఒకే విడతలో మాఫీ చేయాలని, రూ.50 వేలు రుణం పైబడిన వారికి మూడు విడతల్లో మాఫీ చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు. కౌలుదారులకు (ఎల్ఈసీ)కార్డులున్న వారు, ప్రకృతి వైపరీత్యాల వల్ల రుణాలు రీషెడ్యూల్డ్ చేసినవారంతా కూడా పేదరైతులే అయినందున వారికి కూడా రుణమాఫీ వర్తింపజేయాలని బుధవారం సీఎంకు రాసిన లేఖలో కోరారు. 2014 ఏప్రిల్1 నుంచి 2018 ఆగస్టు 11 మధ్య అప్పు పొందిన స్వల్ప,దీర్ఘకాలిక రుణాలకు కూడా ఈ మాఫీని వర్తింపచేయాలని, ప్రతీ ఏడాది ఏప్రిల్ 15న బ్యాంకులకు మాఫీ మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించాలని సూచించారు.

## రూల్ ఆఫ్ రిజర్వేషన్ తప్పనిసరి

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



**సాక్షి, హైదరాబాద్:** ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ (ఆర్ఓఆర్) తప్పనిసరిగా పాటించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు. పదోన్నతుల ప్రక్రియలో తమకు అన్యాయం జరిగిందంటూ పలువురు వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం తమకు డీటీసీఓలుగా పదోన్నతులు ఇవ్వాల్సి ఉందని, కానీ ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించకపోవడంతో తమకు పదోన్నతులు రావడం లేదని ఫిర్యాదుచేశారు. దీనిపై స్పందించిన శ్రీనివాస్ పదోన్నతుల ప్రక్రియలో ఆర్ఓఆర్ పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కమిషన్ అండగా ఉంటుందని వివరించారు.

## ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

### సీపీఐ విజ్ఞప్తి

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవడంతో పాటు తగిన నిధులు విడుదల చేసి పేదలకు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ విజ్ఞప్తి చేసింది. కేంద్రం నుంచి నిధులు సకాలంలో విడుదల కాక, కేటాయించిన నిధులు తగ్గించి, నెలల తరబడి కూలీలకు డబ్బులు పెండింగ్‌లో ఉండడంతో ఈ మధ్య ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగుతున్నాయని ఒక ప్రకటనలో తెలిపింది. నిధుల కొరత కారణంగా 20 శాతం కూడా కూలీలకు పనులు కల్పించని గ్రామాలున్నాయని, దీనికి ఫీల్డ్ అసిస్టెంట్లను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం అన్యాయమని సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. ఇది పిచ్చుకపై బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లుగా ఉన్నందున, సస్పెన్షన్లు తొలగించి వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

## భారత రాజకీయాలకు వరం కేసీఆర్



**సాక్షి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భారత రాజకీయాలకు లభించిన వరమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)కు వ్యతిరేకంగా అసెంబ్లీ, మండలిలో తీర్మానం చేసినందుకు మహమూద్ అలీ సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. సీఏఏ, జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్), జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సీ)లపై దేశంలో వివిధ వర్గాల్లో నెలకొన్న ఆందోళనలు, భయాల నేపథ్యంలో వాటన్నింటినీ కేసీఆర్ తన ప్రసంగంలో ప్రస్తావించారన్నారు. సీఎం ప్రసంగంలోని అంశాలను సమాజంలోని సామాన్యులు, మేధావులు, ఇతర పార్టీలవారు ప్రశంసిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర, దేశ ప్రయోజనాల కోసం సీఎం కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించాలని అభిలషించారు.

## యూత్ కాంగ్రెస్ ఇంటర్వ్యూల్లో ఆసక్తికర ప్రశ్నలు

**సాక్షి, న్యూఢిల్లీ:** తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడి ఎంపికకు రెండు రోజులపాటు ఇక్కడ నిర్వహించిన ఇంటర్వ్యూలకు హాజరైన 28 మంది యువజన కాంగ్రెస్ నేతలకు ఆసక్తికర ప్రశ్నలు ఎదురయ్యాయి. ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి కృష్ణ అల్లవారు, యువజన కాంగ్రెస్ జాతీయ కమిటీ తాత్కాలిక అధ్యక్షుడు బీవీ శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి జేబీ మాథుర్ వీరిని ఇంటర్వ్యూ చేశారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మీరు ఏరకంగా సమర్థులు? పదవి వస్తే ఎలాంటి కార్యక్రమాలు చేపడతారు? మీకు కాని పక్షంలో ఎవరిని ఈ పదవికి సూచిస్తారు? వంటి సాధారణ ప్రశ్నలు అడిగారు. అయితే ఇందులో మరో ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. కొత్తగా పీసీసీ అధ్యక్ష పదవికి మీరు ఎవరిని సూచిస్తారని ప్రశ్నించినట్లు సమాచారం. వీరిలో ఎక్కువగా రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబుల పేర్లను సూచించినట్లు తెలిసింది.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్:1920/WGL/DMFT/ENC(R&B)/DCE(R)/EE-R/DEE-4/AEE1/2019, తేది.17.03.2020

NIT No.1920/WGL/DMFT/ENC(R&B)/DCE(R)/EE-R/DEE-4/AEE1/2019, తేది.17.03.2020 ప్రకారం వరంగల్ రీజియన్ (R&B) డిపార్ట్‌మెంట్‌లో DMFT క్రింద వరంగల్ రూరల్ జిల్లాలో 2 పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరుదార్లు టెండరు షెడ్యూళ్లను ఇ మార్కెట్‌ప్లేస్ అంటే https://tender.telangana.gov.in నుండి 20-03-2020న మ.3:00 గం. నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. టెండర్ల స్వీకరణకు ఆఖరు తేది: 28-03-2020న లేదా అలోగా మ. 3:30 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ అంటే https://tenders.telangana.gov.in లో చూడవచ్చును.

సం/- ఇంజినీర్-ఇన్-చీఫ్ (R&B), స్టేట్ రోడ్స్ & CRN

DIPR Ro.No.2681-DP/CL/Advt/1/2019-20, Dt:18-03-2020

INDIRA IVF
FERTILITY & IVF CENTRE

ఇన్‌ఫెర్టిలిటీని అధిగమించడానికి ఒక అడుగు దూరంలో ఉన్నారు
నేడే నిపుణుడిని సంప్రదించండి



పిల్లలు లేని జంటల కొరకు
ఉచిత చెకప్ క్యాంప్
ఐవిఎఫ్ మరియు టెస్ట్ ట్యూబ్ బేబీ కొరకు
Date : 17th to 31st March. 2020
వేదిక: ఇందిరా ఐవిఎఫ్ హైదరాబాద్ (దిల్‌షుక్ నగర్, సికింద్రాబాద్, బంజారాహిల్స్)
అపాయింట్‌మెంట్ ✆ 7412077801

ముఖ్యమైన సమాచారం
- మీరు ఉదయం 9-10 మధ్య సందర్శించవచ్చు, ఆసుపత్రి వారంలో 7రోజులు తెరిచి ఉంటుంది.
- ఐవిఎఫ్ ప్రక్రియకు వెళ్లే జంటలు తమ మొదటి సందర్శన సమయంలో రూ.10000/-డిపాజిట్ చేయాలి
- ఐడి ప్రూఫ్ మరియు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోగ్రాఫ్ తీసుకొని రావాలి

మా ఫెర్టిలిటీ నిపుణులతో మీ సందేహాలను చర్చించడానికి కాల్ చేయండి ✆ 7412077802 (2PM TO 5PM)

టెస్ట్ ట్యూబ్ బేబీ టెక్నిక్ (ఐవిఎఫ్/ఐసిఎస్ఐ)
₹ 89,999/-
చెకప్, ఐవిఎఫ్ ప్రొసీజర్, డాక్టర్ ఫీజులు, ఆసుపత్రి ఛార్జీలు, ఐవిఎఫ్ ఇంజెక్షన్ల ఖరీదు, ఐవిఎఫ్ ల్యాబ్ ఛార్జీలు చేర్చబడ్డాయి

రిజిస్ట్రేషన్ కొరకు
ఈ ప్యాకేజీని ఉపయోగించుకోవడానికి దయచేసి ఐవిఎఫ్ హెచ్‌డి అని 56677కు ఎస్ఎమ్ఎస్ పంపండి లేదా 7412077801 పై కాల్ చేయండి
Before : 31st March 2020

ఎవరు కన్సల్టేషన్‌ని ఎంచుకోవచ్చు
స్పెర్మ్ కౌంట్ తక్కువగా ఉండటం
స్పెర్మ్ కౌంట్ లేకపోవడం
అతి తక్కువ స్పెర్మ్ మొటిలిటీ
నాణ్యత తక్కువగా ఉండటం
ఫాలోపియన్ ట్యూబ్‌లు బ్లాక్ అయ్యాయి
అండం ఏర్పడటం విఫలం కావడం
రుతుచక్రం సక్రమంగా లేకపోవడం
చివరికి అండాలు విచ్ఛిన్నం కావడం

ఇందిరా ఐవిఎఫ్ హాస్పిటల్ ప్రయివేట్ లిమిటెడ్ www.indiraivf.com

దిల్‌షుక్ నగర్ (హైదరాబాద్)
సుయోగ్-పిఆర్‌కె టవర్స్, మూసారాంబాగ్ మెట్రో స్టేషన్ ఎదురుగా, కరాచీ బేకరీ పైన, దిల్‌షుక్ నగర్, హైదరాబాద్

బంజారాహిల్స్ (హైదరాబాద్)
మహేష్ బ్యాంక్ ఎదురుగా, రోడ్డు నెంబరు 01, ఆ లా లిబర్టీ హోస్టల్ పక్కన, బంజారాహిల్స్, హైదరాబాద్

సికింద్రాబాద్ (తెలంగాణా)
భువన టవర్స్, సిఎమ్ఆర్ ఎక్స్‌క్లూసివ్ షాపింగ్ మాల్, సరోజిని దేవి రోడ్డు, మంజూ థియేటర్ దగ్గర, సికింద్రాబాద్

లభ్యమయ్యే సర్వీస్‌లు- ఫెర్టిలిటీ చెకప్ •ఐయుఐ •ఐవిఎఫ్ •ఐసిఎస్ఐ •లేజర్ హ్యాచింగ్ •బ్లాస్టోసిస్ట్ •ల్యాప్రోస్కోపీ •హిస్టెరోస్కోపీ •డోనర్ సర్వీస్‌లు

Prenatal Sex Determination & Sex Selection is illegal and not done here.
Disclaimer : The models used in the creative is just for illustration purpose only.

● పాన్ ఇండియాలో 88 సెంటర్‌లు ● వ్యక్తిగత అవసరానికి తగ్గట్టుగా చికిత్సా ప్రోటోకాల్ ● రోగికి స్నేహపూర్వకంగా ఉండే ఆప్షన్‌లు

# భారత్ @ 158

**భారత్‌లో కోవిడ్ బాధితుల సంఖ్య 158 ● భారత సైన్యంలో తొలి కేసు నమోదు**
**మహారాష్ట్రలో 42, కేరళలో 27 కేసులు ● విదేశాల్లోని భారతీయుల్లో 276 మందికి ఈ వైరస్**

**న్యూఢిల్లీ/బెంగళూరు:** భారత్‌లో కరోనా వైరస్ సోకిన వారి సంఖ్య బుధవారానికి 158కి చేరింది. మంగళవారం నుంచి కొత్తగా 14 మంది ఈ వైరస్ బారిన పడ్డారు. వారిలో ఒక సైనికుడు కూడా ఉన్నారు. లద్దాఖ్ స్కౌట్ రెజిమెంట్‌కు చెందిన 34 ఏళ్ల సైనికుడికి కోవిడ్–19 పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని భారత సైన్యం ప్రకటించింది. ఇరాన్ నుంచి ఫిబ్రవరి 20న ఎయిర్ ఇండియా విమానంలో భారత్ తిరిగొచ్చిన తన తండ్రి నుంచి ఆ సైనికుడికి ఆ వైరస్ సోకిందని, అతడి తండ్రికి కూడా కోవిడ్ నిర్ధారణ అయిందని వెల్లడించింది. వారు లేహ్‌లోని చౌహత్ గ్రామానికి చెందినవారని తెలిపింది. ఆ సైనికుడి సోదరుడికి కూడా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే దిశగా ఆర్మీ చర్యలు ప్రారంభించింది. సెలవుపై వెళ్లి వచ్చిన సైనికులకు వైరస్ నిర్ధారణ పరీక్షలు జరపడం, ఫ్లూ లక్షణాలు ఉన్నవారిపై ప్రత్యేక దృష్టి పెట్టడం, అనవసర ప్రయాణాలను, అన్ని శిక్షణ కార్యక్రమాలను, సదస్సులను రద్దు చేయడం.. తదితర చర్యలు చేపట్టింది. ఈ వైరస్ సోకిన 158 మందిలో ముగ్గురు మృతులు, 25 మంది విదేశీయులు ఉన్నారు. ఏకాంతవాస కేంద్రాల(క్వారంటైన్ సెంటర్స్)ను సందర్శించి, అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ అధికారులను ఆదేశించారు. కోవిడ్ బాధితులతో సన్నిహితంగా ఉన్న దాదాపు 5700 మందిని వివిధ క్వారంటైన్ సెంటర్లలో ఉంచి, వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. బుధవారం వరకు మహారాష్ట్రలో అత్యధికంగా 42, కేరళలో 27, ఉత్తరప్రదేశ్‌లో 16, కర్ణాటకలో 11, ఢిల్లీలో 10, లద్దాఖ్‌లో 8, తెలంగాణలో 13 కేసులు నమోదయ్యాయి. హరియాణాలో కోవిడ్ బారిన పడిన 17 మందిలో 14 మంది విదేశీయులే కావడం గమనార్హం. దేశవ్యాప్తంగా చికిత్స అనంతరం కోలుకుని 14 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఇటీవల సౌదీ అరేబియా వెళ్లి వచ్చిన బీజేపీ ఎంపీ సురేశ్ ప్రభు స్వీయ గృహ నిర్బంధం విధించుకున్నారు.



షిర్డీ సాయిబాబా గర్భగుడి మూసేయడంతో బయట నుంచి దర్శనం చేసుకుంటున్న భక్తులు

### విదేశాల్లోని భారతీయులకు..

విదేశాల్లోని భారతీయుల్లో 276 మందికి కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని విదేశాంగ శాఖ సహాయమంత్రి వీ మురళీధరన్ బుధవారం లోక్‌సభకు లిఖిత పూర్వకంగా తెలిపారు. వారిలో ఇరాన్‌లోని 255 మంది, యూఏఈలోని 12 మంది, ఇటలీలోని ఐదుగురు, శ్రీలంక, కువైట్, రువాండా, హాంకాంగ్‌ల్లో ఒక్కొక్కరు చొప్పున ఉన్నారన్నారు. యూఏఈలో 8 మంది భారతీయులను క్వారంటైన్ చేసినట్లు వెల్లడించారు. ఇరాన్‌లో సుమారు 6 వేల మంది భారతీయులున్నారన్నారు. వారిలో జమ్మూకశ్మీర్, లద్దాఖ్, మహారాష్ట్రల నుంచి పుణ్యక్షేత్ర సందర్శనకు వెళ్లిన 1100 మంది, కేరళ, ఇతర రాష్ట్రాల నుంచి వెళ్లిన 1000 మంది మత్స్యకారులు, జమ్మూకశ్మీర్ సహా పలు రాష్ట్రాల నుంచి వెళ్లిన 300 మంది విద్యార్థులు ఉన్నారని వెల్లడించారు. ఇప్పటివరకు ఇరాన్ నుంచి 389 మందిని వెనక్కు తీసుకువచ్చామన్నారు.

### ఐఐటీ బాంబే బంద్

- కరోనా ముప్పు నేపథ్యంలో.. దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు ఎలాంటి సామూహిక కార్యక్రమాలు నిర్వహించకూడదని బీజేపీ నిర్ణయించింది.
- మా పరుపులు వాడితే కరోనా వైరస్ రాదని ప్రచారం చేస్తున్న ఒక వ్యాపారిపై మహారాష్ట్రలోని థానేలో కేసు నమోదైంది.
- కోవిడ్–19 లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయొద్దని, బాధ్యతాయుతంగా ప్రవర్తించి, వెంటనే వైద్యుల పర్యవేక్షణలోకి వెళ్లాలని పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరోనాపై నకిలీ వార్తలు ప్రచారం చేసేవారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.
- కరోనా వైరస్ నుంచి రక్షిస్తుందని పేర్కొంటూ గో మూత్రాన్ని పంపిణీ చేసే కార్యక్రమాన్ని నారాయణ చటర్జీ అనే బీజేపీ కార్యకర్త కోల్‌కతాలో మంగళవారం నిర్వహించారు. ఆ గోమూత్రం సేవించి, అనారోగ్యం పాలయిన ఒక వ్యక్తి ఫిర్యాదు చేయడంతో పోలీసులు చటర్జీని అరెస్ట్ చేశారు.
- ఐఐటీ బాంబే క్యాంపస్‌ను మార్చి 31 వరకు మూసేస్తూ నిర్ణయం తీసుకున్నారు.
- లండన్‌లో వేలాదిగా ఉన్న భారతీయులు ఇండియాకు తిరిగి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయమై అక్కడి హైకమిషన్‌ను అభ్యర్థిస్తున్నారు. అయితే, బ్రిటన్ నుంచి వచ్చే ప్రయాణికులపై మార్చి 31 వరకు భారత్ నిషేధం విధించిన విషయం తెలిసిందే. బ్రిటన్‌లో కోవిడ్ కారణంగా 104 మంది చనిపోగా, దాదాపు 2 వేల మందికి ఈ వైరస్ సోకింది.
- పారా మిలటరీ సిబ్బందికి సంబంధించిన అన్ని అత్యవసరం కాని సెలవులను రద్దు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.



పార్లమెంట్ వద్ద ఉపరాష్ట్రపతి వెంకయ్యకు థర్మల్ స్క్రీనింగ్ దృశ్యం

### రాజ్యసభలో మాస్కుల కలకలం

రాజ్యసభకు తొలిసారి ఎంపీ డెరెక్ ఓ బ్రేన్ సహా నలుగురు టీఎంసీ సభ్యులు మాస్కులతో వచ్చారు. సభా నిబంధనల ప్రకారం సభ్యులు మాస్కులు ఉపయోగించరాదని సభ చైర్మన్ వెంకయ్యనాయుడు తొలుత అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే, కరోనా ముప్పు నేపథ్యంలో మాస్కుల వినియోగం తప్పనిసరి అని, దీనిపై ప్రభుత్వం మార్గదర్శకాలను కూడా జారీ చేసిందని, అందువల్ల మాస్కులను అనుమతించాలని కాంగ్రెస్ సభ్యుడు చిదంబరం కోరడంతో, వెంకయ్యనాయుడు అంగీకరించారు. కరోనా ముప్పు పొంచి ఉందని, అందువల్ల బడ్జెట్ సమావేశాలను కుదించాలని కాంగ్రెస్ సహా పలు పార్టీల సభ్యులు అభ్యర్థించారు. వివిధ వర్గాల ప్రజలను కలుసుకుంటూ ఉంటామని, అందువల్ల ఎంపీలకు వైరస్ ముప్పు అధికంగా ఉంటుందని, ఎంపీలమైనందువల్ల ఆ వైరస్ మన జోలికి రాదని అనుకోకూడదని కాంగ్రెస్ సభ్యుడు రాజీవ్ గౌడ వ్యాఖ్యానించారు. అయితే, ఈ అభ్యర్థనను ప్రభుత్వం తోసిపుచ్చింది.

## సబ్బుల ధరలపై కేంద్రం దృష్టి

**న్యూఢిల్లీ:** కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్న నిత్యావసరాలైన సబ్బులు, నేలలు తుడిచే క్లీనర్లు, థర్మల్ స్కానర్ల ధరలను కేంద్రం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ తెలిపారు. సాధారణంగా ఈ శాఖ దేశవ్యాప్తంగా 22 నిత్యావసరాల ధరలను పర్యవేక్షిస్తుంటుంది. తాజాగా ఫేస్ మాస్కులు, చేతి శానిటైజర్లను ఆ జాబితాలో చేర్చింది. 'కోవిడ్ కారణంగా డిమాండ్ పెరిగిన సబ్బులు, లైజాల్, డెటాల్ వంటి చేతులు, నేలలు శుభ్రపరిచే క్లీనర్ల ధరలను మేం పర్యవేక్షిస్తున్నాం'అని కేంద్ర మంత్రి వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న 114 కేంద్రాల ద్వారా ఈ ఉత్పత్తుల ధరలను కేంద్రం పర్యవేక్షిస్తోంది. 22 నిత్యావసర వస్తువుల్లో బియ్యం, గోధుమలు, గోధుమ పిండి, పప్పు ధాన్యాలు, నూనెలు, కూరగాయలు, చక్కెర, పాలు, టీ, ఉప్పు తదితరాలు ఉన్నాయి. కోవిడ్‌పై ప్రజల్లో అవగాహన పెరగడంతో వేరే దేశాలతో పోలిస్తే భారత్‌లో తక్కువగా వ్యాపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

### జేఈఈ, సీబీఎస్‌ఈ పరీక్షలు వాయిదా

**న్యూఢిల్లీ:** 10, 12 తరగతులకు జరుగుతున్న బోర్డు పరీక్షలను సీబీఎస్‌ఈ(సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) మార్చి 31 వరకు వాయిదావేసింది. 'భారత్‌లో, విదేశాల్లో జరుగుతున్న క్లాస్ 10, క్లాస్ 12 పరీక్షలను మార్చి 31 వరకు వాయిదా వేస్తున్నాం. ఆ పరీక్షలను తదుపరి ఎప్పుడు నిర్వహించేదీ.. పరిస్థితులను సమీక్షించి, త్వరలో ప్రకటిస్తాం' అని సీబీఎస్‌ఈ బుధవారం వెల్లడించింది. పరీక్ష పత్రాల మూల్యాంకన విధులను కూడా మార్చి 31 వరకు వాయిదా వేస్తున్నట్లు స్పష్టం చేసింది. అయితే, తమ 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను వాయిదా వేయలేదని ఐసీఎస్ఈ(ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) ప్రకటించింది. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఐఐటీ ఇతర ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) మెయిన్ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్ష ఏప్రిల్ 5 నుంచి 11 వరకు జరగాల్సి ఉండగా, వాయిదా వేసినట్లు హెచ్చార్డీ శాఖకు చెందిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రత ముఖ్యమని, అందువల్ల అన్ని పరీక్షలను వాయిదా వేయాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ సీబీఎస్సీ, ఇతర విద్యాసంస్థలను ఆదేశించిన నేపథ్యంలో సీబీఎస్సీ పై నిర్ణయం ప్రకటించింది.



మలేసియా- సింగపూర్‌లను కలిపే జొహోర్ బహ్రూ పై ఓవర్ దారులు నిర్మానుష్యంగా మారిన దృశ్యం



ఇండోనేసియాలోని సురబయ సిటీలో షాపింగ్ మాల్ లిఫ్ట్‌లో ఒకరికొకరు తగలకుండా నిర్దేశిత బాక్స్‌ల్లో నిల్చొని సందర్శకులు

## కేసులు 2 లక్షలు | మరణాలు 8 వేలు

### ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తున్న కోవిడ్

**అమెరికాలో వంద దాటిన మృతుల సంఖ్య ● ఇరాన్‌లో 1135 మంది మృతి**
**చైనాలో బుధవారమూ ఒక్క కేసే ● దక్షిణ కొరియాలోనూ తగ్గుముఖం**

**పారిస్/వాషింగ్టన్:** ప్రపంచవ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 2 లక్షలు దాటింది. బుధవారం ఉదయానికి దాదాపు 2,00,680 మంది ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడ్డారు. 8,092 వేల మంది మరణించారు. మరణాల సంఖ్యలో ఆసియాను యూరోప్ దాటింది. కోవిడ్‌తో ఇప్పటివరకు ఆసియాలో 3,384 మంది చనిపోగా, యూరప్‌లో 3,422 మంది మరణించారు. చైనా, ద.కొరియాల్లో కొత్తగా నమోదైన కేసుల సంఖ్య భారీగా తగ్గింది. చైనాలో బుధవారం కూడా కొత్తగా ఒక్క కేసు మాత్రమే నమోదైంది.

### అమెరికాలో..

అమెరికాలో కరోనాతో చనిపోయినవారి సంఖ్య బుధవారానికి 105కి చేరింది. మొత్తం 50 రాష్ట్రాలు ఈ వైరస్ బారిన పడ్డాయి. దేశవ్యాప్తంగా కేసుల సంఖ్య 6500కి పెరిగింది. దేశవ్యాప్తంగా మెడికేర్ టెలీహెల్త్ సేవలను వినియోగించుకోవాలని ప్రజలను అధ్యక్షుడు ట్రంప్ కోరారు. ఫోన్ లేదా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్య సేవలు పొందాలన్నారు. కనిపించని శత్రువుతో చేస్తున్న ఈ యుద్ధాన్ని గెలిచి తీరాలన్నారు. కరోనా వ్యాప్తిని అడ్డుకునేందుకు న్యూయార్క్ వ్యాప్తంగా సామూహిక క్వారంటైన్‌ను ప్రకటించే అవకాశముందని మేయర్ బిల్ డి బ్లేసియో పేర్కొన్నారు. మొత్తం 86 లక్షల మంది పౌరులను ఇళ్లలోనే నిర్బంధించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

### యూరోపియన్ యూనియన్

వైరస్ వ్యాప్తిని నిరోధించే ఉద్దేశంతో సరిహద్దులను మూసేస్తూ యూరోపియన్ యూనియన్ నిర్ణయం తీసుకుంది. ఇతర దేశాల ప్రజలు 30 రోజుల పాటు ఈయూ దేశాల్లోకి రాకూడదని నిషేధం విధించింది. యూరోప్‌లో మొత్తం 3,422 మరణాలు చోటు చేసుకోగా.. వాటిలో ఇటలీలోనే 2,978 మంది చనిపోయారు.

### ఇరాన్‌లో..

మరోవైపు, ఇరాన్‌లో కరోనా మృత్యుఘంటికలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఒక్క రోజే 147 మంది ఈ వైరస్‌తో మృత్యువాత పడ్డారు. బుధవారం వరకు ఈ దేశంలో కోవిడ్‌తో మరణించినవారి సంఖ్య 1,135కి చేరింది. 1,192 కొత్త కేసులతో మొత్తం నిర్ధారిత కేసుల సంఖ్య 17,161కి పెరిగింది.

### ఆఫ్రికాలో..

వైద్య సదుపాయాలు అతి తక్కువగా ఉండే ఆఫ్రికాలో ఇప్పటివరకు సుమారు 500 కేసులు నమోదయ్యాయి. బుర్కినాఫాసోలో తొలి మరణం చోటు చేసుకుంది. లాటిన్ అమెరికాలో 1100 కేసులు నమోదయ్యాయి. బ్రెజిల్‌లో మంగళవారం తొలి మరణం నమోదైంది.

### ఆస్ట్రేలియాలో..

ఆస్ట్రేలియాలో 454 మంది ఈ వైరస్ బారిన పడ్డారు. ఐదుగురు మరణించారు. ప్రధాని మోరిసన్ దేశవ్యాప్తంగా 'హ్యూమన్ బయో సెక్యూరిటీ ఎమర్జెన్సీ'ని ప్రకటించారు. అనవసర విదేశీ ప్రయాణాలను రద్దు చేసుకోవాలని ప్రజలను కోరారు. సామూహిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు.

### నిరుద్యోగం పెరుగుతుంది

కరోనాతో విశ్వవ్యాప్తంగా నిరుద్యోగం భారీగా పెరిగే ప్రమాదముందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. 2.5 కోట్ల మంది ఉపాధి కోల్పోయే వీలుంది. ఈ ఏడాది చివరి నాటికి సుమారు మూడున్నర లక్షల కోట్ల ఆదాయాన్ని కార్మికులు కోల్పోతారని తెలిపింది.

### రాణి అపాయింట్‌మెంట్స్ రద్దు

- 94 ఏళ్ల బ్రిటన్ రాణి ఎలిజబెత్ 2, రానున్న కొన్ని నెలల పాటు తన అన్ని అపాయింట్‌మెంట్స్‌ను రద్దు చేసుకున్నారు. గురువారం బకింగ్‌హామ్‌ప్యాలెస్ నుంచి విండ్సర్ క్యాజిల్‌కు తన విడిదిని మార్చుకోనున్నారు.
- కరోనాపై పోరుకు 500 కోట్ల డాలర్ల ఆర్థిక సాయం చేయాలంటూ వెనెజువెలా చేసిన అభ్యర్థనను ఐఎంఎఫ్ తోసిపుచ్చింది.
- వైరస్ విజృంభణ నేపథ్యంలో తమ దేశంలో అత్యాధునిక వైద్య సదుపాయాలు లేవని ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జొంగ్ ఉన్ అంగీకరించారు. సత్వరమే వైద్య సౌకర్యాలను ఆధునీకరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



శ్రీలంకలోని కొలంబోలో పరేడ్‌లో మాస్కులు ధరించిన మహిళా పోలీసులు

## ఇటలీలో ఒక్కరోజే 475 మంది మృతి

**రోమ్:** ఇటలీలో ఒక్కరోజే 475 మంది చనిపోయారు. కరోనా కారణంగా ఇంత భారీ సంఖ్యలో ఒక్కరోజే మరణాలు సంభవించడం ఇంతవరకు ఏ దేశంలోనూ జరగలేదు. దీంతో, ఇటలీలో మొత్తం మరణాల సంఖ్య 2,978కి, కేసుల సంఖ్య 35,713కి చేరింది.

## నేడు ప్రధాని సందేశం

**న్యూఢిల్లీ:** భారత్‌లో కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం దేశ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. 'మార్చి 19 రాత్రి 8 గంటలకు ప్రధాని మోదీ జాతినుద్దేశించి ప్రసంగిస్తారు. తన ప్రసంగంలో ఆయన కోవిడ్–19, దాని నివారణకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తారు' అని ప్రధాని కార్యాలయం బుధవారం ట్వీట్ చేసింది. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించే దిశగా చేపట్టిన చర్యలపై బుధవారం ప్రధాని ఉన్నత స్థాయి సమీక్ష కూడా జరిపారని మరో ట్వీట్‌లో వెల్లడించింది.

## రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్

**వాషింగ్టన్:** నవంబర్‌లో జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ప్రస్తుత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీపడనున్నారు. స్వరాష్ట్రమైన ఫ్లోరిడా నుంచే అమెరికా అధ్యక్షపదవికి పోటీ చేయగలిగిన ప్రతినిధుల మద్దతును ట్రంప్ కలిగి ఉన్నారు. జాతీయ ప్రతినిధుల సంఖ్య ప్రకారం మంగళవారం నాటికి ట్రంప్‌కు 1,330 మంది ప్రతినిధుల మద్దతు లభించింది. సాధారణంగా రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష పదవికి పోటీచేసే అభ్యర్థికి మొత్తం 2,550 ప్రతినిధుల సంఖ్యలో తన తరఫున కనీసం 1,276 మంది ప్రతినిధుల మద్దతును కలిగి ఉండాలి.

## మధ్యాహ్న భోజనం పరిస్థితేంటి?

- **కోవిడ్ నేపథ్యంలో స్కూళ్లు మూతపడటంతో రాష్ట్రాల వివరణ కోరిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ కారణంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో పాఠశాలలను మూసివేయంతో అందులో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఎలా అందిస్తారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ మేరకు కోర్టు పలు రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు బుధవారం నోటీసులు జారీ చేసింది. కరోనా కారణంగా చాలా స్కూళ్లు మూతపడటంతో కోర్టు సుమోటోగా కేసును స్వీకరించి విచారించింది. కోవిడ్–19 వ్యాప్తి దృష్ట్యా ఢిల్లీతోపాటు అనేక రాష్ట్రాల్లోని పాఠశాలలు మార్చి 31 వరకు మూసివేస్తున్నట్లు ఆ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆదేశాలు జారీచేశాయి.

### ఒమర్ విడుదలపై వారంలో తేల్చండి

జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విడుదలపై వారంలోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 37 రద్దు సమయంలో రాష్ట్రంలో అల్లర్లు చెలరేగకుండా ఉండేందుకు ప్రభుత్వం గతేడాది ఆగస్టులో ఒమర్‌ను నిర్బంధించింది. ఒమర్ నిర్బంధంపై ఆయన సోదరి సారా అబ్దుల్లా దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఆర్. షా ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఒమర్ విడుదలకు సంబంధించి వారంలోగా వివరణ ఇవ్వాలని కేంద్రం, జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగాలను ఆదేశించింది. 'ఒమర్‌ను విడుదల చేస్తారా? లేదా? ఒకవేళ చేయాలని భావిస్తే వెంటనే విడుదల చేయండి. లేని పక్షంలో ఈ పిటిషన్‌పై విచారణ చేపడతాం'అని పేర్కొంది. ఈ కేసులో వాదనలు వినిపించాల్సిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వేరే కోర్టులో వేరే కేసు విచారణలో ఉన్నారని ప్రభుత్వం తరఫు న్యాయవాది సుప్రీంకోర్టుకు తెలిపారు.

## ఎమ్మెల్యేలను నిర్బంధించవద్దు

- వారు స్వేచ్ఛగా ఓటేసే పరిస్థితులు ఉండాలి
- మధ్యప్రదేశ్ రాజకీయంపై సుప్రీం
- నేటికి వాయిదా

**భోపాల్/న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టు వేదికగా మధ్యప్రదేశ్ రాజకీయం బుధవారం ఆసక్తికర పరిణామాలకు దారితీసింది. తిరుగుబాటు ఎమ్మెల్యేలపై అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై వాడివేడి వాదనలు జరిగాయి. కమల్‌నాథ్ ప్రభుత్వం మనుగడ 16 మంది రెబెల్ ఎమ్మెల్యేల చేతుల్లో ఉందని కోర్టు అంగీకరిస్తూనే.. బలపరీక్షను నిర్ణయించే అసెంబ్లీ కార్యకలాపాల్లోకి తాము రాదల్చుకోలేదని స్పష్టంచేసింది. అయితే అసమ్మతి ఎమ్మెల్యేలు వారి ఇష్టప్రకారం స్వేచ్ఛగా ఓటు వేయడానికి ఎలాంటి పరిస్థితులు కల్పిస్తారని ప్రశ్నించింది. 'రెబెల్ ఎమ్మెల్యేలు శాసనసభకు వెళ్లాలా లేదా అనేది వారి ఇష్టం. వారిని నిర్బంధంలో ఉంచారన్న ఆరోపణలు వచ్చినప్పుడు వారు స్వేచ్ఛగా ఉన్నారా లేదా అనేది మేము చూడాలి. వారిని నిర్బంధంలో ఉంచకూడదు'అని స్పష్టం చేసింది. రెబెల్ ఎమ్మెల్యేలను గురువారం జడ్జి చాంబర్‌లో హాజరుపరుస్తామని మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ చేసిన ప్రతిపాదనను కోర్టు తోసిపుచ్చింది. వారు నిర్బంధంలో లేరని ఎలా నమ్మాలో చెప్పాలంటూ చౌహాన్ తరఫు లాయర్ ముకుల్ రోహత్గీని అడిగింది. అయితే వారు స్వచ్ఛందంగానే బెంగళూరులో ఉన్నారని, నిర్బంధంలో లేరని ఆయన సమాధానం ఇచ్చారు. రెబెల్ ఎమ్మెల్యేల లాయర్ మణిందర్ సింగ్ కల్పించుకొని, స్పీకర్ ముందుకు తమ ఎమ్మెల్యేలు రాబోవడం లేదని, కొందరి రాజీనామాలను స్వీకరించి మరికొందరివి ఎలా నిలిపివేస్తారని ప్రశ్నించారు. కర్ణాటకలోని బీజేపీ ప్రభుత్వం తమ ఎమ్మెల్యేలను నిర్బంధంలో ఉంచిందని, వారిని కలిసేందుకు అనుమతించేలా కేంద్రానికి, కర్ణాటక ప్రభుత్వానికి ఆదేశాలివ్వాలని కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేయగా.. రాజ్యాంగపరంగా ఎదురయ్యే అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు తాము సిద్ధమేగానీ.. కాంగ్రెస్ నేతలతో కలవబోమని తిరుగుబాటు ఎమ్మెల్యేలు వాదించారు.



బుధవారం బెంగళూరులో డీకే శివకుమార్‌తో దిగ్విజయ్

**బీజేపీ హిట్లర్ పోకడ: కమల్‌నాథ్**

మధ్యప్రదేశ్ కాంగ్రెస్ రెబెల్ ఎమ్మెల్యేలున్న రిసార్ట్ వద్ద ఆ పార్టీ నేత దిగ్విజయ్‌సింగ్ ఆందోళనకు దిగగా అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దిగ్విజయ్‌ను అరెస్ట్ చేయడం బీజేపీ హిట్లర్ తరహా నియంతృత్వ పోకడలకు నిదర్శనమని సీఎం కమల్‌నాథ్ అన్నారు. ఆరుగురు మంత్రుల రాజీనామాలను ఆమోదించి ధైర్యమైన నిర్ణయం తీసుకున్నారని మధ్యప్రదేశ్ గవర్నర్ లాల్జీ టాండన్.. అసెంబ్లీ స్పీకర్ ప్రజాపతిని కొనియాడారు.

## కోవిడ్ ఎఫెక్ట్: 6 నెలల రేషన్ ఒకేసారి

**న్యూఢిల్లీ:** వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద ఉన్న 75 కోట్ల లబ్ధిదారులు 6 నెలల రేషన్ సరుకులను ఒకేసారి తీసుకోవచ్చని కేంద్ర మంత్రి పాశ్వాన్ తెలిపారు. ప్రస్తుతం లబ్ధిదారులు గరిష్టంగా 2 నెలల వరకు రేషన్ సరుకులను తీసుకునేందుకు అవకాశం ఉండగా.. పంజాబ్ ఇప్పటికే ఆరు నెలల సరుకులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. 'గోదాముల్లో సరిపడా సరుకులున్నాయి. పేద వారికి ఆరు నెలల రేషన్ సరుకులు ఒకేసారి ఇవ్వాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచించాం'అని పాశ్వాన్ చెప్పారు. ప్రభుత్వం వద్ద ప్రస్తుతం 435 లక్షల టన్నుల మిగులు ఆహార ధాన్యాలున్నాయని, అందులో 272.19 లక్షల టన్నుల బియ్యం, 162.79 లక్షల టన్నుల గోధుమలున్నాయని పేర్కొన్నారు.

## కృత్రిమంగా తయారు చేసింది కాదు!

**లాస్ ఏంజెలెస్:** ప్రపంచాన్ని వణికిస్తున్న కోవిడ్–19 వ్యాధి కారక కరోనా వైరస్ పరిశోధనశాలలో కృత్రిమంగా తయారైంది కాదని, పరిణామ క్రమంలో భాగంగా ప్రకృతిలో సహజసిద్ధంగా పరిణమించిన సూక్ష్మజీవేనని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు. గబ్బిలాల్లో ఉండిపోయి.. ఒకానొక సందర్భంలో మనుషులకు చేరిందని... తద్వారా లక్షల మందికి విస్తరించినట్లు తాము అంచనా వేస్తున్నామని స్క్రిప్స్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. నేచర్ మెడిసిన్ తాజా సంచికలో ప్రచురితమైన పరిశోధన వ్యాసం ఇదే విషయాన్ని చెబుతోంది. కరోనా వైరస్‌తోపాటు సార్స్ తదితర వైరస్‌ల జన్యుక్రమాలను విశ్లేషించడం ద్వారా తామీ అంచనాకు వచ్చినట్లు తెలిపారు. కరోనా వైరస్ జన్యుక్రమంలో కృత్రిమంగా చేర్చిన భాగాలేవీ లేవని తద్వారా ఇది సహజసిద్ధంగా పరిణమించిన సూక్ష్మజీవి అనడంలో ఎలాంటి సందేహం లేదని ఈ పరిశోధనలో పాల్గొన్న శాస్త్రవేత్త క్రిస్టియాణ్ అండర్సన్ తెలిపారు. కరోనా వైరస్ మూలభాగం ఇతర వైరస్‌ల కంటే భిన్నంగా ఉందని... పైగా గబ్బిలాలు, పాంగోలిన్‌కు సంబంధించిన వైరస్‌లను పోలి ఉందని క్రిస్టియన్ వివరించారు. కోవిడ్–19 వ్యాప్తి చెందుతున్న తరుణంలో ఇది మానవ నిర్మితమైందన్న వదంతులు చాలా వ్యాపించాయని, వాటన్నింటికీ తమ పరిశోధన స్పష్టమైన సమాధానం చెబుతోందని అన్నారు.

## నిర్భయ దోషుల ఉరికి డమ్మీ పూర్తి

**న్యూఢిల్లీ/ఔరంగాబాద్:** నిర్భయ దోషుల ఉరికి సర్వం సిద్ధమవుతోంది. మీరట్ నుంచి తలారి పవన్ తీహార్ జైలుకు చేరుకొని బుధవారం డమ్మీ ఉరి వేసి తాళ్లను పరీక్షించారని జైలు అధికారులు తెలిపారు. దోషులకు ఉరి వేసేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన మనీలా తాళ్లను ఉపయోగిస్తారు. తలారి పవన్ వీటినే పరీక్షించారు. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడిన ఉరి, ఈ నెల 20న తెల్లవారుజామున 5:30 గంటలకు ఖరారైన సంగతి తెలిసిందే. నలుగురు దోషుల్లో ఒకరు ఢిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను తాజాగా కోర్టు కొట్టేసింది. దక్షిణాసియాలోనే అతి పెద్దదైన తీహార్‌లో ఒకే నేరానికి సంబంధించి నలుగురిని ఉరి తీయడం ఇదే మొదటిసారి. నిర్భయ కేసు దోషుల్లో ఒకరైన అక్షయ్ ఠాకూర్ భార్య తనకు విడాకులు ఇప్పించాలని కోరుతూ ఔరంగాబాద్ కోర్టులో కేసువేశారు. రేప్ చేసిన వ్యక్తికి భార్యగా కొనసాగడం తనకు ఇష్టంలేదని పునీతా మంగళవారం పిటిషన్ దాఖలు చేయగా గురువారం దీనిపై విచారణ జరిగే అవకాశం ఉంది.

సాక్షి
గురువారం, మార్చి, 19

# హక్కుల రక్షణలో అలసత్వం

దళిత వర్గాల హక్కుల పరిరక్షణకు ఎంతో చేస్తున్నామని చెప్పుకునే ప్రభుత్వాల పరువు తీసే నిజాలివి. దేశంలో అత్యధిక ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక) చట్టం అమలు తీరును పర్యవేక్షించడంలో, తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నాయని మంగళవారం లోక్‌సభలో కేంద్ర సామాజిక న్యాయ మంత్రి తావర్‌చంద్ గెహ్లోత్ చేసిన ప్రకటన వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది. రాజ్యాంగంలోని వివిధ అధికరణలు షెడ్యూల్ కులాలు, తెగల రక్షణకు పూచీపడుతున్నాయి. ముఖ్యంగా 17వ అధికరణ అంటరానితనాన్ని ఏ రూపంలో పాటించినవారైనా శిక్షార్హులని చెబుతోంది. ఆ అధికరణకు అనుగుణంగా 1955లో అంటరానితనాన్ని నిషేధించే చట్టాన్ని తీసుకొచ్చారు. దానికి మరింత పదునుపెడుతూ 1976లో పౌరహక్కుల రక్షణ చట్టాన్ని చేశారు. అయితే అందులోని లోపాలను పరిహరిస్తూ 1989లో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం వచ్చింది. ఆ చట్టం కింద అన్ని రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీలు ఏర్పడాలి. రాష్ట్ర స్థాయి కమిటీలు ఏడాదికి కనీసం రెండుసార్లు, జిల్లా స్థాయి కమిటీలు కనీసం మూడు నెలలకోసారి సమావేశం కావాలి. అయితే దేశంలోని 25 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాలూ ఈ కమిటీల గురించి పట్టించుకోవడం లేదని గెహ్లోత్ చేసిన ప్రకటన ఆశ్చర్యం కలిగిస్తుంది. 2016 మొదలుకొని 2018 వరకూ చూస్తే ఆ కమిటీలు ఒక్కసారైనా సమావేశం కాలేదని ఆయన చెబుతున్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో 25 మందితో ఏర్పడే కమిటీలో హోంమంత్రి, ఆర్థికమంత్రి, సాంఘిక సంక్షేమ మంత్రి తదితరులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు 16 మంది ఉండాలి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మొదలుకొని ఉన్నతాధికారులుండాలి. జిల్లా స్థాయి కమిటీల్లో కలెక్టర్, ఎస్పీలతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఉంటారు.

ఎస్సీ, ఎస్టీ(అత్యాచారాల నిరోధక) చట్టం అమలు తీరుపై నిఘా వుండాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలనడం వెనక ముఖ్య కారణముంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉండగా 1985 జూలై 17న ప్రకాశం జిల్లా కారంచేడులో దళితుల ఊచకోత జరిగింది. దళితులపై అమలవుతున్న అత్యాచారాలను, హత్యాకాండను నిలువరించడంలో పౌర హక్కుల రక్షణ చట్టం దారుణంగా విఫలమవుతున్నదని పలు దళిత, ప్రజా సంఘాలు అప్పట్లో ఆరోపించాయి. మరింత సమగ్రమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశాయి. పార్లమెంటులో సైతం అన్ని పార్టీలూ ముక్తకంఠంతో కోరడంతో పౌర హక్కుల రక్షణ చట్టం స్థానంలో మరో చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించారు. చివరకు 1989లో ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం వచ్చింది. కానీ విషాద మేమంటే ఆ తర్వాత మరో మూడేళ్లు గడిచాకగానీ ఆ చట్టానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు రూపొందలేదు. ఈలోగా 1991 ఆగస్టులో చుండూరు మారణకాండ చోటు చేసుకుంది. 2014లో ఆ చట్టానికి సవరణలు తీసుకొచ్చారు. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి నిఘా, పర్యవేక్షణ కమిటీలుండాలని భావించడంలో కీలకమైన ఉద్దేశం వుంది. ఆ చట్టం సరిగా అమలు కావడంలేదని, తమను వేధిస్తున్న వారిపై కేసు పెట్టడంలో పోలీసులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని దళితులు ఆరోపిస్తుంటారు. దళితులను వేధించేవారిలో పెత్తందారీ కులాలకు చెందినవారు, స్థానికంగా డబ్బు, పలుకుబడి ఉన్నవారే అధికం. అందువల్ల సహజంగానే పోలీసులు చూసీ చూడనట్టు ఉండిపోతారు. అవతలివారి నుంచి డబ్బు తీసుకుని రాజీకి రావాలని ఒత్తిళ్లు తెస్తారు, బెదిరిస్తారు. కమిటీలు చురుగ్గా పని చేస్తుంటే కిందిస్థాయి అధికారులు అప్రమత్తంగా వుంటారు. ఫిర్యాదు అందిన వెంటనే చర్యలకు సిద్ధపడకపోతే సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందన్న భయం వారిని వెన్నాడుతుంది. అటు పోలీ సుల వద్దా, ఇటు న్యాయస్థానాల్లోనూ కేసులు పెండింగ్ పడినప్పుడు ఏ దశలో, ఎందుకు నిలిచి పోయాయో కమిటీలు పరిశీలించి... ఆ అవరోధాలను తొలగించే ప్రయత్నం చేస్తాయి. ప్రత్యేక కోర్టుల ఏర్పాటులో జాప్యంవల్ల లేదా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లేకపోవడంవల్ల కేసుల విచారణ నత్త నడకన సాగుతున్నదని తేలితే అందుకు అవసరమైన చర్యకు సిఫార్సు చేస్తాయి. నిర్ణీత కాల వ్యవధిలో కమిటీలు సమావేశమవుతుంటే ఇలాంటి సమస్యలన్నీ పరిష్కారమవుతాయి. కానీ మూడేళ్లపాటు 25 రాష్ట్రాలూ, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కమిటీలు ఒక్కసారి కూడా సమావేశం కాలేదంటే ఎస్సీ, ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ విషయంలో ప్రభుత్వాలు ఎంతగా అలసత్వం ప్రదర్శిస్తున్నాయో సులభంగానే తెలుస్తుంది.

కేంద్రమంత్రి ఇచ్చిన సమాధానంలో ఆసక్తికరమైన అంశాలున్నాయి. దేశంలో ఒక్క హరియాణా మాత్రమే 2016, 2017 సంవత్సరాల్లో నిబంధనలు తు.చ. తప్పకుండా పాటించింది. 2018లో ఒకసారి మాత్రమే సమావేశం నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో వరసగా మూడేళ్లూ రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి కమిటీలు సమావేశమే కాలేదని మంత్రి ఇచ్చిన జవాబు చూస్తే అర్థమవుతుంది. దళితుల విషయంలో చంద్రబాబుకున్న చిన్న చూపేమిటో వివిధ సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. దేశ జనాభాలో ఎస్సీ కులాలు 16.6 శాతమైతే, ఎస్టీ వర్గాలవారు 8.6 శాతం. ఈ వర్గాలవారు సామాజికంగా ఎదగడానికి, అభివృద్ధి సాధించడానికి వివక్ష, వేధింపులు, దాడులు అవరోధంగా ఉంటున్నాయి. ఆ వర్గాల సంక్షేమానికి వివిధ పథకాలు అమలు చేయడం ఎంత అవసరమో... ఆ వర్గాలు నిర్భయంగా, గౌరవప్రదంగా జీవించడానికి అవసరమైన పరిస్థితులు కల్పించడం కూడా అంతే ప్రధానం. అయితే ఏటా సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ రాష్ట్రాల్లోని నిఘా, పర్యవేక్షణ కమిటీల పనితీరుపై ఇస్తున్న సమాచారం నిరాశాజనకంగానే వుంటోంది. ఈ విషయంలో రాష్ట్రాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. చట్ట నిబంధనల్ని ప్రభుత్వాలే పాటించకపోతే ఇక సాధారణ పౌరుల నుంచి ఏం ఆశించగలం?

# సార్క్ పునరుద్ధరణ సాధ్యమేనా?

**కరోనా వైరస్ ప్రపంచంపై విరుచుకుపడుతున్న నేపథ్యంలో సార్క్ దేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు ప్రధాని నరేంద్రమోదీ సరైన సమయంలో చొరవ తీసుకోవడం ప్రశంసనీయం. దక్షిణాసియాలో కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధిని నిర్మూలించడంలో మోదీ తీసుకున్న చొరవ ఫలించవచ్చు, ఫలించకపోవచ్చు కూడా. కానీ సార్క్‌ని తిరిగి పట్టాలెక్కించే విషయంలో అది హామీ కల్పించింది. మరోవైపున ప్రాంతీయ వేదికలపై సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావించకుండానే.. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను మరిన్ని బాలాకోట్ ఘటనలు పునరావృతం చేయడం ద్వారా భారత్ శిక్షించవచ్చు. బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా చైనా సాగిస్తున్న ప్రాంతీయ వ్యూహాత్మక ఆక్రమణను సవాలు చేయడానికి భారత్ తన పొరుగుకు ప్రాధాన్యతను ఇవ్వడం అనే విధానంలో భాగంగానే సార్క్‌ని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.**

దక్షిణాసియా ప్రాంతీయ సహకార సమితి (సార్క్) పునరుత్తేజానికి, పునరుద్ధరణకు ప్రాణాంతక కోవిడ్–19 సాంక్రమిక వ్యాధి ఒకరకంగా మార్గం కల్పించింది. ప్రధాని నరేంద్రమోదీ కరోనా వైరస్ ప్రభావాన్ని అరికట్టేందుకు ఒక పరస్పర సమన్వయ వ్యూహం కోసం సార్క్ దేశాల సహ ప్రధానులతో కలిసి పనిచేయడానికి సాహసోపేతమైన, సానుకూల చర్య విషయంలో చొరవ తీసుకున్నారు.

సార్క్ 2015 నుంచి ఐసీయూలో ఉంటూ వస్తోందన్నది తెలిసిందే. ప్రాంతీయ అనుసంధానంతో ముడిపడిన ప్రాజెక్టుల విషయంలో సహకారం అందించడానికి పాకిస్తాన్ తిరస్కరించడం, పాకిస్తాన్‌తో సంబంధాల కొనసాగింపునకు భారత్ నిరాకరించడమే దీనికి ప్రధాన కారణం. ప్రజారోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవడంలో పేలవమైన విధానాలు కొనసాగడం, మౌలిక వసతుల కొరతతోపాటు అధిక జనసాంద్రతతో కూడిన దక్షిణాసియాలో కరోనా వైరస్ సాంక్రమిక వ్యాధిని నిర్మూలించడంలో మోదీ తీసుకున్న చొరవ ఫలించవచ్చు, ఫలించకపోవచ్చు కూడా. కానీ సార్క్‌ని తిరిగి పట్టాలెక్కించే విషయంలో అది హామీ కల్పించింది.

కోవిడ్–19 వ్యాధి నిర్మూలన కోసం అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకుందామంటూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రతిపాదనను, సార్క్ అధినేతలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వాగతించారు. పాకిస్తాన్ కూడా దీంట్లో భాగమైంది. ఈ సంక్షోభాన్ని అడ్డుకునేందుకు భారత్ తనవంతుగా కోటి అమెరికన్ డాలర్లను ఇస్తానని ప్రతిపాదించింది కూడా. సార్క్ దేశాల అధినేతలు తమ తమ దేశాల్లో వైరస్‌తో పోరాటంలో కలిసి పనిచేయడానికి, తమ అనుభవాలను, తాము సాగిస్తున్న ఉత్తమమైన విధానాలను పరస్పరం పంచుకోవడానికి అంగీకారం తెలిపారు. అంతే కాకుండా కరోనా వైరస్ దీర్ఘకాలంలో కలిగించనున్న ఆర్థిక, సామాజిక ప్రభావాలను ఉపశమింపజేయడానికి కూడా వీరు ఆమోదం తెలిపారు.




### భారత్ నిజాయితీకి నిదర్శనం

భారత్ చేపట్టిన ఈ చొరవ వెనుక తన పొరుగుదేశాలకు అది ఇచ్చిన అప్రకటిత సందేశం చాలా స్పష్టంగా, గంభీరంగా ధ్వనించింది. అంతర్గతంగా కాకుండా బయటి ప్రపంచం నుంచి వచ్చి తమ మీద పడిన ఉత్పాతాలను ఎదుర్కోవడంలో సార్క్ దేశాలకు బాసటగా నిలుస్తానని భారత్ స్పష్టం చేసింది. ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే సమయంలో భారత్ నిజాయితీని, అది అందించే నిర్ణయాత్మక మద్దతును ఈ చొరవ నొక్కి చెప్పింది. ప్రపంచ శ్రేయస్సును పరిరక్షించడంలో తనవంతు బాధ్యతలను నెరవేర్చడానికి, అదే సమయంలో తనకున్న వనరులు, సమర్థతల పరిధిలో కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకోవడంలో తన సంసిద్ధత పట్ల కూడా భారత్ ప్రపంచానికి సందేశం ఇచ్చినట్లయింది.

విశ్వసనీయత కలిగిన ప్రపంచ శక్తిగా మారడంలో భారత్ నిబద్ధతను తన ఈ చొరవ స్పష్టంగా తెలియచెప్పింది. అదేసమయంలో మరో రెండు అంశాలలో తన వైఫల్యాన్ని కూడా భారత్ పరిగణనలోకి తీసుకున్నట్లు స్పష్టమైంది. ఒకటి: ఇరుగుపొరుగు దేశాలతో మొదట సఖ్యత సాధించడం అనే విదేశీ విధానాన్ని 2014లో ప్రధాని మోదీ అత్యంత ఉత్సాహంతో చేపట్టారు. భారత్‌కు వ్యతిరేకంగా సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం మానుకోవడాన్ని తిరస్కరిస్తున్న పాకిస్తాన్‌ను ఒంటరిని చేయడం. సార్క్ స్తంభించిపోవడానికి ఇదే కీలకమైన కారణం. రెండు: సార్క్ సదస్సును పాకిస్తాన్ 2016లో నిర్వహించాల్సి ఉండగా దాంట్లో పాల్గొనడానికి భారత్ తిరస్కరించింది.

### పాక్‌ను ఒంటరి చేయడంలో వైఫల్యం

అంతర్జాతీయ సమాజం పాకిస్తాన్‌ను ఒంటరిని చేయలేదు. పాకిస్తాన్‌కు ఇప్పటికీ చైనా సంఘీభావాన్ని తెలుపుతూనే ఉంది. కశ్మీర్ సమస్యను ఇస్లామిక్ దేశాల సంస్థ ఓఐసీ ఎజెండాగా ఉంచాలంటూ పాకిస్తాన్ చేసిన ప్రతిపాదనను సౌదీ అరేబియా ఆమోదించింది. వీటన్నింటికీ మించి ఆఫ్ఘనిస్తాన్‌తో సహా అన్ని చోట్లా ఉగ్రవాద సంబంధిత అంశాల్లో అగ్రరాజ్యం అమెరికా ఇప్పటికీ పాకిస్తాన్‌తో కలిసి పనిచేస్తూనే ఉంది. చివరకు ఇటీవల భారత్ పర్యటన సమయంలో కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీమాంతర ఉగ్రవాదం పట్ల భారత్ ఆందోళనలకు దూరం జరిగారు. పైగా సీమాంతర ఉగ్రవాదంతో వ్యవహరించే శక్తిసామర్థ్యాలు భారతప్రధాని ఉన్నారని, అమెరికా 8 వేలమైళ్ల దూరంలో ఉన్నందున ఇతర ప్రాంతీయ దేశాలు ఈ అంశంలో భారత్‌కు తగిన సహాయసహకారాలు అందించాలని ఉచిత సలహా కూడా ఇచ్చారు ట్రంప్.

ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలోనే ట్రంప్ పాకిస్తాన్ ప్రధానిని బహిరంగంగా ప్రశంసించడం, ప్రాంతీయ శాంతి, సుస్థిరతపై కృషి చేయాలంటూ ట్రంప్ భారత్‌కు పిలుపునివ్వడం అనేది చమత్కారంతో కూడిన జిత్తులమారితనం తప్ప మరేమీకాదు. పైగా పాకిస్తాన్‌తో సంభాషించకపోవడం ద్వారా ఆ దేశాన్ని ఒంటరిని చేయాలనుకున్న భారత విధానం పట్ల అమెరికా చివాట్లు పెట్టినట్లే లెక్క. పైగా పాకిస్తాన్‌ను సాకుగా చూపుతూ సార్క్‌ను ప్రతిష్టంభనకు గురిచేయడం ఎవరి ప్రయోజనాలనూ నెరవేర్చదని చెప్పాలి.

### పొరుగుకు ప్రాధాన్యత ఫలిస్తోందా?

మరొక అంశం ఏమిటంటే, బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ పేరిట బహుళ రంగాల్లో సాంకేతిక, ఆర్థిక సహకార వ్యవస్థ (బిమ్‌స్టెక్)ను నిర్మించడంలో భాగంగా భారత్ పొరుగుకు ప్రాధాన్యత అనే విధానాన్ని ఇటీవలి సంవత్సరాల్లో తీసుకొచ్చింది. ఇది కచ్చితంగా సార్క్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకొచ్చిన పథకం అనే చెప్పాలి. భారత సముద్ర ప్రాంతీయ భద్రత, ఉగ్రవాద నిరోధకతతోసహా పలు రంగాల్లో ఈ బిమ్‌స్టెక్‌ను భారత్ క్రియాశీలకంగా ప్రోత్సహిస్తూ, బలోపేతం చేస్తూ వచ్చింది. కానీ ఈ విధానంలోనూ కొన్ని పరిమితులు ఉన్నాయని భారత విధాన నిర్ణేతలు క్రమంగా గ్రహిస్తూ వచ్చారు.

ఎందుకంటే థాయ్‌లాండ్, మయన్మార్ దేశాలు ఆర్థికంగా, వ్యూహాత్మకంగా కూడా చైనాకు సన్నిహితం అయ్యాయి. పైగా నేపాల్, భూటాన్, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాలు కూడా చైనాతో విస్తృతమైన ఆర్థిక కార్యకలాపాల్లో నిమగ్నమవుతూనే భారత, చైనా మధ్య సమతుల్యతను పాటించే ఎత్తుగడలను అవలంబించడంలో తలమునకలవుతున్నాయి. వీటిలో కొన్ని దేశాలు కోవిడ్–19తో పోరాడటంపై సార్క్ సదస్సు విషయంలో కూడా మృదువుగానే చైనాను రంగంలోకి తీసుకురావడానికి వెనుకాడలేదు.

### దూరమవుతున్న పొరుగు దేశాలు

భారత్–పాకిస్తాన్ మధ్య పెనవేసుకున్న ఈ ద్విబంధనం సార్క్‌కు మాత్రమే హాని చేయడం లేదు. భారత్‌కు సమీపంలో ఉన్న పొరుగుదేశాలు కూడా ప్రాంతీయ సమగ్రతా ప్రతిపాదనల పట్ల చాలా జాగరూకతతో వ్యవహరిస్తున్నాయి. పైగా భారత్‌తో సన్నిహితంగా ఉండటం అంటే మరీ సన్నిహితంగా ఉండటమా అనే అంశాన్ని కూడా ఈ దేశాలు తేల్చుకోలేక పోతున్నాయి. బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, నేపాల్ (బీబీఐఎన్) దేశాల మధ్య ఉప ప్రాంతీయ ప్రోత్సాహక చర్యలు నెమ్మదిగా సాగుతున్న విషయం దీన్నే తేల్చిచెబుతోంది.

ఈ నేపథ్యంలో సార్క్ దేశాల సహకార సమితిని పునరుద్ధరించడం వైపుగా భారత్ సరైన చర్యను చేపట్టింది. ప్రాంతీయ ప్రాజెక్టులలో భాగం కావడానికి తిరస్కరించడం ద్వారా పాకిస్తాన్ తనకు తానే ఒంటరి అయితే కానివ్వండి. భారత ప్రధాని చొరవతో తలపెట్టిన కోవిడ్–19 వీడియో కాన్ఫరెన్స్‌కు దిగువస్థాయి అధికారులతో కూడిన ప్రాతినిధ్య బృందాన్ని పంపించడం ద్వారా పాకిస్తాన్ తన సంకుచిత బుద్ధిని తనకు తానుగా ప్రదర్శించుకుంది.

### పరువు పోగొట్టుకున్న పాకిస్తాన్

పైగా తగుదునమ్మా అటూ కరోనా వైరస్ నిరోధక చర్యల కోసం తలపెట్టిన ఆ వీడియో కాన్ఫరెన్సులో కశ్మీర్ అంశాన్ని పాకిస్తాన్ లేవనెత్తినా ఇతర భాగస్వామ్య దేశాలు పెద్దగా పట్టించుకోలేదు. కరోనా వైరస్‌ను ఎదుర్కోవడంలో భాగంగా ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులను పాకిస్తాన్ మూసివేయడంపై ఆ దేశాధ్యక్షుడు అష్రఫ్ ఘని నేరుగా పాకిస్తాన్‌నే ప్రశ్నిస్తూ డిఫెన్స్‌లో పడేశారు.

మరోవైపున ప్రాంతీయ వేదికలపై సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రస్తావించకుండానే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్‌ను మరిన్ని బాలాకోట్ ఘటనలు పునరావృతం చేయడం ద్వారా భారత్ శిక్షించవచ్చు. బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టు ద్వారా చైనా సాగిస్తున్న ప్రాంతీయ వ్యూహాత్మక ఆక్రమణను సవాలు చేయడానికి భారత్ తన పొరుగుకు ప్రాధాన్యతను ఇవ్వడం అనే విధానంలో భాగంగానే సార్క్‌ని పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎస్‌డి ముని, ప్రొఫెసర్ ఎమిరేటస్, జేఎన్‌యూ,
భారత మాజీ రాయబారి, భారత ప్రభుత్వ ప్రత్యేక దూత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### మైండ్ సెట్



"కరోనా వైరస్ సోకిన వ్యక్తిని ఆసుపత్రిలో చేరమని ఈ నెల 15వ తేదీన కోల్‌కతా విమానాశ్రయ అధికారులు సూచించారు. అతడు పట్టించుకోకుండా ఇంటికి వెళ్లిపోయాడు. 16న అతడిని ఎంఆర్ బంగూర్ ఆసుపత్రికి తీసుకువచ్చి, చేరమంటే తిరస్కరించాడు. అతడు యూకేలోని యూనివర్సిటీలో చదువుకుంటున్నాడు. 17వ తేదీన ఆరోగ్య శాఖ వారు అతడిని బలవంతంగా ఆసుపత్రిలో చేర్చి, కరోనా పరీక్ష నిర్వహిస్తే పాజిటివ్ వచ్చింది. పరపతిగలిగినవారు ఎంత నిర్దయగా ఉంటారు! దీన్నిబట్టి చదువు అనేది ఏమీ ఇవ్వదని అర్థమవుతోంది. అంతా కేవలం మైండ్ సెట్‌పై ఆధారపడి ఉంటుంది"
– మధుపర్ణా దాస్, జర్నలిస్ట్

### చర్య



"త్వరితగతిన దూకుడుగా తీసుకునే చర్యలే కరోనా వైరస్‌కు సమాధానం చెప్పగలవు. మన ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహరించకపోవడంతో భారత్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు"
– రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత

### సిద్ధం



"మహమ్మారిని ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్న ఆరు దేశాల్లో పాక్ ఒకటని ప్రపంచ బ్యాంక్ అధ్యయనంలో వెల్లడైంది"
– అశోక్ స్వైన్, ప్రొఫెసర్

### డబ్బు



"ముఖ్యమైన, తప్పనిసరి చర్యల కారణంగా హోటళ్లు, బార్లు, లాడ్జీలు మూసివేయడంతో తమ పనికి దూరమైన వాళ్లకు త్వరలో డబ్బులు అందుతాయి. చైనా వైరస్ దాడి మీ తప్పు కాదు. ఎప్పటికంటే కూడా మనోస్థైర్యంతో ఉండండి"
– డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

### అమానవీయం



"ప్రపంచమంతా కరోనా వైరస్‌తో పోరాడుతుంటే, జమ్మూకశ్మీర్‌లో మాత్రం ఇంకా 4జీ సేవలను పునరుద్ధరించకపోవడం అమానవీయం. కోవిడ్ మహమ్మారి విస్తరిస్తున్న నేపథ్యంలో ఇంటర్నెట్‌ను వినియోగించుకుని సమాచారం పొందడం తప్పనిసరి. కశ్మీరీల బతుకులు అంత చులకనైపోయాయా?"
– మహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

### నిరసన



"తమిళనాడులోని తౌహీద్ జమాత్ సభ్యులు సహా పలువురు చెన్నైలో సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లకు వ్యతిరేకంగా మద్రాస్ హైకోర్టు దగ్గర నిరసన కొనసాగిస్తున్నారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో వారి చర్య మొత్తం చెన్నైనే ప్రమాదంలోకి నెడుతోంది. మానవ బాంబులైన ఉగ్రవాదుల్లాగే వీళ్లూ ప్రమాదకారులే. వారి చర్య చాలా ఇబ్బందికరం"
– మహేష్ విక్రమ్ హెగ్డే, జర్నలిస్ట్

### స్ఫూర్తి



"ఇటాలియన్ ప్రజలను స్ఫూర్తిగా తీసుకుని నేను కూడా నా బాల్కనీ నుంచి స్టాండప్ కామెడీ చేయాలని నిర్ణయించుకున్నా. నా ప్రదర్శనకు మంచి స్పందన లభించింది. క్షేమంగా ఉండండి. సానుకూల దృక్పథంతో ఉండండి"
– అతుల్ ఖత్రీ, కమెడియన్

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి బ.దశమి ఉ.7.23 వరకు, తదుపరి ఏకాదశి నక్షత్రం ఉత్తరాషాఢ సా.5.20 వరకు, తదుపరి శ్రవణం వర్జ్యం రా.9.32 నుంచి 11.12 వరకు, దుర్ముహూర్తం ఉ.10.09 నుంచి 10. 55 వరకు, తదుపరి ప.2.54 నుంచి 3.43 వరకు అమృతఘడియలు... ఉ.10.44 నుంచి 11.52 వరకు.

**సూర్యోదయం :** 6.10
**సూర్యాస్తమయం:** 6.06
**రాహుకాలం :** ప.1.30 నుంచి 3.00 వరకు
**యమగండం :** ఉ.6.00 నుంచి 7.30 వరకు

## ఇన్‌బాక్స్

### ఊహకందని వూహాన్

చైనా దేశంలోని వూహాన్ నగరం ఈ మధ్య అందరి నోట్లో నానుతోంది. కరోనా వైరస్ అక్కడి నుంచే ప్రబలి ప్రపంచాన్ని గడగడ వణికిస్తోంది మరి. కాని వూహాన్ అంటే నాకు మొదట జ్ఞాపకం వచ్చింది అక్కడి విశ్వవిఖ్యాతి చెందిన అక్రోబాట్ బృందమే. ఒడలు గగుర్పొడిచే, కళ్ళు చెదిరే విన్యాసాలతో, ఒలింపిక్ జిమ్నాస్ట్‌లకంటే కూడా మిన్నగా చైనా కళాకారులు అక్షరాలా నేల విడిచి సాము చేయడం ద్వారా అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేస్తారు. ఊహాన్ కళాకారులు 1982లో అనుకుంటా హైదరాబాద్ గాంధీ భవన్‌లో తమ ప్రదర్శన ఇచ్చారు. నేను ఆంధ్రప్రభ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఉన్నాను. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రదర్శన సమీక్ష అప్పటి రెసిడెంట్ ఎడిటర్ వీఎన్ నారాయణన్ ప్రచురించారు. ప్రభలో కూడా రాశాను. ఈమధ్యనే కాలంచేసిన పొత్తూరి వెంకటేశ్వరరావు అప్పుడు ప్రభకు ఎడిటర్‌గా ఉన్నారు. 'ప్రదర్శన ఎంత అద్భుతంగా ఉందంటే, ఆ మర్నాడు షో అయ్యాక తదుపరి ప్రదర్శనల నిమిత్తం వూహాన్ వారు కలకత్తా వెళ్ళిపోతున్నారు. ఒకవేళ ఇక్కడ మీరు మిస్ అయితే కలకత్తా వెళ్ళి మరీ చూడండి, అంత గొప్పగా ఉంది' అని రాశాను.

'అంత బాగా ఉందా?' అని పొత్తూరి, నారాయణన్ అడిగారు. 'అవునండీ ఎలాంటి అతిశయోక్తి లేదు' అన్నాను. 'మీ సమీక్ష చదివి కొందరు ఎమ్మెల్యేలు, మంత్రులు ఇవాళ పగలు ఒక ఎక్స్‌ట్రా షో ఏర్పాటు చేస్తున్నారు. మేము వెళ్తున్నాం' అన్నారు పొత్తూరి. తిరిగి వచ్చి ఎంతో మెచ్చుకున్నారు. వూహాన్ ప్రదర్శన బహుశా చంద్రబాబు కూడా తిలకించారేమో. ఇప్పుడు అలాంటి విన్యాసాలే చేస్తున్నారు. చేసిన తప్పులు సమర్థించుకుంటూ, మరిన్ని దారుణాలతో ప్రజలకు మరింత ద్రోహానికి తలపడుతూ, వారికి మేలు చేస్తున్న ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్నారు. ఈ కరోనా కల్లోలం సద్దుమణిగి అంతా సవ్యంగా జరిగి సుఖాంతం కావాలని ఆశిద్దాం.

– బులుసు ప్రభాకర శర్మ,
సీనియర్ జర్నలిస్ట్
మొబైల్ : 98495 95371

# న్యాయవ్యవస్థ స్వతంత్రతపై నీలినీడలు

విశ్లేషణ



మంగారి రాజేందర్

భారత ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 17న పదవీ విరమణ చేసిన రంజన్ గొగోయ్‌ని రాజ్యసభ సభ్యుడిగా రాష్ట్రపతి సోమవారం నియమించారు. విరమణ చేసిన నాలుగు మాసాల్లోనే ఆయన్ని ఇలా నియమించడంతో న్యాయవ్యవస్థ స్వతంత్రత మరోసారి ప్రశ్నార్థకమైంది. న్యాయమూర్తులుగా పనిచేసిన వ్యక్తులు రాజకీయ పదవులను స్వీకరించడం ఇది మొదటిసారి కాదు. భారత న్యాయ చరిత్రలో ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన వ్యక్తిని రాజ్యసభకి నియామకం చేయడం ఇదే మొదటిసారి.

కొన్ని ప్రధాన తీర్పులని వెలువరించిన సుప్రీంకోర్టు బెంచీలకు గొగోయ్ నేతృత్వం వహించారు. వివాదాస్పద రామ జన్మభూమి హిందువులకు కేటాయించడం, రఫేల్ ఫైటర్ విమాన కేసులో దర్యాప్తు నిరాకరించడం, క్లీన్‌చిట్ ఇవ్వడం, ఎలక్టోరల్ బాండ్స్ స్కీములో విచారణని జాప్యం చేయడం, కశ్మీర్‌కి సంబంధించిన హెబియస్ కార్పస్ కేసులని విచారించడానికి అయిష్టత చూపడం, ఎన్ఆర్‌సీని నిర్వహించడాన్ని పబ్లిక్‌గా సమర్థించడం లాంటి ఎన్నో తీర్పులని ఆయన వెలువరించారు.

అధికారంలో వున్న పార్టీ తీసుకున్న లైన్‌కి అనుకూలంగా తీర్పులు చెప్పినందుకుగానూ ఆయన్ని ఈ పదవి వరించిందని న్యాయవాదులు బహిరంగంగా కామెంట్స్ చేస్తున్నారు. 'అంతర్గతంగా వున్న విషయం ఇప్పుడు బహిర్గతమైపోయింది. న్యాయవ్యవస్థలోని స్వతంత్రత అధికారికంగా చనిపోయింది' అని సుప్రీంకోర్టు న్యాయవాది గౌతమ్ భాటియా అన్నారు. తన రికార్డునే కాకుండా, తనతో బాటూ బెంచీలో వున్న న్యాయమూర్తుల స్వతంత్ర తకీ, నిష్పాక్షికతకీ మచ్చ తీసుకొచ్చే విధంగా ఆయన నడవడిక వుందని సుప్రీంకోర్టు మరో సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే అన్నారు.

గొగోయ్ మీద లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఉద్యోగిని కేసు విషయంలో ఏర్పాటైన అంతరంగిక ప్యానెల్‌లో బయటి వ్యక్తికి చోటు కల్పించకపోవడం, న్యాయవాదిని నియమించుకోవడానికి అవకాశం ఇవ్వకపోవడం దారుణమనీ; ఆ కేసులో గొగోయ్‌కి క్లీన్‌చిట్ ఇవ్వడం, ఇప్పుడు రాజ్యసభ సభ్యుడిగా నియమించడంతో న్యాయ వ్యవస్థ బోలుతనం బయటపడుతుందనీ సుప్రీంకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు దుష్యంత్ దవే అన్నారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన రంగనాథ్ మిశ్రా కూడా రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. అయితే ఆయన పదవీ విరమణ చేసింది 1991లో. అది కూడా ఏడేళ్ల తరువాత 1998లో రాజ్యసభకు ఎన్నికయ్యారు, నియామకం కాలేదు. ఈ మధ్య కాలంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. తరువాత కాంగ్రెస్‌లో చేరి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన మరో జస్టిస్ ఎం.హిదయతుల్లా కూడా ఉపరాష్ట్రపతిగా ఎంపికయ్యారు, పదవీ విరమణ (1970) చేసిన తొమ్మిదేళ్ల తర్వాత. సుప్రీంకోర్టు మొదటి మహిళా న్యాయమూర్తి జస్టిస్ ఫాతిమా బీవీ కూడా తమిళనాడు గవర్నర్‌గా 1997లో నియమితు లైనారు. ఆమె పదవీ విరమణ చేసింది 1992లో.

పదవీ విరమణ చేసిన వెంటనే న్యాయమూర్తులకి మరో పదవి ఇవ్వడం ఎప్పుడూ చర్చనీయాంశమే. మాజీ కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ మాటల్లో చెప్పాలంటే– 'పదవీ విరమణ తరువాత వచ్చే పదవులు, పదవుల్లో ఉన్నప్పుడు చెప్పే తీర్పులని ప్రభావితం చేస్తాయి'. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుని హోదాలో 2012లో ఆయన ఇంకా ఇలా అన్నారు: 'పదవీ విరమణ చేసిన రెండేళ్ల వరకి ఎలాంటి పదవిని న్యాయమూర్తికి ఇవ్వకూడదు. అలా గడువు లేకపోతే ప్రభుత్వం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో న్యాయమూర్తులను ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది.' ఇవే మాటలని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులైన ఆర్.ఎం.లోధా, టి.ఎస్. ఠాకూర్, కపాడియా లాంటివాళ్లు అన్నారు.

రోజర్ మాథ్యూ కేసులో గొగోయ్ అభిప్రాయాలు నిందాస్తుతి లాంటివి. పదవీ విరమణ తరువాత పదవుల విషయంలో కోర్టు తన ఆందోళనని వ్యక్తపరిచింది. ఆ విధంగా పదవులు ఇవ్వడం వల్ల న్యాయవ్యవస్థ స్వతంత్రతే దెబ్బతింటుందని గొగోయ్ నేతృత్వంలోని బెంచి అభిప్రాయపడింది. విరమణ వెంటనే పదవుల గురించి తీర్పులు చెప్పిన గొగోయ్ రాజ్యసభ సభ్యుడిగా పదవి స్వీకరించడం విషాదం. రాజ్యాంగంలోని అధికరణ 80 ప్రకారం కళలు, సైన్స్, సాహిత్యంలో ప్రత్యేక అనుభవం ఉన్న వ్యక్తులని రాష్ట్రపతి రాజ్యసభ సభ్యులుగా నియమించవచ్చు. గొగోయ్‌కి ఎందులో అనుభవం ఉందో మరి!

వ్యాసకర్త గతంలో జిల్లా జడ్జిగా పనిచేశారు.
మొబైల్ : 94404 83001

# ధ్యానం

ధ్యానం ఆధునిక ఆరోగ్య మంత్రం, ఒత్తిడిని మాయం చేసే అద్భుత సాధనం. పూర్వం యోగులు, మునులు ఆశ్రమాలలో నివసిస్తూ ధ్యానం చేసేవారు. జనారణ్యంలో నివసిస్తూ విచారం, బాధ, ఒత్తిడి, అశాంతి వంటి మనో రుగ్మతలను నియంత్రించుకోవటానికి నేడు ధ్యానమే పరమౌషధం. ధ్యానానికి ఏకాగ్రతే ప్రమాణం. ఎంత ఎక్కువ సేపు ధ్యానంలో కూర్చున్నామన్నది ముఖ్యం కాదు. ఎంతసేపు మనసును నియంత్రించామన్నది ముఖ్యం. ఇంద్రియాలను మనసులో, మనసును అహంకృతిలో, అహంకృతిని బుద్ధిలో సంలీనం చేసినట్లయితే అదే 'ధ్యానం' అని మహా భారతం చెబుతుంది.

ఒక వీరుడు నూనె పాత్రను చేతులతో పట్టుకుని మెట్లు ఎక్కుతూ ఉంటాడు. అటూ, ఇటూ కత్తులు ఝళిపిస్తూ ఉంటారు. నూనె బొట్టు తొణక్కుండా, ఏకాగ్రత కోల్పోకుండా ఆ వీరుడు అన్ని మెట్లు ఎక్కి పైకి చేరుకోవాలి. చేరుకుంటాడు కూడా. ఈ అంశం ఒక విధమైన యుద్ధ విద్య. వీరుల భౌతిక శక్తిని, ఏకాగ్రతను పరీక్షించే విధానమిది. ధ్యానంలో మునిగిపోయిన వ్యక్తి అంతే. తనచుట్టూ ఎంత కల్లోలం జరుగుతున్నా, ఎన్ని గొంతులు మార్మోగుతున్నా అవి చెవిని చేరవు. లౌకిక జీవితాన్ని యథావిధిగా కొనసాగిస్తూ, ధ్యానంలో నిష్ఠను సాధించగలిగిన వారంతా ఆధునిక యోగులే.




శరీరానికి, మనసుకు కుదురు ఉండదు. ఆ కుదురు కల్పించటమే ధ్యానంలో ప్రాథమిక దశ. రోజు ప్రారంభం పది నిమిషాల ధ్యానంతో మొదలయితే చాలు, రోజు రోజంతా ప్రశాంతంగా గడపగలుగుతాము. రోజులో ఎన్నో పనులు చేస్తాము. ధ్యానానికి సమయం లేదు అనకుండా అదే మొట్టమొదటి పనిగా భావించి, రోజును ప్రారంభిస్తే, ఆ ప్రభావంతో రోజంతా మిగిలిన పనులన్నీ ఒత్తిడి లేకుండా చేసుకోగలుగుతాము. ధ్యానానికున్న శక్తి అటువంటిది. కళ్లు మూసుకుని ఇష్టదైవాన్నో, ఇష్టమైన దృశ్యాన్నో భావిస్తూ, దానిపైనే దృష్టి నిలుపుతూ, ఆలోచనలను దూరం చేస్తూ, కూర్చోగలిగితే మానసికారోగ్యం, ఆనందం మన చేతిలో ఉన్నట్లే!

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
19-3-2020



కాస్త అదనంగా ఇవ్వండి
సినిమా పేజీలో...



నిర్లక్ష్యం కూడదు... బెదిరిపోనూ వద్దు!
ఇప్పుడు కావాల్సింది బ్యాలెన్స్‌డ్ అప్రోచ్
- హెల్త్ పేజీలో

అభినృత్యం

# డ్యాన్స్ బామ్మా.. డ్యాన్స్

స్థలం.. కేరళలోని కొచ్చి. అక్కడి ఎడప్పల్లి నృత్య ఆస్వాదక సదస్‌లో 26 మంది మహిళలు భరతనాట్యం, మోహినీ ఆట్టం నేర్చుకుంటున్నారు. అందరూ యాభైఏళ్లు పైబడ్డవాళ్లే. ఆ గ్రూప్‌లోని అందరికన్నా పెద్దావిడకు 75 ఏళ్లు. వాళ్లకు డ్యాన్స్ నేర్పుతున్న టీచరమ్మకు 30 ఏళ్లుంటాయి. చిన్నప్పుడు డ్యాన్స్ నేర్చుకోవాలని ఉన్నా.. కుటుంబం, పరిస్థితులు, ఇతర కారణాల ఆ ఇష్టాన్ని మనసులోనే దాచుకొని .. కళ పట్ల ఆరాధన పెంచుకుంటూ... జీవితంలో ఎప్పుడు అవకాశం దొరికినా నృత్యం నేర్చుకొని తీరాలన్న



కలను సాకారం చేసుకుంటున్న వారే అందరూ. తమను తాము ప్రేమించుకుంటూ.. తమ కోసం సమయం చిక్కించుకున్న వారే అంతా! 'మా లాంటి వాళ్ల కోసమే ఈ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ స్టార్ట్ అయింది. మొదట్లో అడుగులు వేయడానికి చాలా కష్టపడ్డాం. అయినా ప్రాక్టీస్ ఆపలేదు. చిన్నప్పుడు చేయాలనుకున్నది ఇప్పటికి గానీ సాధ్యపడలేదు. బెటర్ లేట్ దేన్ ఎవర్ అంటారు కదా (నవ్వుతూ). నిజం చెప్పొద్దూ.. మాకు నచ్చింది చేసుకోవడానికి మా పిల్లలూ ప్రోత్సహిస్తున్నారు' అంటూ 60 ఏళ్ల లీనా చెప్తూంటే 'పిల్లలు అంటే కొడుకులు అనుకుంటారేమో.. కాదు కూతుళ్లు, కోడళ్లు అని చెప్పండి లీనా' అంటూ ఆమె పక్కనే ఉన్న ఉష మాటందుకున్నారు. 'అవునవును.. నా విషయంలో నా మనవలు, మనవరాళ్లు కూడా' అంటూ శ్రుతి కలిపింది 75 ఏళ్ల మామ్మ. గత సంవత్సరం దసరా రోజున ప్రారంభమైంది ఈ నృత్య ఆస్వాదక సదస్. ఈ 26 మందిలో గృహిణి నుంచి టీచర్, డాక్టర్, రిటైర్డ్ ఉద్యోగినుల దాకా ఉన్నారు. ఈ నాట్యాలయానికి వచ్చాకే వీళ్లంతా స్నేహితులయ్యారు. 'ఈ ఇన్‌స్టిట్యూట్ మాకొక థెరపీ క్లినిక్ లాంటిది. డ్యాన్స్ సరే.. ఈ వయసులో ఇంతమంది కొత్త ఫ్రెండ్స్ అయ్యారు. రకరకాల అభిరుచులు ఉన్నవాళ్లమే అంతా. ఇంటి విషయాల నుంచి హాబీస్, స్పోర్ట్స్, సినిమాలు.. వరల్డ్ పాలిటిక్స్ దాకా అన్ని విషయాల మీద చర్చించుకుంటాం.. ఒకరినొకరం టీజ్ చేసుకుంటాం' అంటుంది డాక్టర్ ప్రేమ. 'అందరూ ఒకే వయసు వాళ్లు కాదు కాబట్టి.. అందరూ తేలిగ్గా చేయగలిగే స్టెప్స్‌ను కంపోజ్ చేసి నేర్పిస్తున్నాను. వాళ్ల పట్టుదల చూస్తుంటే ముచ్చటేస్తోంది. పిల్లల్లా అల్లరి చేస్తారు.. జోక్స్ వేస్తూంటారు.. నవ్వుతారు... నవ్విస్తారు.. వీళ్లున్నంతసేపు టైమే తెలియదు. సందడిగా ఉంటుంది. కొత్త శక్తి వస్తుంది. వాళ్లు నా దగ్గర నేర్చుకునే కంటే వీళ్ల దగ్గర నేను నేర్చుకునేదే ఎక్కువ' అంటుంది వీళ్ల డ్యాన్స్ మాస్టర్ ఆఎల్‌వి మిథున. అన్నట్టు ఈ డ్యాన్స్ స్కూల్ యానివర్సరీకి వీళ్లందరి చేత పెర్‌ఫార్మెన్స్ కూడా ఇప్పించబోతోంది ఈ టీచరమ్మ. అందుకు రిహార్సల్స్ కూడా మొదలెట్టేశారు ఈ బేబీలు.'యూత్‌కి మేము ఎగ్జాంపుల్‌గా ఉండాలనుకుంటున్నాం..' అంటారు ముక్తకంఠంతో. అన్నట్టు ఈ మధ్య హిట్టయిన 'ఓ బేబీ' సినిమా ఇలాంటి కాన్సెప్ట్‌తో వచ్చిందేగా!

కరోనా కథలు - 2

## బ్రాండ్ అంబాసిడర్



కరోనా నివారణలో ప్రథమాస్త్రం శానిటైజర్. వీలైనన్ని సార్లు శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకోండనే ప్రచారం చెవిన ఇల్లుకడుతోంది. ఈ నియమాన్ని తు.చ తప్పక పాటిస్తూ శుభ్రతకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నాడు ఊబర్‌లో ఆటో నడిపిస్తున్న గుగులోత్ భాను. తను మాస్క్ కట్టుకోవడమే కాదు.. తన ఆటోలో ఎక్కిన ప్రయాణికులూ కట్టుకునేలా చేస్తున్నాడు.. 'మీరు మాస్క్ వేసుకోకపోతే నా ఆటోలో రావద్దు' అని హెచ్చరిస్తూ. ప్రయాణికులను వాళ్ల వాళ్ల గమ్యస్థానాల్లో చేర్చాక .. ఆటోలో ఉన్న తన బ్యాగ్‌లోంచి శానిటైజర్ తీసి.. ఆటో సీటు, హ్యాండిల్స్ అన్నీ శుభ్రపరిచి.. ఆ టిష్యూలను బయట పారేయకుండా మరో బ్యాగ్‌లో పెడ్తున్నాడు. 'వాటినెక్కడ పారేస్తావ్?' అని అడిగితే.. 'పారేయను మేడం.. సాయంత్రం మా ఇంటికి వెళ్లా=క.. అక్కడే ఇంటిదగ్గర పూడ్చేస్తా.. లేకపోతే కాల్చేస్తా' అని సమాధాన మిచ్చాడు.'ఈ జాగ్రత్త తన కోసమే కాదు.. తోటి ప్రయాణికుల కోసం కూడా. చదువుకున్న వాళ్లం ఈ మాత్రం పాటించకపోతే చదువుకోని వాళ్లెలా తెలుసుకుంటారు?' అని తన సివిక్ సెన్స్‌ను ప్రాక్టికల్‌గా చూపిస్తున్నాడు భాను. కరోనా నివారణ చర్యల గురించి చెప్పడానికి ఇంతకన్నా గొప్ప బ్రాండ్ అంబాసిడర్ దొరుకుతాడా?



జపాన్‌లో సునామీ వస్తే మనం మేడ ఎక్కి దాక్కుంటామా?
అమెరికాలో భూకంపం వస్తే ఆరుబయటకు పరుగు తీస్తామా?
చైనాలో కరోనా వస్తే మనకూ వచ్చేసిందని బెంబేలెత్తి పోతామా?
మహమ్మారులు చాలా భయపెడతాయి.
నష్టం చేస్తాయి.
కాని అంతకన్నా నష్టం చేసేది అకారణ భయం. పిరికితనం.
సున్నితమైన స్వభావం ఉన్నవారు బయటి వార్తలను
పర్సనల్‌గా తీసుకుంటారు. తమకు ఆపాదించుకుంటారు.
వారిని కనిపెట్టుకోవాలి.
ధైర్యం చెప్పాలి.
అదే వారికి అసలైన మాత్ర.

ప్రతీకాత్మక చిత్రం

# ధైర్యం 500mg

భార్య లోపల ఏడుస్తూ ఉంది. బయట భర్తకు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

'అపర్ణా.. ఎందుకు ఏడుస్తున్నావు. ఇప్పుడు ఏమైపోయిందని' అంటూ తలుపు కొడుతున్నాడు.

అపర్ణ తలుపు తీయడం లేదు. గదిలోనే ఉంటోంది. 24 గంటలుగా గదిలోనే ఉండిపోతోంది.

తలుపు కొడితే 'నా దగ్గరకు రావొద్దు' అని అంటోంది.

'నేను చచ్చిపోబోతున్నాను' అని కూడా అంటోంది.

ఆమెకు 52 సంవత్సరాలు. భర్తకు 58 సంవత్సరాలు. ఇద్దరు కొడుకులు. ఇద్దరూ వేరే నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.

జీవితం సంతోషంగా గడుస్తూ ఉంటే ఇప్పుడు ఈ ఉపద్రవం వచ్చి పడింది.

ఏం చేయాలో భర్తకు అర్థం కావడం లేదు. అంతా అయోమయంగా ఉంది.

●●●

అపర్ణకు బంధువుల్లో మంచి పేరుంది. భార్యగా, తల్లిగా కూడా మంచి పేరుంది. అందరితో స్నేహంగా ఉంటుందని అపార్ట్‌మెంట్స్‌లో ఉన్న వారు కూడా అనుకుంటారు. అనుకూలవతి అయిన భార్య దొరికిందని భర్త ఎప్పుడూ సంతోష పడుతుంటాడు. కాని ఒక్కటే చిక్కు. ఆమెకు తరచూ అనారోగ్యం వస్తూ ఉంటుంది. ఒకసారి కళ్లు తిరుగుతాయి. ఒకసారి వాంతులు అవుతాయి. ఒకసారి కండరాలు పట్టేస్తాయి. ఒకసారి ఇంకేమిటో అయిపోతుంది. అలాంటి సమయంలో ఆమె చాలా డల్ అయిపోతుంది. ఏదో భయంకరమైన వ్యాధి తనకు వచ్చేసిందని భావిస్తుంది. కేన్సర్ వచ్చేసిందేమో, గుండెకు రంధ్రం పడిందేమో, పెద్దపేగు పూసిందేమో అని ఒకటే భయం. ఆ భయంతో భర్తను తీసుకొని హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతుంటుంది. టెస్ట్‌లు చేయిస్తుంటుంది. ఆ టెస్ట్‌లలో ఏమీ కనపడదు. రాదు. అయినా కూడా ఆమెకు ధైర్యం చిక్కదు. ఆ ధోరణితో కుటుంబం చాలాసార్లు అవస్థ పడింది. ఇలా కాదని ఒకసారి సైకియాట్రిస్ట్ దగ్గరకు కూడా తీసుకెళ్లారు.

'మీ టెస్టుల్లో మీకు ఏదీ లేదని డాక్టర్లు చెబుతున్నారు' అన్నాడు సైకియాట్రిస్ట్.

'అదే డాక్టర్ నాకూ అర్థం కావడం లేదు. నాకు మాత్రం ఏదో ఒక పెద్ద రోగం వచ్చేసి ఉంటుందనే అనిపిస్తుంటుంది' అందామె.

'ఎందుకని?' అన్నాడు సైకియాట్రిస్ట్.

'ఏమో. నాకు మా బంధువుల్లో ఎవరికో ఒకరికి బాగలేదని విన్నా, ఆ వివరాలు తెలుసుకున్నా, పేపర్లలో ఏదైనా హెల్త్ ఆర్టికల్ చదివినా, టీవీల్లో ఏదైనా అనారోగ్యాల గురించి వార్తలు చెబుతున్నా ఆ మరుసటి రోజు నుంచి నాకు ఏదోగా అనిపిస్తుంది. చాలా స్ట్రెస్ ఫీలవుతాను. ఆ రోగాలు నాకు ఎక్కడ వస్తాయో అని భయపడతాను. కొన్ని వచ్చేశాయని కూడా అనుకుంటాను' అంది అపర్ణ.

'చూడండి... మానసిక వొత్తిడి వచ్చినప్పుడు, మీలాంటి సున్నిత మనస్కులు పిరికితనంతో బెంబేలెత్తిపోయినప్పుడు కొందరు మానసికంగా మాత్రమే బాధపడతారు. కొందరిలో ఆ వొత్తిడి శారీరకంగా బయపడుతుంది. వాంతులు, తలనొప్పి, ఒళ్లు తిరగడం... ఇవన్నీ మీరు తట్టుకోలేక పోయిన స్ట్రెస్ వల్ల మీ శరీరంలో వచ్చిన సింప్టమ్స్. మీరు అవి కనపడగానే అవి రోగ లక్షణాలని భావించి డాక్టర్ల చుట్టూ పరుగు తీస్తున్నారు. రోగ లక్షణాలు చూసి భయపడటాన్ని 'సామటైజేషన్ డిజార్డర్' అంటారు. రోగమే వచ్చేసిందని భయపడటాన్ని 'హైపో కాండ్రియాసిస్' అంటారు. మీలో రెండూ ఉన్నాయి. మీరు చేయవలసిందల్లా మీకు మీరు ధైర్యం చెప్పుకోవడమే. సముద్రంలో ఓడ మునిగింది అని చదివి సముద్రమే లేని హైదరాబాద్‌లో ఉన్న మీరు భయపడితే ఎలా ఉంటుందో ఎవరో వచ్చిన రోగాన్ని విని మీకు వచ్చేసిందని భయపడటం అలాగే ఉంటుంది' అని ధైర్యం చెప్పి, కొద్దిపాటి మందులతో ఆమెను నార్మల్‌కు తెచ్చాడు సైకియాట్రిస్ట్.

> **మీ మనసు శరీరాన్ని పరిపూర్ణంగా చూసుకున్నప్పుడు నా శరీరం బాగుంది... నాకేం కాలేదని ధైర్యం తెచ్చుకుంటుంది. శరీరం ఒకదారిలో... మనసు ఒకదారిలో ఉన్నప్పుడు మనసులో భయం గూడుకట్టుకొని లేనిపోని అనుమానాలు వచ్చి పడతాయి.**

రెండేళ్లు హాయిగానే గడిచాయి. కాని గత నెల రోజులుగా ఆమె మళ్లీ కలతగా మారింది. ముఖ్యంగా వారం రోజుల నుంచి పాత అపర్ణగా మారిపోయింది. ఈ వారంలో ఏం జరిగింది?

●●●

అపర్ణకు 77 ఏళ్ల తండ్రి ఉన్నాడు. ఆయన తన భార్యతో కూకట్ పల్లిలో ఉంటాడు. వారం క్రితం ఆయన హాస్పిటల్‌లో అడ్మిట్ అయితే అపర్ణ రెండుమూడుసార్లు చూసి వచ్చింది. డాక్టర్లు ఆయనకు న్యూమోనియా అని తేల్చారు. కాని ఆ సమయంలోనే కరోనా చర్చ కూడా హాస్పిటల్ వచ్చింది. కరోనా వచ్చినవారు కూడా లంగ్ ఇన్ఫెక్షన్‌తో బాధ పడతారని అనుకోవడం వినిపించింది. నెల రోజులుగా కరోనా వార్తలు వింటున్న అపర్ణ, కరోనా ఇండియాకు కూడా వచ్చేసిందని వింటున్న అపర్ణ ఒక్కసారిగా భయపడిపోయింది. తండ్రికి కరోనా వచ్చేసిందని, ఆయనను తాను కలిసింది కనుక తనకూ వచ్చేసే ఉంటుందని ఇప్పుడు భయపడిపోతోంది.

నిజానికి అపర్ణ తండ్రికి వేరే ఏ వ్యాధీ లేదు. రెండు రోజుల క్రితం ఆయనను డిశ్చార్జ్ కూడా చేశారు. కాని అపర్ణ తన భ్రాంతి నుంచి బయట పడలేక ఉంది. ఇక తప్పనిసరై మళ్లీ ఆమెను సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకువెళ్లాడు భర్త.

●●●

'ముందు మాస్క్ తీసేయండి. మీకేం కాలేదు' అన్నాడు సైకియాట్రిస్ట్.

ఆ మాటకు ఆమెలో వెలుగు వచ్చింది.

'ఇప్పుడు చెప్పండి' అన్నాడు.

'అదే డాక్టర్ కరోనా'... అని ఏదో చెప్పబోయింది.

'మీకు జ్వరం లేదు. దగ్గు లేదు. శ్వాసలో ఇబ్బంది లేదు. మీ నాన్నకు కరోనా రాలేదు. మీకున్నది కేవలం జలుబు. దానిని భూతద్దంలో పెట్టి చూసి నరకం అనుభవిస్తున్నారు. చూడండి... యోగాలోగాని వైద్యశాస్త్రంలోగాని శరీరం, మనసు సమన్వయంలో ఉండాలని చెబుతారు. మీ శరీరాన్ని, మనసును సమన్వయ పరుచుకోండి. మీ మనసుతో మీ దేహాన్ని నఖశిఖ పర్యంతం రోజూ గమనించుకోండి. మీ శరీరాన్ని మనసుతో అనుసంధానించండి. మీ మనసు శరీరాన్ని పరిపూర్ణంగా చూసుకున్నప్పుడు నా శరీరం బాగుంది... నాకేం కాలేదని ధైర్యం తెచ్చుకుంటుంది. శరీరం ఒకదారిలో... మనసు ఒకదారిలో ఉన్నప్పుడు మనసులో భయం గూడుకట్టుకొని లేనిపోని అనుమానాలు వచ్చి పడతాయి. మీరు చేయాల్సింది ఒక్కటే. ఇంట్లో ఉండండి. అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లకండి. హాయిగా తినండి. మీ భర్తతో హ్యాపీగా ఉండండి. మీకు కరోనా రాలేదు. ఒకవేళ వచ్చినా మునిగిపోయింది లేదు. అది వచ్చినవారు చాలామంది బతికారు. బతుకుతున్నారు. ఆ టెన్షన్ వైద్యులను పడనివ్వండి. మీరు పడకండి' అని ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చాడు.

దాని మీద మూడు పూట్లా వేసుకోవాల్సిన టాబ్లెట్ పేరు ఉంది.

అది– ధైర్యం 500 ఎం.జి.

– కథనం: సాక్షి ఫ్యామిలీ

ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సైకియాట్రిస్ట్

# మానసిక విజయం









> **సుప్రీంకోర్ట్‌లో చంద్రచూడ్‌గారికి అసిస్టెంట్‌గా పనిచేయడమంటే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను గడించడమే. ముఖ్యంగా ఆ మూడు తీర్పులప్పుడు చేసిన పరిశోధనతో చాలా నేర్చుకున్నాను. ఆ చారిత్రాత్మక తీర్పులకు నేను ప్రత్యక్ష సాక్షిని. ఇంతకు మించిన ఆనందం ఏం ఉంటుంది? ఆ మూడు సందర్భాల్లో కోర్టు హాలులో వినిపించిన చప్పట్లు.. కోర్ట్ బయట మీడియాతో సహా సామాన్య జనం జరుపుకున్న సంబరాలు ఎప్పటికీ మరిచిపోలేను.**
> **- మానసి**

హైదరాబాద్.. 2017 సంవత్సరం..

ఒకరోజు రాత్రి పదిగంటల సమయం.. పని ముగించుకొని ఆఫీస్ నుంచి ఇంటికి బయలుదేరారు అడ్వకేట్ మానసి చౌదరి. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 దగ్గర సిగ్నల్స్ దగ్గర తన కారును ఎవరో ఢీ కొట్టినట్టనిపించింది ఆమెకు. పరిస్థితి అర్థమయ్యేలోపే ఇద్దరబ్బాయిలు కారు దిగి ఆమె కారు దగ్గరకు వచ్చి.. కారు అద్దాలను పగలకొట్టారు విండోస్, రేర్ వ్యూ మిర్రర్స్ సహా. ఈ బీభత్సాన్ని చూసి గట్టిగా అరిచారు మానసి. దాంతో ఆమెకు మిడిల్ ఫింగర్ చూపిస్తూ వెళ్లిపోయారు ఆ ఇద్దరూ. వాళ్ల కారు నంబర్ ప్లేట్‌ను ఫొటో తీసుకొని షీ టీమ్స్‌కి సమాచారమందించి, దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌లో కంప్లయింట్ ఇచ్చారామె. తెల్లవారి.. ఆ కుర్రాళ్లిద్దరినీ పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు పోలీసులు. ఆ అబ్బాయిలిద్దరి నుంచి బేషరతుగా క్షమాపణ రాయించుకున్నారు మానసి. 'నిజానికి వాళ్ల మీద కంప్లయింట్ చేయాలనేమీ అనుకోలేదు. కాని అలాగే వదిలేస్తే.. ఏం చేసినా ఆడవాళ్ల నోరు మెదపరు, ఏం చేసినా చెల్లుతుంది అనే రాంగ్ మెసేజ్ పోతుంది. అందుకే కంప్లయింట్ ఇచ్చా' అని జరిగిన సంఘటనను ఒకసారి గుర్తు చేసుకున్నారు ఆమె.

**అసలు ఈ ప్రస్తావన ఇప్పుడు ఎందుకు?**

రాజ్యాంగం మహిళలకు ఇచ్చిన హక్కులు, కల్పించిన సమస్త చట్టాలన్నిటినీ ఒక దగ్గర చేర్చి 'పింక్ లీగల్' అనే వెబ్‌సైట్‌ను ప్రారంభించారు మానసి, మొన్న ఎనిమిదో తారీఖు.. అంతర్జాతీయ మహిళాదినోత్సవం రోజున (8 మార్చి, 2020).
ఈ సందర్భమే పైన ప్రస్తావనకు కారణం. ముందు ఆమెను పరిచయం చేసుకుందాం.

ఆమె ముంబైలో పుట్టారు.హైదరాబాద్‌లో పెరిగారు. ఢిల్లీలోని జిందాల్ గ్లోబల్ లా కాలేజ్‌లో గ్రాడ్యుయేషన్ చేశారు. తర్వాత హైదరాబాద్ వచ్చేసి హైకోర్ట్ లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. యేడాది తర్వాత అంటే 2018లో మళ్లీ ఢిల్లీ వెళ్లారు సుప్రీంకోర్ట్ లాయర్‌గా అనుభవం గడించడానికి. జస్టీస్ చంద్రచూడ్ అసిస్టెంట్లలో ఒకరిగా చేరారు. ఎల్‌జీబీటీ సంబంధాలు (ఐపీసీ 377పై సడలింపు) నేరం కాదని, అడల్ట్రీ నేరం కాదని (ఐపీసీ 497), శబరిమల ఆలయంలోకి మహిళలకూ ప్రవేశం ఉండాలని వచ్చిన సుప్రీంకోర్టు తీర్పుల్లో జస్టీస్ చంద్రచూడ్ కృషి ఉంది. అందులో మానసికీ భాగస్వామ్యం ఉంది. 2019లో మళ్లీ హైదరాబాద్ హైకోర్ట్‌కి వచ్చేశారు ఆమె.

**పింక్ లీగల్ ఆలోచన..**

'లా చదువుతున్నప్పుడే అనుకున్నాను.. మహిళలకు సంబంధించిన అన్ని విషయాలను ఒక్కచోటకు చేర్చే ప్రయత్నమేదో చేయాలని. ఆ ఆలోచన హైదరాబాద్ వచ్చాక కూడా కొనసాగింది. అందుకే 2017లో నల్సార్ లా కాలేజ్ స్టూడెంట్స్‌తో కలిసి ఆన్ లైన్ సర్వే ఒకటి చేశాను. తమకున్న హక్కులేంటి? తమ కోసం ఎన్ని రకాల చట్టాలున్నాయి? అని ఎంతమంది ఆడవాళ్లు తెలుసు అనే విషయం మీద. 80 శాతం మందికి తెలియదని తేలింది సర్వేలో. ఆశ్చర్యం ఏంటంటే వాళ్లలో చాలా మంది చదువుకున్న, పట్టణాలు, నగరాల్లో ఉంటున్న మహిళలే! అప్పుడు అనిపించింది నా ఆలోచనను ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఆచరణలో పెట్టాలని. అయితే ఇతర బాధ్యతల్లో పడి ఆలస్యమై.. ఇప్పటికి సాధ్యమైంది' అంటూ పింగ్ లీగల్ నేపథ్యం చెప్పుకొచ్చారు ఆమె.

**ప్రాంతీయ భాషల్లో కూడా..**

ప్రస్తుతం పింక్ లీగల్ ఇంగ్లిష్‌లో ఉంది. త్వరలోనే దేశంలోని ప్రాంతీయ భాషలన్నిటిలోకి అనువదించనున్నారు. ఈ వారం, పది రోజుల్లోనే రెండువేల మందికి పైగా సబ్‌స్క్రైబ్ చేశారట. వీళ్లలో అబ్బాయిలూ ఉన్నారు. ముఖ్యంగా విద్యార్థులు అంటారామె. 'చదువురాని, గ్రామీణ ప్రాంతం వాళ్లకూ తేలికగా అర్థమయ్యేలా ఈ హక్కులు, చట్టాలను వివరిస్తూ యూ ట్యూబ్ చానెలూ పెట్టాలనుకుంటున్నాను. నా ఈ ప్రాజెక్ట్‌కు లా స్టూడెంట్స్ సహకారం చాలా ఉంది. మహిళల హక్కులు, చట్టాల మీద మహిళలకే కాదు పురుషులకూ అవగాహన అవసరం. అది హైస్కూల్ స్థాయి నుంచే ఆరంభిస్తే మరీ మంచిది. దీనిని పాఠ్యాంశాల్లో చేర్చాలి' అంటున్నారు మానసి.

– సరస్వతి రమ





epaper.sakshi.com

# నారప్ప వచ్చాడప్ప


● వెంకటేష్

'నారప్ప' తిరిగొచ్చారు. వెంకటేష్ టైటిల్ రోల్‌లో శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో డి.సురేష్‌బాబు, కలైపులి ఎస్.థాను నిర్మిస్తున్న చిత్రం 'నారప్ప'. తమిళంలో సూపర్ హిట్ సాధించిన ధనుష్ 'అసురన్' చిత్రానికి 'నారప్ప' తెలుగు రీమేక్. ఇటీవల తమిళనాడులో మొదలైన ఈ సినిమా భారీ షెడ్యూల్ ముగిసింది. హీరో వెంకటేష్ తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. అక్కడ ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను తెరకెక్కించారని తెలిసింది. స్టంట్‌మాస్టర్ పీటర్‌హెయిన్స్ ఆధ్వర్యంలో ఫైట్స్‌ని చిత్రీకరించారు. దేవి శ్రీదేవి సతీష్ సహ–నిర్మాతగా ఉన్న ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'నారప్ప' చిత్రాన్ని జూన్‌లోపే విడుదల చేయాలనుకుంటున్నారు.

# డార్లింగ్ ఈజ్ బ్యాక్


● ప్రభాస్

షూటింగ్ కోసం జార్జియాను చుట్టేశారు ప్రభాస్. కొన్ని ఫైట్లు, కూసిన్ని డైలాగ్స్‌తో జార్జియా షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ప్రభాస్ హీరోగా రాధాకృష్ణ దర్శకత్వంలో ఓ పీరియాడికల్ లవ్‌స్టోరీ తెరకెక్కుతోంది. పూజా హెగ్డే కథానాయిక. యూవీ క్రియేషన్స్, గోపీ కృష్ణ మూవీస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. కొన్ని కీలక సన్నివేశాల కోసం జార్జియా వెళ్లింది చిత్రబృందం. కరోనా ప్రభావం, వర్షాలను సైతం లెక్క చేయకుండా ఈ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. ''డార్లింగ్ (ప్రభాస్) మళ్లీ తన డార్లింగ్స్ (స్నేహితులు) దగ్గరకు వచ్చేశారు. జార్జియాలో షెడ్యూల్‌ను పూర్తి చేశాం. త్వరలోనే ఫస్ట్ లుక్‌ను విడుదల చేస్తాం'' అని ట్వీట్ చేశారు దర్శకుడు రాధాకృష్ణ. ఉగాది సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని విడుదల చేసి, టైటిల్‌ను ప్రకటించాలనుకుంటున్నారని సమాచారం. ఈ ఏడాది అక్టోబర్‌లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.


● రామ్‌చరణ్

# నా పుట్టినరోజు వేడుకలు వద్దు

'కరోనా వైరస్ ప్రభావం వల్ల ఈ ఏడాది నా పుట్టినరోజు వేడుకలు నిర్వహించొద్దు' అని రామ్ చరణ్ తన అభిమానులను కోరారు. మార్చి 27న రామ్‌చరణ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ప్రతి సంవత్సరం మెగా అభిమానులు ఆయన పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. అన్నదానం, రక్తదానం వంటి సామాజిక కార్యక్రమాలూ చేపట్టేవారు. అయితే ఈ ఏడాది బర్త్‌డే సెలబ్రేషన్స్‌కి దూరంగా ఉండాలంటూ రామ్‌చరణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. దాని సారాంశం ఇలా... ''మీకు (అభిమానులు) నాపై ఉన్న ప్రేమ, నా పుట్టినరోజుని పండుగగా జరపడానికి మీరు పడుతున్న కష్టాన్ని నేను అర్థం చేసుకోగలను. మనం ఉన్న ఈ అసాధారణ పరిస్థితులు మీకు తెలియనివి కాదు. ఇలాంటి సందర్భాల్లో జనం తక్కువగా ఉండేట్టు చూసుకోవడం మంచిది. ఇది మనసులో పెట్టుకుని ఈ సంవత్సరం నా పుట్టినరోజు వేడుకలను విరమించుకోవాల్సిందిగా మనవి. మీరంతా మన అధికారులకు సహకరించి కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టే విధానాలు ప్రజలకి అర్థమయ్యేలా తెలియజేసి మీ వంతు సామాజిక బాధ్యత నెరవేర్చండి. అదే నాకు మీరు ఇచ్చే అతి పెద్ద పుట్టినరోజు కానుక''.

# పని ఉంటే మస్తు.. లేదంటే పస్తు

**సినిమా ఒక అందమైన హరివిల్లు. హరివిల్లులోని ఏడు రంగులు తళతళలాడాలంటే దాని వెనక ఇరవై నాలుగు విభాగాల్లో కొన్ని వందల మంది గడియారంలా నిరంతరం శ్రమించాలి. ప్రేక్షకుడికి సినిమా కేవలం ఉల్లాసాన్నిచ్చే వినోదం కావొచ్చు. కానీ తెర వెనక.. కొన్ని వందల మంది ఉపాధి. ప్రస్తుతం కరోనా సినిమా ఇండస్ట్రీని పని చేయనీకుండా చేసింది. అంటే చాలా మందికి పని లేకుండా చేసినట్టే. రీల్ (రెక్క) ఆడితే కానీ డొక్కాడని జీవితాలు కృష్ణానగర్ వీధుల్లో తారసపడుతూనే ఉంటాయి. 'నేనింతే' సినిమాలో ఓ పాటలో అన్నట్టు 'పని (షూటింగ్) ఉంటే మస్తురమావా.. లేదంటే పస్తురమావా' అన్నట్లుంది ప్రస్తుత పరిస్థితి. స్పాట్‌బాయ్, లైట్‌మేన్, జూనియర్ ఆర్టిస్ట్‌లు, ఫైటర్స్, కాస్ట్యూమ్స్, ఆర్టిస్టుల అసిస్టెంట్స్, కెమెరా డిపార్ట్‌మెంట్, ప్రొడక్షన్ టీమ్, డ్రైవర్లు, మహిళా వర్కర్స్.. ఇలా 24 క్రాఫ్ట్స్‌లో ఉన్న చిన్న స్థాయి కార్మికుల మీద కరోనా ప్రభావం పడింది. స్టూడియోలు ఖాళీగా ఉంటున్నాయి.**


● బోసిపోయిన సెట్ ప్రతీకాత్మక చిత్రం

24 క్రాఫ్ట్స్‌లో ఎక్కువ శాతం మంది ఏ రోజు జీతం ఆ రోజు తీసుకునేవాళ్లే. అనుకోకుండా వచ్చిన ఈ బ్రేక్ వల్ల ఎందరో బడ్జెట్ పద్మనాభాల ఆర్థిక ప్రణాళికను కుప్పకూల్చింది. చెప్పాపెట్టకుండా ఊడిపడ్డ ఈ ఇబ్బంది వల్ల ఇంటి బండిని లాగడానికి ఇబ్బంది పడుతున్నాం అంటున్నారు పలువురు కార్మికులు. రెండున్నర గంటల నిడివి ఉన్న సినిమా పూర్తికావడానికి కొన్ని నెలల నుంచి సంవత్సరాలు పడుతుంది. ఒకరోజు షూటింగ్‌లో ఆర్టిస్ట్ మీద కెమెరా రన్ అయ్యే ముందు కొన్ని వందల మంది అటూఇటూ పరుగులు తీయాలి. ప్రొడక్షన్ వాళ్లు సెట్లో అడుగుపెట్టడంతో లొకేషన్ పొద్దు పొడుస్తుంది. ఆ తర్వాత లైటింగ్ డిపార్ట్‌మెంట్, సెట్ అస్టిస్టెంట్లు ఒకరి తర్వాత ఒకరు వస్తారు. సినీ సర్వీస్ సెంటర్లనుంచి కెమెరాలు వస్తుంటాయి. దర్శకుడు తన డైరెక్షన్ టీమ్‌తో ఆ రోజు తీయాల్సిన సన్నివేశాన్ని డిస్కస్ చేసుకుంటారు. ఈలోగా ఆర్టిస్టులు వచ్చి సన్నివేశానికి అనుగుణంగా తయారయి షాట్ రెడీ అయినప్పుడు క్యారవేన్ నుంచి బయటకు వస్తారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకూ ఒక కాల్షీట్, అదే సాయంత్రం 9 వరకూ షూటింగ్ చేస్తే ఒకటిన్నర కాల్షీట్ కింద లెక్క కడతారు. రాత్రి పన్నెండు వరకు షూటింగ్ కొనసాగితే రెండు కాల్షీట్‌ల కింద లెక్క పెడతారు. ఇలా ఒక్కరోజు షూటింగ్ కాల్షీట్‌ని బట్టి చాలా విభాగాల వారికి ఏ రోజు పారితోషికం ఆ రోజు అందుతుంటుంది. కుదరని పక్షాన వారం రోజులది ఒకేరోజు పే చేస్తారు. కరోనా కారణంగా లొకేషన్లు పొద్దు పొడవట్లేదు. సెట్లు కాంతివిహీనమయ్యాయి. లొకేషన్లు ఆకలి కేకలు పెడుతున్నాయి. సెట్లో ఎప్పుడూ ఉండే సందడి ప్రస్తుతం లేదు. మళ్లీ షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందో సరిగ్గా తెలియదు. ఇండస్ట్రీ షూటింగ్స్‌నే బతుకు'తెర'వుగా పెట్టుకున్న వాళ్లు విలవిలలాడుతున్నారు. 'వైరస్‌తో పోతామనే భయం కంటే ఆకలి చావులతో పోకుండా ఉండాలి కదా?' అని కొందరు పేర్కొన్నారు.



మా 'మహిళా వర్కర్స్ యూనియన్'లో మొత్తం 130 మంది ఉన్నాం. నెలకు పది పదిహేను రోజులు పని దొరుకుతుంది. గిన్నెలు కడగడం, అవసరమైతే వంట చేయడం, భోజనాలు వడ్డించడం, వాటర్ క్యాన్లు మోయడం మా పని. ఈ 130 మందిలో కొన్నేళ్లుగా పని చేసి చేసి అలసిపోయిన వాళ్లు, ఆరోగ్యం బాగాలేక పని చేయలేనివాళ్లు ఉన్నారు. మిగతావారిలో కొందరికే పని దొరుకుతుంది. ఉదయం 6 గంటలకు మొదలయ్యే కాల్షీట్ రాత్రి 7 వరకూ ఉంటుంది. రోజుకి 785 రూపాయలు ఇస్తారు. ఇప్పుడు షూటింగ్‌లు బంద్ కావడంతో అదీ లేదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో యూనియన్ వైపు నుంచి ఏదైనా చేద్దామన్నా మా దగ్గర అంత ఫండ్ ఉండదు. ఎవరికైనా ఆరోగ్యం బాగాలేకపోతే 5 నుంచి 10 వేలు వరకూ ఇవ్వగలుగుతాం. 130 మందిలో మరీ రోజు గడవని పరిస్థితుల్లో 10 మందికి పైనే ఉన్నారు. ఇప్పుడు పని లేక పరిస్థితి దారుణంగా ఉంది. ఎప్పుడు షూటింగులు మొదలవుతాయా అని ఎదురు చూస్తున్నాం.

– సినీ మరియు టీవీ ప్రొడక్షన్ మహిళా కార్మికుల సంఘం అధ్యక్షురాలు **టి. లలిత**

## షూటింగ్స్ ప్రారంభించే ప్రయత్నం చేస్తున్నాం



24 క్రాఫ్ట్స్‌కి చెందిన అందరికీ ఇబ్బందే. వీళ్లందరిలో చాలా మందికి సినిమా తప్ప వేరే పని తెలియదు.. రాదు. అనూహ్యంగా ఎదురైన ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలో చాలామందికి అర్థం కావడంలేదు. మార్చి 31 వరకూ షూటింగ్స్ నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ అన్ని రోజులు అంటే అన్ని విభాగాల వారికీ ఇబ్బందే. అందుకే ఈ నెల 21 నుంచి షూటింగ్స్‌ని మళ్లీ జరుపుకునేలా పర్మిషన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరనున్నాం. కరోనా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటూ, తక్కువమంది యూనిట్‌తో షూటింగ్ జరుపుకునేందుకు ప్లాన్ చేస్తున్నాం. 20 రోజులు షూటింగ్స్ లేకుండా ఉంటే సినిమా తయారవడానికి పని చేసే ప్రతి ఒక్కరికీ నష్టమే.

– జూనియర్ ఆర్టిస్ట్స్ ఏజెంట్స్ యూనియన్ అధ్యక్షుడు **కొమర వెంకటేష్**

## ఏం చేయాలో తెలియని పరిస్థితి



మా యూనియన్‌లో దాదాపు 1300 మంది ఉన్నారు. నెలలో పదిహేను రోజులే మాకు పని ఉంటుంది. అదీ అందరికీ ఉండదు. రోజుల తరబడి పనిలేనివారు కూడా ఉంటారు. ఇప్పుడు కరోనా వల్ల షూటింగ్స్ ఆగిపోయాయి. ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మాకు వేరే ఆదాయ మార్గం కూడా లేదు. ఒక సినిమా షూటింగ్ జరగాలంటే ఆర్టిస్టులు, జూనియర్ ఆర్టిస్టులు, లైట్‌మెన్స్.. ఇలా కనీసం రెండొందలమందైనా సెట్‌లో ఉండాలి. కరోనా వైరస్ కారణంగా గుంపులుగా ఉండి పని చేయకూడదని చెప్పారు. చేతిలో పని లేదు. ఊరికి వెళదామన్నా డబ్బులు లేవు. నిర్మాతలు మాత్రం ఏం చేస్తారు. షూటింగ్స్ అకస్మాత్తుగా ఆగిపోవడం వల్ల నిర్మాతలు కూడా డబ్బులు సర్దుబాటు చేయలేని పరిస్థితి. సినిమా షూటింగ్స్ ఈ నెల 31వరకు ఆగిపోయాయి. నాకు తెలిసి మా యూనియన్‌లో దాదాపు 75శాతం మంది అద్దెలు కట్టుకునేవారే. ఒకటో తారీఖు అద్దె, పాల బిల్లు.. ఇలా కట్టాల్సినవి చాలా ఉంటాయి. చాలామంది ఏం చేయాలో పాలుపోని స్థితిలో ఉన్నారు.

– లైట్‌మెన్ యూనియన్ అధ్యక్షుడు **ఎ. శ్రీనివాస్**

# సామాజిక బాధ్యతతో శక్తి

'రెమో', 'సీమ రాజా' చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల్లోనూ తన కంటూ గుర్తింపు తెచ్చుకున్న శివ కార్తికేయన్ హీరోగా నటించిన తాజా తమిళ చిత్రం 'హీరో'. పి.ఎస్. మిత్రన్ దర్శకత్వం వహించారు. కల్యాణీ ప్రియదర్శన్ హీరోయిన్. ఈ చిత్రంలో అర్జున్, బాలీవుడ్ నటుడు అభయ్ డియోల్ కీలక పాత్రలు చేశారు. తమిళ్‌లో గతేడాది డిసెంబర్‌లో విడుదలై ఘన విజయం సాధించిన 'హీరో' చిత్రాన్ని 'శక్తి' పేరుతో తెలుగులో అనువదించారు. కే.జే.ఆర్ స్టూడియోస్, గంగా ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో కోటపాడి జె.రాజేష్ ఈ చిత్రాన్ని ఈ నెల 20న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా కోటపాడి జె. రాజేష్ మాట్లాడుతూ– ''సామాజిక బాధ్యతతో తీసిన చిత్రమిది. ప్రస్తుత విద్యావ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో రూపొందింది. విద్యావ్యవస్థపై సినిమా అంటే 'జెంటిల్‌మేన్' సినిమా గుర్తుకు వస్తుంది. ప్రస్తుత విద్యా వ్యవస్థని సరి చేయడానికి 'జెంటిల్‌మేన్' వస్తే మా 'శక్తి'లా ఉంటాడు. అర్జున్‌గారు ఈ సినిమాను మరో స్థాయికి తీసుకువెళ్లారు. ఈ నెల 20న ఆంధ్రప్రదేశ్‌లో 'శక్తి' సినిమా విడుదల చేస్తున్నాం.. 22 నుంచి తెలంగాణలో థియేటర్లు మళ్లీ ప్రారంభిస్తారని అంటున్నారు. రెండు రోజులు ఆలస్యంగా నైజాంలో కూడా విడుదల చేస్తాం. ప్రస్తుతం శివ కార్తికేయన్ హీరోగా తమిళంలో ఓ సినిమా చేస్తున్నాం. సంతానం హీరోగా ఇంకో చిత్రం చేస్తున్నాం'' అన్నారు.


● శివ కార్తికేయన్

# ఇంట్లోనే ఉంటున్నా


● అమితాబ్




కరోనా వైరస్ పరిస్థితిని ధైర్యంగా ఎదుర్కోమంటూ సినిమా స్టార్స్ ఎప్పటికప్పుడు అభిమానులకు జాగ్రత్తలు చెబుతున్నారు. కొందరు వీడియో రూపంలో, కొందరు మెసేజ్ రూపంలో కరోనా గురించి హెచ్చరిస్తున్నారు. అమితాబ్ స్టాంప్ ద్వారా తెలిపారు. ఓటర్ ఇంక్‌తో ముంబైలో 'ప్రౌడ్ టు ప్రొటెక్ట్ ముంబైకర్స్ హోమ్ క్వారంటైన్డ్' అని చేతి మీద స్టాంప్ వేయించుకుంటున్నారు. దాన్ని ట్వీటర్ ద్వారా షేర్ చేసి, ఇంట్లోనే తనను తాను నిర్బంధం చేసుకుని జాగ్రత్తగా ఉంటున్నాను అని తెలిపారు అమితాబ్. ''అందరూ జాగ్రత్తగా ఉండండి. ఒకవేళ కరోనా లక్షణాలు కనిపిస్తే బయట ఎక్కువగా తిరగకండి'' అని రాసుకొచ్చారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్నప్పటి నుంచి ట్వీటర్ ద్వారా అభిమానులను జాగ్రత్తగా ఉండమంటూ వారిస్తున్నారాయన. కరోనా మీద ఓ పద్యం కూడా రాశారు. గత ఆదివారం అభిమానులను కలిసే ప్రోగ్రామ్ కూడా క్యాన్సిల్ చేసుకున్నారు.

# కాస్త అదనంగా ఇవ్వండి


● కాజల్ అగర్వాల్

''గడిచిన 48గంటల్లో తన ఫస్ట్ ప్రయాణీకురాలిని నేనే అని ఓ క్యాబ్ డ్రైవర్ నన్ను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. కనీసం ఈ రోజైనా కిరాణా సరుకులు ఇంటికి తీసుకురమ్మని తన భార్య చెప్పిందని ఆ క్యాబ్‌డ్రైవర్ నాతో చెప్పగానే ఎంతో బాధగా అనిపించింది'' అన్నారు కాజల్ అగర్వాల్. కరోనా వైరస్ ప్రభావం అన్ని రంగాలపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతోంది. ముఖ్యంగా దినసరి కార్మికుల జీవన విధానం దెబ్బతింటోంది. ఓ క్యాబ్ డ్రైవర్ గురించి కాజల్ అరగ్వాల్ మాట్లాడుతూ– ''దినసరి కార్మికుల జీవనశైలిని కరోనా మహమ్మారి తీవ్రంగా ఇబ్బందిపెడుతోంది. నాతో తన కష్టాలను చెప్పుకున్న ఆ క్యాబ్ డ్రైవర్‌కు నేను అదనంగా 500 రూపాయలు ఇచ్చాను. మనలో చాలామందికి కొంత మొత్తం పెద్ద సమస్య కాకపోవచ్చు. ఉపాధి కోల్పోయిన రోజువారీ కార్మికులకు మనం కాస్త ఎక్కువగానే డబ్బు ఇచ్చి ఈ కష్టకాలంలో వారికి అండగా ఉండటానికి ప్రయత్నిద్దాం'' అని పేర్కొన్నారు.

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
19-3-2020

# నిర్లక్ష్యం కూడదు... బెదిరిపోనూ వద్దు!

## ఇప్పుడు కావాల్సింది బ్యాలెన్స్‌డ్ అప్రోచ్



**ఇప్పుడు ఇరు రాష్ట్రాల్లో... ఆ మాటకొస్తే మన దేశంలోనే ఒక విపత్కరమైన పరిస్థితి ఉంది. కరోనా వైరస్ గురించి భరోసా ఇవ్వడానికో లేదా ధైర్యం చెప్పడానికో ఎవరైనా నాలుగు మాటలు మాట్లాడితే... దాన్ని తీసుకొని 'ఇంత నిర్లక్ష్యమా... చైనాలో, ఇటలీలో పరిస్థితులు కనిపించడం లేదా' అని సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరుగుతుంది. అలాగని... అక్కడి పరిస్థితులను వివరించి కాస్త అప్రమత్తంగా ఉండమని చెబితే 'ఎందుకు మరీ ఇంతలా బెదరగొడుతున్నారు' అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో నిపుణులు ఏం చెప్పినా... అటు పూర్తిగా నిర్లక్ష్యంగా ఉండమనో... ఇటు మరింతగా బెంబేలెత్తిపొమ్మనో కాదు. ఈ రెండు కార్యకలాపాలు ఎలా జరుగుతున్నాయో, ఈ రెండు అంశాల మధ్య బ్యాలెన్స్‌డ్‌గా ఎలా వ్యవహరించాలో చూద్దాం.**

భారత్‌లో మొదటి కరోనా కేసు జనవరి 30న నమోదైంది. కేరళకు వచ్చిన వుహాన్ యూనివర్సిటీకి చెందిన ఓ విద్యార్థి కేసు ఇది. ఆ తర్వాత ఫిబ్రవరి రెండున, మూడున కేరళలోని కాసర్‌గోడ్‌లో మరో రెండు కేసులను గుర్తించారు. ఇవి కూడా చైనా నుంచి వచ్చిన వారిలోనే. ఇక మార్చి 1–15 వరకు మొత్తం 110 కేసులను గుర్తించారని కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యశాఖ వివరాలు తెలుపుతున్నాయి. అదే తెలంగాణ ప్రభుత్వం చెప్పే వివరాలను బట్టి రాష్ట్రంలో ఇప్పటికి ఆరుగురు రోగులను గుర్తించారు. 66.000కు పైగా ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఒక ఇంజనీరుకు కరోనా ఉన్నట్లు అనుమానించగానే అతడు లేదా అతడిని తాకారని భావించిన 36 మందిని గుర్తించి వారందరినీ ట్రాక్ చేసి, వారికి పరీక్షలు నిర్వహించారు.

### మన దేశం, రాష్ట్రాల్లో ఈ వారమే కీలకం...

మన రాష్ట్రంతో పాటు దాదాపు దేశమంతటా మార్చి మొదటివారంలో (జనవరి 30న కనుగొన్న కేసును మినహాయించి) కరోనా కేసులు కనుగొన్నారు. ఇప్పటికి రెండో వారం గడిచి మూడో వారంలోకి మనం ప్రవేశించనున్నాం.

ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా మొదటి, రెండో, మూడో వారం నాటి ధోరణులను చూద్దాం. న్యూయార్క్‌లో మొదటివారం రెండు కేసులు నమోదు కాగా... రెండోవారంలో ఆ సంఖ్య 105కు పెరిగింది. మూడో వారంలో రోగుల సంఖ్య కాస్తా 610కి మించిపోయింది. అలాగే ఫ్రాన్స్‌లో మొదటి వారంలో 12 మంది రోగులను కనుగొంటే... రెండోవారానికి 190 మంది మూడో వారానికి ఆ సంఖ్య 660కి పెరిగింది. ఇరాన్‌లో పరిస్థితి ఇంకా భీతావహంగా ఉంది. మొదటివారంలో కేసుల సంఖ్య 2 మాత్రమే ఉండగా రెండోవారంలో 43, మూడో వారంలో 245, మూడోవారంలో 4,400కు పైగా, ఐదో వారంలో దాదాపు 13,000 కేసులు నమోదయ్యాయి. ఇక ఇటలీలో మొదటివారంలో 3, రెండోవారంలో 150, మూడోవారంలో 1036, నాలుగోవారంలో 6,300, ఐదోవారంలో 21,157 కేసులు నమోదయ్యాయి.

ఇక మన భారత్ విషయానికి వద్దాం. మొదటివారంలో 3 కేసులు, రెండో వారంలో 24 కేసులు, మూడోవారంలో 110 కేసులు వచ్చాయి. ఈ గణాంకాల ధోరణలు పరిశీలిస్తే... మొదటి వారం కంటే రెండోవారినికి వందల సంఖ్యలో కేసులు పెరిగితే... రెండో వారం నుంచి మూడోవారానికి అవి వేల సంఖ్యకు చేరుకున్నాయి. నాలుగు–ఐదు వారాల్లో 10,000 సంఖ్యను తాకుతున్నాయి. అంటే కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంటే... మూడో వారం నుంచి నాలుగో వారానికి వేల సంఖ్యకు చేరుతున్నందున.... ఇప్పుడు మనం మూడో వారంలో ఉన్నందున ఈ దశలో మనం మరింత అప్రమత్తంగా ఉండాలి.

### మరణాల శాతం తక్కువ అని నిర్లక్ష్యం వద్దు

అందరూ చెబుతున్న మాట ఏమిటంటే... కరోనా కేసుల కారణంగా నమోదైన మరణాలు 2 శాతమేనని. ఈ సంఖ్య చాలా తక్కువగా అనిపించినా మన దేశ జనాభాను దృష్టిలో పెట్టుకుంటే ఎంతమాత్రమూ నిర్లక్ష్యం వహించడానికి వీల్లేని పరిస్థితి. మన దేశ జనాభా దాదాపు 130 కోట్లు. అందుకే కేవలం ఒక శాతం మందికి కరోనా సోకినా... రోగుల సంఖ్య కోటి మందికి పైమాటే. అందులో రెండు శాతం అంటే... రెండు కోట్ల మంది. ఈ సంఖ్యను ఊహించడానికే భయంగా ఉంటుంది. అందుకే అప్రమత్తంగా ఉంటూనే... భయం లేకుండా వ్యవహరించమని నిపుణుల సలహా ఇస్తున్నారు. అయితే ప్రస్తుతం నిపుణులు ఏవైనా ధైర్య వచనాలు చెబితే నిర్లక్ష్యాన్ని పెంచుతున్నారనీ... ఏవైనా జాగ్రత్తలు ఉటంకిస్తే అసలే భయపడుతున్న తరుణంలో మరింతగా బెంబేలెత్తిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### పారాసిటమాల్‌తో చికిత్స అంటే...

చికిత్సకు పారాసిటమాల్ పనికి వస్తుందంటే... కేవలం పారాసిటమాల్ వల్లనే కరోనా వైరస్ నయమవుతుందని కాదు. కానీ పారాసిటమాల్ కీలక భూమిక వస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఎందుకంటే... వైరస్ వల్ల వచ్చే ఈ వ్యాధికైనా లక్షణాలకు మాత్రమే చికిత్స చేయడం సాధ్యమవుతుంది. అంటే... అది ఏ వైరస్ అయినప్పటికీ, దాని కారణంగా జ్వరం వస్తే అది తగ్గేందుకు, దానితోపాటు కనిపించే తలనొప్పి, ఒళ్లునొప్పులు వంటి లక్షణాలు తగ్గేందుకు ఇచ్చే తొలి మాత్ర 'పారాసిటమాల్'. దాని తర్వాత అవసరాన్ని బట్టి 'ఫావిలావిర్' అని కరోనా కోసం ఏర్పరచి ప్రోటోకాల్‌లో నిర్ణయించిన మాత్ర... ఆ తర్వాత అవసరాన్ని బట్టి వ్యాధి నిరోధకత పెంచేందుకు ఒక్కోసారి హెచ్ఐవీకి వాడే మాత్రలను డాక్టర్లు ఇస్తుంటారు. తమదైన ప్రోటోకాల్‌తో కరోనా వైరస్‌ను నయం చేసిన మన జైపూర్ డాక్టర్ల చికిత్స విధానాన్ని తెలుసుకునేందుకు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి వెల్లడవుతోంది. ఇప్పటికి ఇంకెక్కడా దీనికి నిర్దిష్టమైన ప్రోటోకాల్ లేనందున, ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్స్ (ఐసీఎమ్ఆర్) సంస్థ అనుమతితో మనం స్వయంగా ఈ ప్రోటోకాల్ రూపొందించుకున్నాం. అయితే... పారాసిటమాల్ అనేది అందరికీ తెలిసిన మాత్ర కాబట్టి దానిని ఉదాహరిస్తుంటారు తప్ప... అదే సర్వ వైరస్‌ల రోగాలకు నివారిణి అని కాదు. ఈ విషయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నవారు కొందరు విమర్శలకు దిగుతుంటే... నిర్లక్ష్యంగా వ్యవహరించే మరికొందరు పారాసిటమాల్ చాలట అంటూ ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారు. నిజానికి ఈ రెండు ధోరణులూ తప్పే. అతి భయమూ కూడదు. ఉదాసీనతా పనికి రాదు.

### గణాంకాలు ధైర్యం కోసమే...

ఇటీవల చివరి రోగిని సైతం డిశ్చార్జ్ చేసిన చైనాలో కరోనా వైరస్ బారిన పడి మరణించిన వారిని పరిశీలిస్తూ నిర్వహించిన ఒక అధ్యయనం ద్వారా తెలిసిన వివరాల ప్రకారం... మొత్తం 72,000 మంది రోగులను పరిశీలించగా... వారిలో గుండెజబ్బులు ఉన్న వెయ్యి మందిలో 105 మంది, డయాబెటిస్‌తో బాధపడుతున్న వెయ్యిలో 73 మంది, ఆస్తమా ఉన్న వెయ్యిమందిలో 63 మంది హైబీపీతో బాధపడుతున్న వందమందిలో ఆరుగురు రోగులు, క్యాన్సర్‌తో బాధడుతున్న 1000 మందిలో 56 మంది మరణించారని తేలింది. అంటే... గుండెజబ్బులున్నవారిలో దాదాపు 90 శాతం, డయాబెటిస్‌తో బాధపడేవారలో 93 శాతం, ఆస్తమా వ్యాధిగ్రస్తుల్లో 94 శాతం, క్యాన్సర్ వ్యాధిగస్తుల్లో 95 శాతం మంది సురక్షితమని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏ జబ్బూ లేనివారిలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందే మృతి చెందారని ఈ వివరాలు చెబుతున్నాయి. దీని అర్థం గుండెజబ్బులున్నవారిలో 10.5% మంది, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారిలో 7.3% మంది, ఆస్తమా ఉన్నవారిలో 6.3 శాతం మంది, హైబీపీ రోగుల్లో 6% మంది 'మాత్రమే' మరణించారని చెబితే... ఈ 'మాత్రమే' అన్న పదాన్ని పరిగణనలోకి తీసుకుని వారు చనిపోయినా పర్వాలేదా అని ప్రశ్నించేవారూ ఉన్నారు. అయితే ఇక్కడి గణాంకాల ద్వారా చెప్పే విషయం ఏమిటంటే... ఆ కొద్దిశాతం మంది మరణించినా పర్లేదని దాని అర్థం కాబోదు. కేవలం ఇంత కొద్దిశాతం మాత్రమే మరణాలు ఉన్నందున, మనమంతా ఆశాజీవులం కాబట్టి... ఒకవేళ వ్యాధిసోకినా కూడా... మనం కూడా బతికి బయటపడ్డ వారి జాబితాలో ఉండేందుకు అవకాశాలు ఎక్కువ అని భరోసా ఇవ్వడమే. ప్రతి జీవితమూ చాలా విలువైనదే, అమూల్యమైనదే (ఎవ్రీ లైఫ్ ఈజ్ ప్రెషియస్). కాబట్టి ఇక్కడ పేర్కొన్న శాతాలను బట్టి మిగతావాళ్లు చనిపోయినా పర్వాలేదు అనేలా వ్యాఖ్యానించడం పొరబాటన్నది వైద్య నిపుణుల, అధ్యయనవేత్తలు/గణాంకవేత్తల, శాస్త్రవేత్తల మాట.

ఏ విషయాలైనా వివరించినప్పుడు దాన్ని పట్టుకుని అయితే ఆ చివరకో... లేదంటే ఈ చివరకో (ఎయిదర్ దిస్ ఎక్స్‌ట్రీమ్... ఆర్ దట్ ఎక్స్‌ట్రీమ్) అన్నట్లుగా వ్యాఖ్యానాలు చేయడం సరి కాదు. అలాగే ధైర్యం–భయాందోళనల విషయంలో అటు చివర, లేదంటే ఇటు చివర ఉండటం కూడా తప్పే. ఏ విషయంలోనైనా బ్యాలెన్స్‌డ్‌గా ఉండేలా ఈ తరుణంలో మనం వ్యవహరించాల్సిన అవసరం ఉంది.



**డాక్టర్ ఎస్. మల్లికార్జున్ రావు,**
సీనియర్ కన్సల్టెంట్ పల్మునాలజిస్ట్,
అపోలో హాస్పిటల్స్, హైదర్‌గూడ, హైదరాబాద్

## కరోనా పై కొన్ని అపోహలూ... వాస్తవాలు

**కరోనాపై సమాజంలో నెలకొని ఉన్న కొన్ని అపోహలూ... వాస్తవాలివి...**

### అపోహ

- కరోనా కేవలం వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి మాత్రమే సోకుతుంది.
- కరోనా వైరస్ చిన్నపిల్లలు, వృద్ధుల మీదే అత్యధికంగా ప్రభావం చూపుతుంది.
- అల్లం, ఉల్లి, వెల్లుల్లి, విటమిన్-సి ఎక్కువగా ఉండే నిమ్మజాతి పండ్లతో ఇది తగ్గిపోతుంది.

### వాస్తవం

- కరోనా వైరస్ అందరికీ సోకుతుంది. అన్ని వైరస్‌లకు లాగే వ్యాధి నిరోధక శక్తి ఉన్నవారికి ఇది తన ఇంక్యుబేషన్ పీరియడ్ తర్వాత కొద్దిసేపు ఉండి, ఆ తర్వాత నిర్వీర్యమవుతుంది. అయితే వ్యాధి నిరోధక శక్తి లేనివారిలో అది శ్వాసకోశ వ్యవస్థ పైభాగానికే (అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్‌కే) పరిమితం కాకుండా ఊపిరితిత్తుల కణాలపై దాడి చేసి ధ్వంసం చేస్తుంది. అదే అసలు సిసలు ముప్పు. అందుకే ప్రతి ఒక్కరూ వ్యాధినిరోధ శక్తి పెంపొందేలా మంచి సమతుల హారం తీసుకోవడం, పెరుగు వంటి ప్రోబయాటిక్ తీసుకోవడం, మంచినీళ్లు తాగడం, వ్యాయామం చేయడం, కంటికి నిండుగా నిద్ర పోవడం అవసరం
- ఇది వయోభేదం లేకుండా అందరికీ సోకుతుందనే విషయం తెలిసిందే. అయితే మరీ చిన్నపిల్లలు, వృద్ధుల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువ కాబట్టి వారు దీని బారిన పడే ప్రమాదం ఎక్కువ. అయితే చిత్రంగా అది చిన్నపిల్లల కంటే వృద్ధులు... అందునా 80 పైబడి, డయాబెటిస్, గుండెజబ్బులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలున్నవారిపై ఎక్కువగా ప్రభావం చూపుతోంది
- నిర్దిష్టంగా వాటి వల్ల ఇది తగ్గిపోతుందని ఎక్కడా స్పష్టమైన అధ్యయనాల దాఖలాలు లేవు. అయితే అల్లం, ఉల్లి, వెల్లుల్లి వంటివి జలుబు జాతి వైరస్‌ల కారణంగా వచ్చే ఆరోగ్యసమస్యలప్పుడు కొంత ఉపశమనం కలిగిస్తాయన్న విషయం అనుభవంలో ఉన్నదే.



**డాక్టర్ విశ్వేశ్వరన్ బాలసుబ్రమణియన్**
సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మొనాలజిస్ట్ అండ్ స్లీప్ మెడిసిన్ స్పెషలిస్ట్, యశోద హాస్పిటల్స్, మలక్‌పేట, హైదరాబాద్

## అల్సర్‌కి క్యాన్సర్‌కి తేడా తెలుసుకుందాం...

# అల్సర్ క్యాన్సర్ కాదు

నీళ్లు తక్కువగా తాగడం వల్లనో లేదా విపరీతమైన మానసిక ఒత్తిడి వల్లనో ప్రతి ఒక్కరూ తమ జీవితకాలంలో ఏదో ఒక దశలో కడుపులో అల్సర్‌కు గురికావడం చాలా సాధారణం. అందుకనే పరీక్షల సమయంలో విద్యార్థుల్లో చాలా ఎక్కువగా నోటిపూతను గమనించవచ్చు. సాధారణంగా మూడు, నాలుగు రోగుల్లో తగ్గిపోయే అల్సర్ అంతకంటే ఎక్కువగా ఉండి తరచూ బాధిస్తూ ఉంటే... ఎవరికైనా అనేక అనుమానాలు వేధిస్తూ ఉంటాయి. ఈ అల్సర్లలో... పెప్టిక్ అల్సర్స్, గ్యాస్ట్రిక్ అల్సర్స్, ఈసోఫేగల్ (అన్నవాహిక) అల్సర్స్, మంచానికే పరిమితమై కదలలేని పరిస్థితుల్లో ఏర్పడే పుండ్లు, సిఫిలిస్, హెర్పిస్ వంటి సమస్యల వల్ల ఏర్పడేవి, ఫంగల్ ఇన్ఫెక్షన్స్ వల్ల మర్మావయవాలలో కనిపించే అల్సర్స్, డయాబెటిక్ సమస్య కారణంగా కాళ్లలో వచ్చే న్యూరోపతిక్ అల్సర్స్... ఇలా రకరకాల అల్సర్స్‌ను చూడవచ్చు.

జీర్ణవ్యవస్థకు సంబంధించిన అల్సర్స్‌లో పెప్టిక్ అల్సర్స్‌ను ఎక్కువగా చూస్తుంటాము. చిన్నపేగు మొదట్లో ఉండే ఈ అల్సర్స్‌ను డియోడినల్ అల్సర్స్ అని అంటారు. జీర్ణవ్యవస్థలో ఎక్కువగా కనిపించే ఈ పూత దాదాపు 1% మాత్రమే క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంటుంది. జీర్ణాశయంలో వచ్చే అల్సర్స్‌ను గ్యాస్ట్రిక్ అల్సర్ అంటారు. పెప్టిక్ అల్సర్స్ కంటే ఇవి తక్కువగా కనిపించినా గ్యాస్ట్రిక్ అల్సర్స్ అనేవి క్యాన్సర్‌గా మారే ప్రమాదం కాస్తంత ఎక్కువ. అన్నవాహికలో అల్సర్స్ చాలా అరుదుగా కనిపిస్తాయి. నోటిపూతకు స్ట్రెస్, విటమిన్స్... అందునా ప్రత్యేకంగా విటమిన్–బి లోపం ప్రధాన కారణాలైతే... జీర్ణవ్యవస్థకు సంబంధించిన మిగతా అల్సర్స్‌కు హెలికోబ్యాక్టర్ పైలోరీ (హెచ్. పైలోరీ) అనే బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్ ప్రధాన కారణం.

దాదాపు 1980ల వరకు అల్సర్స్‌కు మసాలా ఆహారం, కారం, ఒత్తిడి ప్రధాన కారణాలు అనుకునేవారు. పొట్ట,పేగుల విషయంలోనైతే ఆల్కహాల్ ఎక్కువగా తీసుకోవడం ప్రధాన కారణంగా భావించేవారు. ఈ భావన దాదాపు 100 ఏళ్లు కొనసాగింది. ఈ నూర్రేళ్ల కాలంలోనూ వాటికి దూరంగా ఉండమనే సలహాలనే డాక్టర్లు ఎక్కువగా ఇస్తుండేవారు. 1982లో టారీమార్షల్, రాబిన్ వారెన్ అనే ఇద్దరు డాక్టర్లు జీర్ణవ్యవస్థకు సంబంధించిన అల్సర్స్‌కు కారణం హెలికోబ్యాక్టర్ పైలోరీ (హెచ్–పైలోరీ) అనే బ్యాక్టీరియా అని కనుగొన్నారు. ఈ విషయాన్ని కనుగొన్నందుకు వారికి నోబెల్ బహుమతి కూడా ప్రదానం చేశారు.

మన జనాభాలో దాదాపు 90శాతం మంది ఎప్పుడో ఒకప్పుడు ఈ బ్యాక్టీరియాకు గురయ్యే ఉంటారు. కానీ ఒత్తిడి, అసిడిటీ, ఆల్కహాల్ వంటి కారణాల వల్లనో లేదా శరీరతత్వం వల్లనో వారి జీర్ణవ్యవస్థ లైనింగ్ దెబ్బతిన్నప్పుడు ఈ బ్యాక్టీరియా కారణంగా అల్సర్స్ రావడం జరుగుతుంది. పెయిన్ కిల్లర్స్ ఎక్కువగా తీసుకునేవారిలో ఈ బ్యాక్టీరియాకు గురయ్యే ప్రమాదం ఎక్కువ. జీర్ణవ్యవస్థలో అల్సర్స్ ఉన్నవారికి కడుపు నొప్పితో పాటు ఈ కింది లక్షణాలు కనిపించే అవకాశం ఉంది. అవి... ● ఆకలి తగ్గడం ● అసిడిటీ ● వికారం, ఎక్కిళ్లు, తేన్పులు ● రక్తపు వాంతులు, మలంలో రక్తం పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పొట్టకు సంబంధించిన క్యాన్సర్‌ల చికిత్సలు కూడా కణితి వచ్చిన ప్రదేశం, స్టేజ్, వయసు, ఇతర ఆరోగ్య విషయాలపై ఆధారపడి ఉంటాయి. పొట్టలో కణితి వచ్చిన ప్రదేశాన్ని బట్టి... గ్యాస్ట్రెక్టమీ చేసి కొంతభాగాన్ని తీసేయడం లేదా పొట్ట మొత్తాన్ని తీసివేయడం జరుగుతుంది. అంతే కాదు... చుట్టుపక్కల ఉన్న లింఫ్ నోడ్స్, చిన్నపేగుల్లో కొంత భాగాన్ని, అన్నవాహికలో కొంతభాగాన్ని తీసివేయాల్సి రావచ్చు.



**Dr. Ch. Mohana Vamsy**
Chief Surgical Oncologist
Omega Hospitals, Hyderabad
Ph: 98480 11421,
Kurnool 08518273001

అలాగే క్యాన్సర్‌ను కాస్త ఆలస్యంగా గుర్తించినప్పుడు పొట్ట మొత్తాన్ని తొలగించి, అన్నవాహికను చిన్నపేగులతో కలిపేస్తారు. సర్జరీ తర్వాత ఆహారం తీసుకోలేకపోవడం, వాంతులు, వికారం, మలబద్ధకం, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. సర్జరీ చేశాక కీమో, రేడియేథెరపీ ఇచ్చి లేక రేడియోథెరపీ తర్వాత సర్జరీ చేసినా ఈ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. పొట్టకు సంబంధించిన క్యాన్సర్ విషయంలో ఆహారం పట్ల ఇంకా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి.

సర్జరీ తర్వాత సప్లిమెంట్స్, విటమిన్–డి, క్యాల్షియమ, ఐరన్, విటమిన్–బి12 ఇంజెక్షన్లు అవసరం. పొట్టని తీసివేసినప్పుడు ఆహారం నేరుగా చిన్నపేగుల్లోకి వెళ్లడం వల్ల కొందరిలో 'డంపింగ్ సిండ్రోమ్' వస్తుంది. ఆహారం తక్కువ మోతాదుల్లో ఎక్కువసార్లు తీసుకోవడం, ఆహారానికి ముందు, తర్వాత ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది.

క్యాన్సర్‌ను మరీ లేటుగా గుర్తించడం జరిగి, ఆహారం తీసుకోవడానికి కణితి అడ్డంకిగా ఉన్నప్పుడు లేజర్‌థెరపీ, రేడియేషన్ థెరపీలతో కణితిని చిన్నగా చేసి, పేగుల్లో స్టెంట్ అమరుస్తారు. మెటల్ లేదా ప్లాస్టిక్‌తో తయారైన ఈ ట్యూబ్ ద్వారా ఆహారం జీర్ణవ్యవస్థలోకి వెళ్తుంది. అయితే ఇక్కడ అర్థం చేసుకోవాల్సిన అంశం ఒకటుంది. అదేమిటంటే... మరీ ఇలాంటి పరిస్థితి ఏర్పడ్డప్పుడు అప్పటికే క్యాన్సర్ ముదిరి ఇతర అవయవాలకు కూడా వ్యాప్తి చెంది ఉంటుందని అర్థం చేసుకోవాలి.

స్టమక్ క్యాన్సర్ లక్షణాలు మొదటి దశలో అంత ప్రస్ఫుటంగా ఉండవు. అనుమానించేంత స్థాయిలో బయటపడ్డాయంటే అప్పటికే క్యాన్సర్ స్టేజ్ కొద్దిగా ముదిరిన దశే అయి ఉంటుంది.

ఈ తరహా క్యాన్సర్లకు హెలికోబ్యాక్టర్ పైలోరీ (హెచ్.పైలోరీ) బ్యాక్టీరియా దాదాపు 65 – 80 శాతం వరకు కారణం. ఇంకా స్మోకింగ్, మద్యం, జన్యుపరమైన కారణాలు కూడా దోహదపడతాయి.

కడుపులో మంట, ఉబ్బరం, పుల్లటి తేన్పులు, అజీర్తి... ఇలాంటి లక్షణాలు ఎప్పుడో ఒకప్పుడు అందరూ ఎదుర్కొనేవే. అయితే ఈ లక్షణాలు తరచూ కనిపిస్తున్నాయంటే... యాంటాసిడ్లు విపరీతంగా వాడటం, తోచిన చిట్కాలు పాటించడం వంటివి చేస్తూ, ఒకవేళ వ్యాధి లోపల ఉండి ఉంటే దాన్ని ముదరబెట్టుకోకుండా కసారి అవసరమైన పరీక్షలు చేయించుకుని నిర్భయంగా, నిశ్చింతగా ఉండటం మంచిది.

# కరోనా గురించి ఆయుర్వేదం ఏం చెబుతోందంటే...



కరోనా వైరస్ అని నిర్దిష్టంగా ఓ వైరస్ గురించి ఆయుర్వేదం చెప్పకపోయినా... ఒకేసారి అకస్మాత్తుగా పాకిపోయే సూక్ష్మజీవుల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల గురించి ఆయుర్వేదం వర్ణించింది. ఈ నేపథ్యంలో అసలు ఇలాంటి అవుట్‌బ్రేక్ గురించి ఆయుర్వేదం ఏం చెబుతోందో చూద్దాం. ఆయుర్వేదం చెప్పిన విషయాలను ఇతర వైద్యవిధానాలతో సరిపోల్చుకుని, తమ విజ్ఞతను బట్టి మరీ ఎవరికి వారే ఈ వైద్యవిధానాన్ని అనుసరించవచ్చో లేదో నిర్ణయించుకోవచ్చు.

**వ్యాధులను వర్గీకరిస్తోంది ఇలా...**

తల్లిదండ్రుల బీజదోషాల వల్ల, ఆహార విహారాల తేడాల వల్ల వచ్చేవాటిని ఆయుర్వేదం 'నిజ'రోగాలుగా చెబుతుంది. ఇక వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, ఇతర ప్రమాదాల వల్ల వచ్చే వ్యాధులను 'ఆగంతుజ'రోగాలుగా అభివర్ణించింది. ఒకరి నుంచి మరొకరికి సంక్రమించే అంటు వ్యాధుల్ని 'సాంక్రామిక' రోగాలుగా ఉటంకించింది. ఇవి సంక్రమించే మార్గాలేమిటో సుశ్రుతాచార్యులు ఇలా చెప్పారు.

*ప్రసంగాత్, గాత్రసంస్పర్శాత్, నిశ్వాసాత్, సహభోజనాత్, సహ శయ్యా ఆసనాత్*
*చాపి వస్త్రమాల్యానులేపాత్... ... .... ఔపసర్గిక రోగాశ్చ సంక్రామంతి నరాన్నరాన్.*

మరీ దగ్గర దగ్గరగా కూర్చుని మాట్లాడటం, శరీరాలు తాకేటంత సన్నిహితంగా ఉండటం, ఒకరు వదిలిన ఊపిరిని మరొకరు పీల్చడం, రోగగ్రస్తమైన వారితో కూర్చుని భోజనం చేయడం, ఒకే మంచంపై కలిసి పడుకోవడం, ఒకరి వస్తువులు మరొకరు వాడటం వల్ల ఇవి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి.

శుచి, శుద్ధి (పరిశుభ్రత) లేనిచోట, లేని వారికి గ్రహరోగాలు సోకుతాయని కశ్యపుడు, చరకాచార్యుడు స్పష్టీకరించారు. అయితే ఇక్కడ గ్రహాలంటే 'పట్టి పీడించేవి' అనే అర్థంలో వాడిన శబ్ద విశేషం. పట్టి పీడిస్తాయి కాబట్టి ఆ పదాలకు 'వైరస్, బ్యాక్టీరియా' అనే సూక్ష్మాంగ క్రిములని అర్థం. (సవిష క్రిమి పిశాచాదయః ; గృహ్ణ తిగ్రసతీతి గ్రహః).

మళ్లీ ఈ క్రిములను ఉపకారులు, అపకారులు అని రెండుగా విభజించారు. అంటే... ఇంగ్లిష్ వైద్యవిధానం (అల్లోపతి)లోని బ్యాక్టీరియాలో మేలు చేసేవి. కీడు చేసేవిగా చెప్పిన విధంగానే ఇక్కడా వర్ణించారు. ఉదాహరణకు మనిషి పేగుల్లో అభివృద్ధి చెంది దేహపోషణకు పనిచేకొచ్చేవి ఉపకారులు. వ్యాధిని కలిగించేవి అపకారులు. గ్రహాలు (సూక్ష్మజీవులు) మామూలుగా కంటికి (నేకెడ్ ఐకి) కనిపించవని చెప్పారు. ఇవే మనం చెప్పుకునే వైరస్, బ్యాక్టీరియా వంటి సూక్ష్మాంగ కృములు / క్రిములు.



ఈ క్రిముల వల్ల ప్రాణవహ స్రోతస్సుకు (ముక్కు నుంచి ఊపిరితిత్తుల వరకు) సంబంధించిన లక్షణాలు : తుమ్ములు, ముక్కు కారడం, గొంతునొప్పి, దగ్గు, ఆయాసం, జ్వరం మొదలైనవి).

**నివారణ / చికిత్స:** వైరస్ (ఇక్కడ ఆయుర్వేదంలో చెప్పినట్టు గ్రహం అనే మాట కూడా వాడుకోవచ్చు) పేరేదైనా వ్యాధి లక్షణాలను బట్టే చికిత్స ఉంటుంది. ఆయుర్వేదంలో ఈ తరహా వైరస్ సమస్యలకు తాత్కాలిక ఉపశమనం (శమన చికిత్స), పూర్తిగా పోగొట్టడం (శోధన చికిత్స/పంచకర్మలు) వంటి పద్ధతులలో వైద్య నడుస్తుంది.

- నిదాన పరివర్జనం (అంటే కారణాన్ని దూరం చేయడం లేదా కారణానికి మనం దూరంగా ఉండటం) అన్నది ఒక ప్రధాన చికిత్సాసూత్రం.
- వ్యాధి క్షమత్వకశక్తి (ఓజస్సు)... (మామూలుగా ఇప్పుడు వాడే భాషలో చెప్పాలంటే వ్యాధి నిరోధక శక్తి) పటిష్టపరచడం మరో ముఖ్యసూత్రం. ఇది రసాయన, వాజీకరణ ప్రక్రియల ద్వారా సాధ్యపడుతుంది.
- పంచమహాభూతాలు (భూమి, నీరు, తేజస్సు, వాయువు, ఆకాశం) కాలుష్యానికి గురై వందల, వేల సంఖ్యలో ఒక్కసారిగా మనుషులు మృత్యువు పాలయ్యే పరిస్థితిని ''జనపదో ధ్వంసాలు'' అని చరకాచర్యుడు వివరించాడు. వీటినే ఇంగ్లిష్‌లో ఎపిడెమిక్/ప్యాండమిక్ వ్యాధులుగా చెబుతారు.

*ప్రకృత్యాభిః భావైః మనుష్యాణాం యే అన్యే భావా సామాన్యాః తత్ వైగుణ్యాత్ సమాన కాలాః ... ... జనపదముద్ధ్వంసయంతి ... ... జనపదేషు భవంతి ... ... వాయుః, ఉదకం. దేశః కాల ఇతి).*

శోకం, భయం, చింత మొదలైన ఉద్వేగాల వల్ల వ్యాధినిరోధకశక్తి /క్షమత్వం తగ్గిపోతుందని శాస్త్రకారులు స్పష్టీకరించారు.

**పాటించాల్సిన నివారణ చర్యలేమిటి:**

- శుచి, శుభ్రతకు సంబంధించి వ్యక్తిగతంగా శ్రద్ధ వహించాలి. ఇంటికి, పరిసరాలకు సాంబ్రాణి ధూపం వేయడం మంచిది. వేపకొమ్మలు, మామిడి తోరణాలు ద్వారాలకు కడితే ఆ ఆకులు సూక్ష్మక్రిముల్ని పీల్చేసుకుంటాయి.
- అల్లం, వెల్లుల్లి కషాయంతో రెండు చిటికెలు పసుపు, ఆరు చిటికెలు దాల్చిన చెక్క చూర్ణం కలిపి 30 మి.లీ. (ఆరు చెంచాలు) రోజూ తాగితే నివారణకు ఉపకరిస్తుంది. (ఇది కరోనా వైరస్‌కు మాత్రమే గాక... ఎలాంటి సాంక్రమిక రోగాలైనా నివారించేందుకు ఉపకరించే సాధారణ మిశ్రమం). చిన్నపిల్లలకైతే రోజూ ఒకటి నుంచి రెండు చెంచాలు తేనెతో ఇవ్వవచ్చు.
- ఉసిరికాయ (ఆమలకీ దేశీయ) అత్యుత్తమమైన ఔషధం. కాయను నమిలి తిన్నా, రసం (ఒక చెంచా) తేనెతో లేదా ఎండించిన చూర్ణం (మూడు గ్రాములు) తేనెతో సేవించిన నివారణకూ / చికిత్సకూ పనికి వస్తుంది.

(ఉసిరిలోని విటమిన్–సి వ్యాధి నిరోధకతకు దోహదపడుతుందన్నది ఇంగ్లిష్ / అల్లోపతిక్ వైద్య విధానం చెప్పే మాటే కదా).

- గొంతు గరగర తగ్గడానికి వ్యోషాదివటి మాత్రలు చప్పరించాలి.

**ప్రధాన చికిత్స కోసం...**

- **త్రిభువనకీర్తి రస మాత్ర:** ఉదయం 1
- **మహాలక్ష్మీవిలాసరస మాత్ర:** రాత్రి 1
  ఇవి అత్యుత్తమ రసాయన ఔషధాలు.
- **తులసి ఆకుల రసం:** ఒక చెంచా తేనెతో రెండుపూటలా సేవించాలి.

చికిత్స తప్పనిసరిగా వైద్యుని పర్యవేక్షణలో జరగాలని గుర్తుంచుకోండి.

**గమనిక:** బయటి ఆహారం / తినుబండారాల జోలికి పోవద్దు. ఇంట్లో వండుకున్న తేలికైన ఆహారాన్ని వేడిగా ఉండగానే తినాలి.



**– డా. వృద్ధుల లక్ష్మీనరసింహశాస్త్రి ఆయుర్వేద వైద్య నిపుణులు, హైదరాబాద్**

epaper.sakshi.com

సాక్షి
# భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
గురువారం 19-3-2020

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## కెరీర్ కౌన్సెలింగ్ Q A

» సీఈసీ ఇంటర్ పూర్తిచేశాను.. తర్వాత నేను ఏం చేయాలి. బీకామ్‌లో చేరాలా... సీఏ/సీఎస్/సీఎంఏ వంటి కోర్సుల్లో చేరితే మేలా.. వాటిని పూర్తిచేయడం కష్టమంటున్నారు.. వాస్తవాలేంటి? – గీత

✦ ఇంటర్‌లో సీఈసీ పూర్తిచేసిన విద్యార్థులు బీకాం రెగ్యులర్, బీకాం కంప్యూటర్స్‌తో పాటు బీబీఏ వంటి కోర్సుల్లో చేరొచ్చు. ప్రస్తుతం సంప్రదాయ డిగ్రీలు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు పెద్దగా ఉండకపోవచ్చు. కాబట్టి కొంత కష్టమైనా ప్రొఫెషనల్ కోర్సులైన చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ), కంపెనీ సెక్రటరీ (సీఎస్), సీఎంఏ వంటివి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయి.

✦ ముఖ్యంగా కంపెనీల్లో, వ్యాపార వాణిజ్య రంగాలలో ఉజ్వల అవకాశాలున్న కోర్సు చార్టర్డ్ అకౌంటెన్సీ(సీఏ). ఈ కోర్సును ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అందిస్తోంది. దీని ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీలో ఉండగా, అన్ని ప్రధాన నగరాల్లో శాఖలు ఉన్నాయి. సీఏలో ఫౌండేషన్, ఇంటర్మీడియట్ (ఐపీసీసీ), సీఏ ఫైనల్స్ స్థాయిలు ఉంటాయి. ప్రణాళిక ప్రకారం చదివితే నిర్ణీత వ్యవధిలోనే కోర్సు పూర్తి చేసుకోవచ్చు. ఈ కోర్సు చేసినవారు ట్యాక్స్ కన్సల్టెంట్, ఆడిటర్, సలహాదారు, ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా సేవలు అందించవచ్చు. సీఏ చదివినవారు కార్పొరేట్ రంగంలో ప్రవేశించవచ్చు. సొంతంగా ప్రాక్టీస్ సైతం చేసుకోవచ్చు.

✦ సీఈసీ విద్యార్థులకు అనుకూలమైన మరో ప్రొఫెషనల్ కోర్సు.. కంపెనీ సెక్రటరీ (సీఎస్). ఈ కోర్సును ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అందిస్తోంది. కంపెనీ సెక్రటరీ సంస్థ పర్యవేక్షణతో పాటు అన్ని ఆర్థిక వ్యవహాలు చూసుకుంటాడు. అంతర్గత న్యాయ నిపుణుడిగా పనిచేస్తారు. సీఎస్ పూర్తి చేసిన తర్వాత సొంతంగా ప్రాక్టీస్ చేసుకోవచ్చు. కార్పొరేట్ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. త్వరగా ఉద్యోగం లేదా ఉపాధి పొందలంటే చాలా మంది కామర్స్ విద్యార్థులు తమ తొలి ప్రాధాన్య కోర్సులుగా సీఏ, సీఎస్‌ను ఎంచుకుంటున్నారు.

✦ అలాగే సీఈసీ విద్యార్థులు కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ(సీఎంఏ) కోర్సులోనూ చేరొచ్చు. ఎంబీఏ పూర్తిచేసిన అభ్యర్థులకు దీటుగా సీఎంఏలకు అవకాశాలు లభిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఈ కోర్సును అందిస్తోంది. ఫౌండేషన్, ఇంటర్మీడియెట్, ఫైనల్.. ఇలా మూడు దశల్లో కోర్సు ఉంటుంది.

✦ ఐటీ రంగంలో కెరీర్ ఎంచుకోవాలకున్న వారికి మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) సరైన కోర్సుగా పేర్కొనొచ్చు. ఎంసీఏతో సాఫ్ట్‌వేర్ డవలప్‌మెంట్, బ్యాంకింగ్, నెట్‌వర్కింగ్, ఐటీ కంపెనీలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఈ కోర్సు చేయాలంటే తొలుత డిగ్రీ బీకామ్ కంప్యూటర్స్ లేదా బీసీఏ పూర్తి చేయాలి. తర్వాత ఐసెట్ వంటి ఎంట్రన్స్ టెస్ట్‌లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా ఎంసీఏ చేయవచ్చు. సీఈసీ అభ్యర్థులు ఎవర్‌గ్రీన్ కోర్సు అయిన ఎల్‌ఎల్‌బీ కూడా చేయవచ్చు. ఇటీవల కాలంలో నైపుణ్యాలున్న లా అభ్యర్థులకు కార్పొరేట్ రంగంలోనూ అవకాశాలు లభిస్తున్నాయి.

### ప్రవేశాలు

**నాగార్జున వర్సిటీ పీజీసెట్-2020**

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీజీ సెట్-2020 నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా పీజీ(ఆర్ట్స్, సైన్స్, మ్యాథమెటిక్స్ తదితర) కోర్సుల్లో యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో ప్రవేశం కల్పిస్తారు. పరీక్ష ఆబ్జెక్టివ్ తరహాలో 100 మార్కులకు ఉంటుంది. సమయం 90 నిమిషాలు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్/ఓబీసీ: రూ.600,
- **ఎస్సీ/ఎస్టీ/వికలాంగులు:** రూ.500

**ముఖ్యమైన తేదీలు**

- **దరఖాస్తు చేసేందుకు చివరి తేదీ:** 20 ఏప్రిల్ 2020
- **ఆలస్య రుసుం(రూ.500):** ఏప్రిల్ 27, **తత్కాల్ ఫీజు(రూ.1000):** ఏప్రిల్ 30వరకు
- **ప్రవేశ పరీక్ష:** మే 5,6,7 తేదీల్లో జరుగుతుంది
- **వెబ్‌సైట్:** www.anudoa.in / www.anu.ac.in

**10వ తరగతి ప్రత్యేకం**
❖ 10వ తరగతి ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, స్టడీ మెటీరియల్, బిట్ బ్యాంక్ మొదలైనవి.. (EM &TM)
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి
Google Play App Store

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
TELUGU




# ఎంపీసీ.. ఇంజనీరింగ్‌తోపాటు మరెన్నో..!

పదో తరగతి తర్వాత ఎక్కువ మంది విద్యార్థులు ఎంపీసీ(మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ), బైపీసీ(బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ) గ్రూప్‌ల్లో చేరుతున్నారు. ఎంపీసీ అర్హతతో బీటెక్, బీఎస్సీ(ఎంపీసీ), ఫార్మసీ తదితర కోర్సుల్లో చేరొచ్చు. అలాగే బైపీసీతో ఎంబీబీఎస్, బీడీఎస్, వెటర్నరీ, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం పొందే అవకాశముంది. అదేవిధంగా సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌ల విద్యార్థులకు బీకాం, బీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అంతేకాకుండా కామర్స్(సీఈసీ, ఎంఈసీ) విద్యార్థులు సీఏ, సీఎస్, సీఎంఎస్ వంటి ప్రొఫెషనల్ కోర్సులూ పూర్తి చేసుకోవచ్చు.

**ఎంపీసీతో ఎన్నో కోర్సులు**

ఇంటర్ ఎంపీసీ విద్యార్థుల్లో అధికశాతం మంది లక్ష్యం.. ఇంజనీరింగ్(బీటెక్/బీఈ)లో చేరడం. దీనికోసం జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, ఎంసెట్ తదితర పరీక్షలకు హాజరవ్వాల్సి ఉంటుంది. బీటెక్/బీఈ పూర్తి చేసుకున్న వారికి ఉన్నత విద్య పరంగా ఎంటెక్, ఎంబీఏ కోర్సులను ఎంచుకోవచ్చు. బీటెక్‌కు పలు ప్రత్యామ్నాయ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఇంజనీరింగ్‌లో చేరని ఎక్కువ మంది ఎంపీసీ విద్యార్థులు సంప్రదాయ బీఎస్సీలో చేరేందుకు ఆసక్తి చూపుతుంటారు. వీటితోపాటు మరెన్నో కోర్సులను ఎంచుకునే అవకాశం ఉంది.

**బీటెక్-బయో టెక్నాలజీ**

ఎంపీసీ పూర్తి చేసుకొని కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లపై మక్కువ ఉన్న విద్యార్థులకు మంచి అవకాశంగా బీటెక్ బయోటెక్నాలజీ కోర్సును పేర్కొనొచ్చు. దీన్ని పూర్తి చేసిన వారికి కెమికల్, టెక్స్‌టైల్ పరిశ్రమల్లో.. వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థల్లో.. ఫార్మాస్యుటికల్ కంపెనీల్లో కొలువులు లభిస్తాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్) ర్యాంక్ ఆధారంగా ఆయా కళాశాలల్లో ప్రవేశం పొందొచ్చు. ఈ కోర్సుకు బైపీసీ విద్యార్థులు కూడా అర్హులే. వీరు మ్యాథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్స్‌లో ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి.

**ఆర్కిటెక్చర్ ఇంజనీరింగ్**

సంప్రదాయ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న కోర్సు.. ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్. ఐఐటీలు, ఎన్ఐటీలు సహా దేశంలోని పలు కళాశాలల్లో ఈ కోర్సు అందుబాటులో ఉంది. ఎన్ఐటీల్లో చేరాలనుకుంటే.. జేఈఈ మెయిన్‌లో రెండో పేపర్ రాయాల్సి ఉంటుంది. ఐఐటీల్లో ప్రవేశం పొందాలనుకుంటే.. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల తర్వాత ప్రత్యేకంగా నిర్వహించే ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించాలి.

**నాటా**

ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశానికి కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నిర్వహించే నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్‌లో ఉత్తీర్ణత సాధించాలి. దీని ద్వారా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అనుమతి పొందిన కళాశాలల్లో సీటు దక్కించుకోవచ్చు.

**పాఠశాల చదువులకు, యూనివర్సిటీ స్థాయి కోర్సులకు మధ్య ఉండే కీలక దశ.. ఇంటర్మీడియెట్! విద్యార్థులు పదోతరగతి అనంతరం ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తదితర గ్రూపుల్లో చేరతారు. భవిష్యత్ కెరీర్ గమనానికి ఇంటర్‌లోనే అంకురార్పణ జరిగినా.. ఆ తర్వాత ఎంచుకొనే కోర్సు మరింత కీలకంగా మారుతుంది. తెలుగు రాష్ట్రాల్లో లక్షల మంది ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యారు. ఇప్పుడు వీరందరికి ఎదురవుతున్న ప్రశ్న.. ఇంటర్ తర్వాత ఏం చేయాలి.. ఏ గ్రూప్‌తో ఎలాంటి కోర్సుల్లో చేరొచ్చు?! ఈ నేపథ్యంలో ఇంటర్‌తో అందుబాటులో ఉన్న కోర్సులు, కెరీర్ మార్గాలపై ప్రత్యేక కథనం...**

**బీఎస్సీ**

ఇది సంప్రదాయ డిగ్రీ కోర్సు. ప్రస్తుతం ఈ కోర్సు సైతం ఆధునికత సంతరించుకుంటోంది. వినూత్న స్పెషలైజేషన్లు, కాంబినేషన్‌లతో బీఎస్సీ కోర్సు అందుబాటులో ఉంది. పలు యూనివర్సిటీలు ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, స్టాటిస్టిక్స్ తదితర మల్టీ డిసిప్లినరీ స్పెషలైజేషన్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. ఆసక్తి ఉంటే వీటిల్లో చేరొచ్చు.

**ఐఐఎస్సీ**

ఐఐఎస్సీ–బెంగళూరులో బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, మెటీరియల్స్, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ వంటి వివిధ సైన్స్ విభాగాల్లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్(రీసెర్చ్) ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఈ కోర్సు పూర్తి చేసుకుంటే... సైన్స్ రంగంలో ఉజ్వల కెరీర్‌కు మార్గం వేసుకున్నట్లే! కేవీపీవై, జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ యూజీ... ఇలా పలు మార్గాల్లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఇక్కడ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ చేస్తే శాస్త్రవేత్తలుగా, ప్రొఫెసర్లుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

» వెబ్‌సైట్: https://www.iisc.ac.in/

**ఐసర్**

ఎంపీసీ విద్యార్థులకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్) క్యాంపస్‌లు పలు సైన్స్ కోర్సులను అందిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న ఏడు క్యాంపస్‌ల(పుణె, బరంపూర్, భోపాల్, కోల్‌కత, మొహాలి, తిరువనంతపురం, తిరుపతి)లో బీఎస్–ఎంఎస్ పేరుతో డ్యూయల్ డిగ్రీ కోర్సు అందుబాటులో ఉంది. ఇందులో ప్రవేశానికి కేవీపీవై ఎక్స్ఏ స్ట్రీమ్ ఉత్తీర్ణతను లేదా జేఈఈ అడ్వాన్స్‌డ్ ర్యాంకును పరిగణనలోకి తీసుకుంటారు. ఆయా అర్హతలు లేనివారు ఐఏఎస్ఈఆర్ ప్రత్యేకంగా నిర్వహించే ఆప్టిట్యూడ్ టెస్టుకు హాజరవ్వాల్సి ఉంటుంది. ఐసర్‌లో సీటు సొంతం చేసుకున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు సైతం అందిస్తారు.

» వెబ్‌సైట్: www.iiseradmission.in

**ఐఎస్ఐ**

గణాంక నిపుణులుగా.. కార్పొరేట్ రంగంలో కెరీర్‌కు మార్గం వేసే ఉత్తమ వేదిక.. ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్(ఐఎస్ఐ). కోల్‌కత ప్రధాన కేంద్రంగా ఢిల్లీ, చెన్నై, తేజ్‌పూర్, హైదరాబాద్‌ల్లో అనుబంధ క్యాంపస్‌లు కలిగున్న ఐఎస్ఐ.. బ్యాచిలర్ ఆఫ్ మ్యాథమెటిక్స్, బ్యాచిలర్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో ఆనర్స్ కోర్సులను ఆఫర్‌చేస్తోంది. జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్ష ద్వారా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ కోర్సులు పూర్తి చేసుకున్న వారు స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌తో ఎంకాం, ఎమ్మెస్సీ పూర్తి చేస్తే డేటాఅనలిటిక్స్ విభాగంలో చక్కటి కెరీర్ సొంతం అవుతుంది. కేంద్ర గణాంక శాఖలోనూ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది.

» ఇంటర్ ఎంపీసీతో అనేక ఉన్నత విద్యావకాశాలు
» పదుల సంఖ్యలో సంప్రదాయ, వృత్తి విద్యా కోర్సులు
» వినూత్న ఉన్నత విద్యావకాశాలు, స్పెషలైజేషన్లు తెరపైకి వస్తున్న వైనం
» భవిష్యత్తుకు భరోసా ఇచ్చే కోర్సులను ఎంచుకోవడం ముఖ్యం

**ఫ్యాషన్ టెక్నాలజీ**

ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో అద్భుత అవకాశం.. ఫ్యాషన్ టెక్నాలజీ. జాతీయ స్థాయిలో మంచి పేరున్న విద్యాసంస్థ... నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ఇంటర్ అర్హతతో అందించే వివిధ కోర్సులకు విపరీతమైన క్రేజ్ ఉంది. నిఫ్ట్ క్యాంపస్‌లతోపాటు మరెన్నో ఇన్‌స్టిట్యూట్‌లు ఫ్యాషన్ కోర్సులను అందిస్తున్నాయి. వీటిని పూర్తి చేసుకున్న వారికి ఫ్యాషన్ రంగంలో కొలువులు లభిస్తాయి.

**ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ**

ఐదేళ్ల వ్యవధిలో ఉండే ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సును పూర్తిచేస్తే బ్యాచిలర్ డిగ్రీతోపాటు పీజీ పట్టా సొంతమవుతుంది. ఇటీవల కాలంలో సెంట్రల్ యూనివర్సిటీలు అందిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఎమ్మెసీ కోర్సులు విద్యార్థులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 సెంట్రల్ యూనివర్సిటీలు ఉన్నాయి. వీటిలో 14 యూనివర్సిటీల్లో ప్రవేశానికి సీయూసెట్ పేరుతో ప్రత్యేక ఎంట్రన్స్ నిర్వహిస్తారు. మిగతా యూనివర్సిటీలు సొంతంగా ప్రవేశ పరీక్షల ద్వారా సీట్లు భర్తీ చేస్తున్నాయి.

**బీఫార్మసీ, ఫార్మ్-డి**

ఎంపీసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న మరో కోర్సు.. బీ–ఫార్మసీ. తెలుగు రాష్ట్రాల్లో బీఫార్మసీ సీట్లలో 50 శాతం సీట్లను ఎంపీసీ విద్యార్థులకు కేటాయిస్తారు. ఇందుకోసం అభ్యర్థులు ఎంసెట్(ఇంజనీరింగ్ స్ట్రీమ్)లో ర్యాంకు సాధించాల్సి ఉంటుంది. బీ–ఫార్మసీ పూర్తిచేసుకున్న తర్వాత ఎం–ఫార్మసీ కూడా పూర్తి చేసుకుంటే.. ఫార్మాస్యుటికల్ సంస్థల్లో కీలక విభాగాల్లో(ఫార్ములేషన్, డ్రగ్ డిస్కవరీ, రీసెర్చ్, క్లినికల్ రీసెర్చ్) స్థిరపడొచ్చు.

## సీఈసీ/ఎంఈసీ... ప్రొఫెషనల్ కోర్సులు

**కార్పొరేట్ కొలువులు**

సీఈసీ/ఎంఈసీ.. ఇంటర్మీడియెట్‌లో ఆదరణ పెరుగుతున్న గ్రూప్‌లు. వీటిలో ఉత్తీర్ణత ఆధారంగా కార్పొరేట్ రంగంలో ఎగ్జిక్యూటివ్‌లుగా కెరీర్ ప్రారంభించే అవకాశం ఉంది.



**సీఏ, సీఎస్, సీఎంఏ**

కామర్స్ రంగంలో ప్రొఫెషనల్ కోర్సులుగా పేర్కొనే కోర్సులు.. చార్టర్ట్ అకౌంటెన్సీ(సీఏ), కంపెనీ సెక్రటరీ(సీఎస్), కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ (సీఎంఏ). వీటిలో ఇంటర్మీడియెట్ అర్హతతో అడుగు పెట్టొచ్చు. ప్రతి కోర్సులోనూ ఉండే మూడు దశలను విజయవంతంగా పూర్తిచేసుకుంటే.. కార్పొరేట్ సంస్థల్లో అకౌంటింగ్, ఫైనాన్స్, జనరల్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ విభాగాల్లో ఆఫీసర్ హోదాతో కెరీర్ ప్రారంభించొచ్చు.

**బీకామ్**

సీఈసీ విద్యార్థులకు అందుబాటులో ఉన్న సంప్రదాయ డిగ్రీ కోర్సు.. బీకాం. దీన్ని పూర్తి చేసుకుంటే..ఎంకాం, ఎంబీఏ వంటి ఉన్నత విద్యా కోర్సులు చదివేందుకు అవకాశం ఉంటుంది. ఎంబీఏ చేసిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.

**సాఫ్ట్‌వేర్ కోర్సులు**

సీఈసీ విద్యార్థులకు తక్షణం ఉపాధి కల్పించే అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సులకు కూడా మంచి ఆదరణ ఉంది. ట్యాలీ, వింగ్స్, ఫోకస్, పీచ్ ట్రీ వంటి అకౌంటింగ్ సాఫ్ట్‌వేర్ కోర్సుల సర్టిఫికెట్స్ సొంతం చేసుకుంటే.. ఆయా సంస్థల్లో జూనియర్ స్థాయిలో అకౌంటెంట్స్‌గా కొలువులు దక్కించుకోవచ్చు.

## హెచ్ఈసీ.. వినూత్న కోర్సులు

ఇంటర్మీడియెట్‌లో హెచ్ఈసీ పూర్తి చేసుకున్న విద్యార్థులు.. తమ ముందున్న ఏకైక మార్గం.. బీఏ(బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్) అని భావిస్తారు. వాస్తవానికి ఇది కొంతవరకు నిజమే. కానీ ఇటీవల కాలంలో హెచ్ఈసీ గ్రూప్ ఉత్తీర్ణులకు బీఏతోపాటు పలు వినూత్న కోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో ప్రధానమైనవి బ్యాచిలర్ ఆఫ్ సోషల్ వర్క్, బ్యాచిలర్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఆర్కియాలజీ, సోషియాలజీ, టూరిజం స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, పబ్లిక్ రిలేషన్ విభాగాల్లో బ్యాచిలర్ డిగ్రీ కోర్సులు. సోషల్ వర్క్, సోషల్ సైన్సెస్, సోషియాలజీ కోర్సులు పూర్తిచేసుకోవడం ద్వారా స్వచ్ఛంద సంస్థల్లో సత్వర ఉపాధి లభిస్తోంది. సీఎస్ఆర్ పాలసీ కారణంగా కార్పొరేట్ సంస్థల్లోనూ అవకాశాలు లభిస్తున్నాయి. అలాగే ప్రభుత్వ పరిధిలోని గ్రామీణాభివృద్ధి శాఖ, పీఎంఆర్‌డీఎఫ్ వంటి విభాగాల్లో ఫెలో మెంబర్స్‌గా పనిచేసే అవకాశం లభిస్తోంది. ఉన్నత విద్య పరంగా ఆలోచిస్తే న్యాయశాస్త్రం(లా), మేనేజ్‌మెంట్(ఎంబీఏ) వంటి ప్రొఫెషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తి చేస్తే కార్పొరేట్ సంస్థల్లో కొలువుదీరే అవకాశం దక్కుతుంది!!




# ఏపీ ఎంసెట్-2020

**ఏపీ ఎంసెట్-2020 నోటిఫికేషన్ విడుదలైంది. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, పార్మసీ తదితర కోర్సుల్లో ప్రవేశాల కోసం ఏటా ఎంసెట్ పరీక్షలకు లక్షల మంది అభ్యర్థులు హాజరవుతారు. ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీ అర్హతతో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ఏడాది జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ (కాకినాడ) ఎంసెట్‌ను నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ఎంసెట్ 2020 పూర్తి వివరాలు...**



- ఇంజనీరింగ్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలు
- ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీ, డిప్లొమా విద్యార్థులు అర్హులు
- ఆన్‌లైన దరఖాస్తులకు చివరి తేది: 29.03.2020

**కోర్సులు**

✦ ఏపీ ఎంసెట్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, అండ్ మెడికల్ విభాగంలో జరుగుతుంది.
✦ ఇంజనీరింగ్ విభాగంలో.. బీఈ/బీటెక్, బయో టెక్నాలజీ, బీటెక్(డెయిరీ టెక్నాలజీ/ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ, బీఫార్మసీ కోర్సులు ఉన్నాయి.
✦ అగ్రికల్చరల్/మెడికల్ విభాగంలో.. బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్), బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అండ్ యానిమల్ హజ్బెండరీ(బీవీఎస్సీ), బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ(బీఎఫ్ఎస్సీ), బీటెక్ (ఫుడ్‌సైన్స్ అండ్ టెక్నాలజీ), బీఎస్సీ(కమర్షియల్ అగ్రికల్చర్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్–సీఏ అండ్ బీఎం), బి–ఫార్మసీ, బీటెక్ బయోటెక్నాలజీ, ఫార్మ్–డీ కోర్సు(బైపీసీ)ల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

**ఇంజనీరింగ్ విభాగం అర్హతలు**

✦ ఇంటర్మీడియెట్/10+2 ఉత్తీర్ణత లేదా రెండో ఏడాది పరీక్ష రాసినవారు అర్హులు.
✦ ఇంజనీరింగ్/బీ ఫార్మసీల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియెట్ ఎంపీసీ ఉత్తీర్ణత. లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు పూర్తి చేసినవారు, చివరి సంవత్సరం పరీక్షలు రాస్తున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
✦ జనరల్ కేటగిరీ అభ్యర్థులు ఇంటర్‌లో కనీసం 45 శాతం మార్కులు, రిజర్వేషన్ వర్గాల అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి.
✦ అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్/తెలంగాణకు చెందిన వారై ఉండాలి. నిబంధనల మేరకు ప్రవాస భారతీయులకు కొన్ని సీట్లు కేటాయిస్తారు.
✦ ఇంజనీరింగ్, ఫార్మసీ అభ్యర్థుల వయసు 2020 డిసెంబర్ 31 నాటికి 16 ఏళ్లు నిండి ఉండాలి. బీటెక్ డెయిరీ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సులు చదివేందుకు 17 ఏళ్లు పూర్తవ్వాలి. గరిష్టంగా 22 ఏళ్ల వయసు మించరాదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితి 25 ఏళ్లు.

**అగ్రికల్చరల్/మెడికల్ విభాగం అర్హతలు**

✦ **బీఎస్సీ అగ్రికల్చర్ /హార్టికల్చర్:** ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్/నేచురల్ సైన్స్, అగ్రికల్చరల్, వొకేషనల్ ఇన్ అగ్రికల్చరల్.. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులను ఇంటర్/10+2 స్థాయిలో చదివి ఉండాలి.
✦ **బీవీఎస్సీ:** ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ లేదా నేచురల్ సైన్స్, ఒకేషనల్ కోర్సెస్ ఇన్ వెటర్నరీ సైన్స్. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు ఇంటర్/10+2 స్థాయిలో చదివి ఉండాలి.
✦ **బీఎఫ్ఎస్సీ:** ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్/నేచురల్ సైన్స్, ఒకేషనల్ కోర్సెస్ ఇన్ ఫిషరీ సైన్స్. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు ఇంటర్/10+2 స్థాయిలో చదివి ఉండాలి.
✦ **బీటెక్ (ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ):** మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ లేదా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్/నేచురల్ సైన్స్ చదివి ఉండాలి. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు ఇంటర్/10+2 స్థాయిలో చదివి ఉండాలి.
✦ **బీఫార్మసీ, ఫార్మ్–డి:** మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ లేదా ఫిజికల్ సైన్స్, బయోలాజికల్/నేచురల్ సైన్స్ చదివి ఉండాలి. వీటిల్లో ఏవైనా రెండు/మూడు సబ్జెక్టులు ఇంటర్/10+2 స్థాయిలో చదివి ఉండాలి.
✦ 17ఏళ్లు వయసు నిండి, 22 ఏళ్లు దాటరాదు, ఎస్సీ/ఎస్టీలకు 25 ఏళ్లు మించరాదు.

**పరీక్ష విధానం**

ఎంసెట్ పరీక్ష కాలవ్యవధి 3 గంటలు. ఇంజనీరింగ్‌కు సంబంధించి మొత్తం 160 ప్రశ్నల్లో(ఆబ్జెక్టివ్ విధానం) 80 ప్రశ్నలు–80 మార్కులు మ్యాథమెటిక్స్ నుంచి; ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 40 ప్రశ్నలు–40 మార్కుల చొప్పున అడుగుతారు. అలాగే అగ్రికల్చర్, మెడికల్ విభాగంలో.. బయాలజీ 80 ప్రశ్నలు–80 మార్కులు(బోటనీ 40, జువాలజీ 40); ఫిజిక్స్‌లో 40ప్రశ్నలు–40 మార్కులు; కెమిస్ట్రీ 40 ప్రశ్నలు–40 మార్కుల చొప్పున ఉంటాయి. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) నిర్వహిస్తారు. ప్రశ్నలు ఇంగ్లిష్, తెలుగు లేదా ఇంగ్లిష్, ఉర్దూలో ఉంటాయి.

**ర్యాంకింగ్ ఇలా**

✦ ఎంసెట్ ర్యాంక్‌తోపాటు ఇంటర్మీడియెట్ మార్కుల ఆధారంగా తుది ర్యాంక్ ప్రకటిస్తారు. ఇందులో ఎంసెట్‌కు 75శాతం, ఇంటర్‌లో ఎంపీసీ/బైపీసీ ప్రధాన సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులకు 25శాతం వెయిటేజీ ఇచ్చి తుది ర్యాంకను నిర్ణయిస్తారు.
✦ ఎంసెట్ ఎంట్రన్స్‌లో మొత్తం మార్కుల్లో కనీసం 25శాతం సాధిస్తేనే క్వాలిఫయింగ్‌గా పరిగణిస్తారు. అయితే, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కుల నిబంధన లేదు.

**దరఖాస్తు ఫీజు: రూ.500**

✦ అర్హతగల అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫీజును ఏపీ ఆన్‌లైన్/టీఎస్ ఆన్‌లైన్/క్రెడిట్/ డెబిట్ కార్డుల తో పాటు నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చు.

**పరీక్షల షెడ్యూల్**

✦ **ఇంజనీరింగ్ పరీక్ష:** ఏప్రిల్ 20, 21, 22, 23 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలకు వరకు ఉంటుంది.
✦ **అగ్రికల్చర్, మెడికల్ పరీక్ష:** ఏప్రిల్ 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు.. మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటలకు వరకు ఉంటుంది.
✦ ఏపీ ఎంసెట్ (రెండు విభాగాలు) ఏప్రిల్ 22, 23 తేదీల్లో..

**ముఖ్య సమాచారం**

✦ **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
✦ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 29–03–2020
✦ **ఏప్రిల్ 5 వరకు:** ఆలస్య రుసుం రూ.500
✦ **ఏప్రిల్ 10 వరకు:** ఆలస్య రుసుం రూ.1000
✦ **ఏప్రిల్ 15 వరకు:** రూ.5000
✦ **ఏప్రిల్ 19 వరకు:** రూ.10,000
✦ **హాల్‌టికెట్ల జారీ:** ఏప్రిల్ 16 నుంచి ప్రారంభం
✦ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://sche.ap.gov.in/eamcet

సాక్షి స్పోర్ట్స్
గురువారం 19-3-2020

# ‘నా కెప్టెన్సీ ప్రతిష్ట దిగజారిన క్షణమది’

### మంకీ గేట్ ఉదంతంపై పాంటింగ్ వ్యాఖ్య



**మెల్‌బోర్న్:** భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన 2007–08 టెస్టు సిరీస్ అత్యంత వివాదాస్పదంగా నిలిచింది. సిడ్నీ టెస్టులో భారత స్పిన్నర్ హర్భజన్ సింగ్, ఆసీస్ ఆల్‌రౌండర్ ఆండ్రూ సైమండ్స్ మధ్య గొడవ ముదరడం, భజ్జీపై సస్పెన్షన్ విధించడం, చివరకు సుదీర్ఘ విచారణ, దానిపై భారత్ సిరీస్‌ను రద్దు చేసుకునే వరకు పరిస్థితి వెళ్లింది. హర్భజన్ తనను మంకీ అన్నాడనేది సైమండ్స్ ప్రధాన ఆరోపణ. చివరకు క్రికెట్ ప్రపంచం ఈ ఉదంతానికి ‘మంకీ గేట్’గా పేరు పెట్టింది. ఆ సమయంలో ఆస్ట్రేలియా కెప్టెన్‌గా రికీ పాంటింగ్ ఉన్నాడు. ఆసీస్ సిరీస్ గెలుచుకున్నా... తాజా వివాదం పాంటింగ్‌ను వెంటాడింది. అతని వ్యవహారశైలిపై తీవ్ర విమర్శలు రేగేలా చేసింది. దీనిని ఇప్పుడు పాంటింగ్ మరోసారి గుర్తు చేసుకున్నాడు. అది తన కెప్టెన్సీకి మాయని మచ్చగా మిగిలిపోయిందని అతను చెప్పుకున్నాడు. ‘మంకీ గేట్ నా నాయకత్వంలో అత్యంత అధమ క్షణం. పూర్తిగా నా కెప్టెన్సీ పేరుప్రతిష్టలు పాతాళానికి దిగజారిపోయాయి. అయితే ఆ సమయంలో ఏదీ నా అదుపులో లేకుండా పోయింది. ఆ వివాదం సుదీర్ఘ కాలం సాగడం కూడా నన్ను బాగా ఇబ్బంది పెట్టింది. అడిలైడ్‌లో జరిగిన సిరీస్ చివరి టెస్టు తర్వాత కూడా దాని గురించే నేను మాట్లాడాల్సి రావడం నాకింకా గుర్తుంది. ఈ ఘటన మానసికంగా తీవ్ర సమస్యగా మారిపోయింది. పెర్త్‌లో జరిగిన తర్వాతి టెస్టులో ఇది కనిపించింది. మేం కచ్చితంగా గెలుస్తామని భావించిన మ్యాచ్‌లో ఓడిపోయాం. తర్వాతి రోజుల్లో పరిస్థితులు మరింత దిగజారాయి’ అని పాంటింగ్ వ్యాఖ్యానించాడు.

# బంగర్‌కు బంగ్లా ఆఫర్!

### తిరస్కరించిన భారత మాజీ క్రికెటర్

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ జట్టు తమ టెస్టు జట్టు బ్యాటింగ్ కన్సల్టెంట్‌గా పని చేయాలంటూ చేసిన ప్రతిపాదనను భారత మాజీ ఆటగాడు సంజయ్ బంగర్ తిరస్కరించాడు. ముందే కుదుర్చుకున్న ప్రొఫెషనల్ ఒప్పందాలతో పాటు వ్యక్తిగత అంశాలు కూడా ఇందుకు కారణమని అతను చెప్పాడు. 12 టెస్టులు, 15 వన్డేలు ఆడిన బంగర్ భారత జట్టు బ్యాటింగ్ కోచ్‌గా ఐదేళ్ల పాటు అద్భుతమైన ఫలితాలు సాధించాడు. టీమిండియా బ్యాట్స్‌మెన్ లోపాలను సరిదిద్ది వారిని అత్యుత్తమంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించాడు. తమ టెస్టు జట్టును పటిష్టపర్చేందుకు బంగ్లాదేశ్ బంగర్ సేవలను కోరింది. అయితే ప్రస్తుతం కామెంటేటర్‌గా వ్యవహరిస్తున్న అతను తన వల్ల కాదని చెప్పాడు.

# ఇక కౌంటీ క్రికెట్‌లో...

**కరోనా నేపథ్యంలో భారత క్రికెటర్లంతా చాలా వరకు తమ ఇళ్లకే పరిమితమయ్యారు. అయితే టెస్టు జట్టు సభ్యుడు, ఆంధ్ర కెప్టెన్ గాదె హనుమ విహారి మాత్రం తన ఆటకు మరింత పదును పెట్టుకునే పనిలో పడ్డాడు. తమిళనాడు క్రికెట్ అసోసియేషన్ (టీఎన్‌సీఏ) నిర్వహిస్తున్న రాజా ఆఫ్ పాలయంపట్టి (ఫస్ట్ డివిజన్) టోర్నీలో అతను పాల్గొన్నాడు. తాను ఉద్యోగిగా పని చేస్తున్న నెల్సన్ ఎస్‌సీ జట్టుకు అతను ప్రాతినిధ్యం వహించాడు. బుధవారం చెన్నైలో ఆళ్వార్‌పేట్ సీసీతో జరిగిన మ్యాచ్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన విహారి 285 బంతుల్లో 25 ఫోర్లు, 3 సిక్సర్లతో 202 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విపత్కర స్థితిలోనూ క్రికెట్‌పై అతనికి ఉన్న నిబద్ధతను ఇది చూపిస్తోంది. ఇక ముందూ దీనినే కొనసాగించాలని విహారి భావిస్తున్నాడు.**



**హైదరాబాద్:** భారత క్రికెటర్లు కౌంటీల్లో ఆడటం దశాబ్దాలుగా సాగుతోంది. నాటి సునీల్ గావస్కర్‌నుంచి నేటి విరాట్ కోహ్లి వరకు చాలా మంది ఏదో ఒక సందర్భంలో కౌంటీ క్రికెట్ ఆడినవారే. ఇంగ్లండ్‌లోని ప్రతికూల పరిస్థితుల్లో ఆడి తమ ఆటను తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రయత్నం కొందరిదైతే... భారత జట్టుకు మ్యాచ్‌లు లేని ఆఫ్ సీజన్ వేసవిలో (ఐపీఎల్‌కు ముందు రోజుల్లో) కౌంటీల్లో మరికొందరు బిజీగా కనిపించేవారు. ఇప్పుడు ఈ జాబితాలో భారత టెస్టు బ్యాట్స్‌మన్, ఆంధ్ర జట్టు కెప్టెన్ హనుమ విహారి చేరుతున్నాడు. కౌంటీల్లో ఆడేందుకు అతను ఇప్పటికే ఒక జట్టుతో దాదాపుగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే కరోనా వైరస్ కారణంగా అతను ఇంగ్లండ్ వెళ్లడం ఆలస్యమైంది. ‘ఈ సీజన్‌లో నేను నాలుగు కౌంటీ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఒక జట్టుతో ఒప్పందం దాదాపుగా ఖరారైంది. ఏ జట్టుకు ఆడబోతున్నానో పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తా. ప్రస్తుతం కరోనా కారణంగానే అన్ని నిలిపివేయాల్సి వచ్చింది. పరిస్థితులు మెరుగు పడిన తర్వాత నేను ఆడగలనని నమ్ముతున్నా. కౌంటీల్లో ఆడటం నాకు ఎంతో నేర్చుకునే అవకాశం ఇస్తుంది’ అని విహారి అన్నాడు. తమిళనాడు లీగ్‌లో ఆడటం ద్వారా తన మ్యాచ్ ప్రాక్టీస్ కొనసాగించినట్లు అతను చెప్పాడు.

> ఒప్పందం దాదాపుగా ఖరారు
>
> భారత క్రికెటర్ హనుమ విహారి వెల్లడి
>
> జట్టును గెలిపించేదే అత్యుత్తమ ఇన్నింగ్స్ అన్న ఆంధ్ర బ్యాట్స్‌మెన్

9 టెస్టుల కెరీర్‌లో ఒక మ్యాచ్ మినహా (వైజాగ్‌లో దక్షిణాఫ్రికాపై) అతను 8 టెస్టులు విదేశాల్లోనే ఆడాడు. ‘నా బ్యాటింగ్‌పై నాకు విశ్వాసముంది. టీమ్ మేనేజ్‌మెంట్ కూడా విదేశాల్లో రాణించే టెక్నిక్ నాకు ఉందని నమ్మతోంది. అందుకే ఈ అవకాశాలు వచ్చాయి. ఇంగ్లండ్ అయినా, న్యూజిలాండ్ లేదా వెస్టిండీస్ అయినా పరిస్థితులకు అనుగుణంగా మన ఆటను మార్చుకోవడం ముఖ్యం. జట్టు నాకు ఎలాంటి బాధ్యత అప్పగించినా నెరవేర్చగలనని ఆత్మవిశ్వాసం నాకుంది’ అని ఈ ఆంధ్ర క్రికెటర్ వ్యాఖ్యానించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టెస్టులో విహారి చక్కటి ప్రదర్శన కనబర్చాడు. హాగ్లీ ఓవల్ మైదానంలో బౌలింగ్‌కు బాగా అనుకూలించిన పిచ్‌పై 70 బంతుల్లో 55 పరుగులు సాధించాడు. అయితే ఇది తన అత్యుత్తమ ప్రదర్శనగా భావించడం లేదని విహారి విశ్లేషించాడు. ‘దీనిని నేను గొప్పగా చూడటం లేదు. నేను బాగానే ఆడాననేది వాస్తవం. అయితే అది జట్టును గెలిపించలేకపోయింది. కఠిన పరిస్థితుల్లో పరుగులు సాధించడం మంచిదే కానీ జట్టుకు విజయం లభించినప్పుడే దాని విలువ పెరుగుతుంది’ అని విహారి అభిప్రాయ పడ్డాడు. ఈ సీజన్ చివర్లో భారత జట్టు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లతో మొత్తం తొమ్మిది టెస్టులు ఆడబోతోంది. ‘సొంతగడ్డపై కూడా నాకు మరిన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం రావడం ఖాయం. సాధన చేయడం, ఎలాంటి అవకాశాన్నైనా అందుకునేందుకు సిద్ధంగా ఉండటమే నా పని’ అని హనుమ స్పష్టం చేశాడు. కరోనా విరామంతో ఇకపై ఇంటికే పరిమితం అవుతుండటంతో భారత జట్టు స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ కోచ్ నిక్ వెబ్ ఇచ్చిన వ్యక్తిగత ట్రైనింగ్ చార్ట్‌ను పాటించి ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటానని అతను వెల్లడించాడు.



# ఐఓసీ ప్రకటన బాధ్యతారాహిత్యం!

### కమిటీ సభ్యురాలి బహిరంగ విమర్శ



**మాంట్రియల్:** యావత్ ప్రపంచాన్ని ‘కరోనా’ వణికిస్తున్న తరుణంలో టోక్యో ఒలింపిక్స్ జరిపి తీరాలన్న ప్రణాళిక పూర్తిగా బాధ్యతారాహిత్యమని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలు ఒకరు మండిపడ్డారు. కెనడాకు చెందిన హేలీ వికెన్‌హెజర్ మాజీ ఐస్ హాకీ క్రీడాకారిణి. ఆమె 2002 నుంచి 2016 వరకు జరిగిన నాలుగు ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన కెనడా ప్లేయర్. 41 ఏళ్ల హేలీ ఇప్పుడు ఐఓసీ అథ్లెట్స్ కమిషన్ సభ్యురాలు. మంగళవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఇప్పుడప్పుడే ఏ నిర్ణయం తీసుకోమని, క్రీడల నిర్వహణకే అడుగులు వేస్తామని ఐఓసీ ప్రకటించింది. హేలీ ట్విట్టర్ వేదికగా ఐఓసీ నిర్ణయాన్ని తప్పుబట్టింది. ‘ప్రస్తుత సంక్షోభం ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ కంటే పెద్దది. మరో 24 గంటల్లో ఏం జరుగుతుందో... ఎన్ని కరోనా కేసులు బయటపడతాయో... ఎంతమంది చస్తారో తెలియని దుస్థితిలో ఉన్నాం. ఇంకో 3 నెలల్లో ఏమైనా జరగొచ్చు. ఇప్పటికే ఈ మహమ్మారి వల్ల క్రీడాకారుల సన్నాహకాలు ఆగిపోయాయి. అర్హత పోటీలన్నీ వాయిదా పడ్డాయి. ఓ అథ్లెట్‌గా ప్రస్తుత పరిస్థితి నాకు బాగా అర్థమవుతోంది. ఈ హృదయ విదారక విషాదంలో అథ్లెట్లంతా ఆందోళనతో ఉన్నారు. అలాంటపుడు మనసును ఆటలపై ఎలా కేంద్రీకరించగలరు’ అని తీవ్రస్థాయిలో ట్వీట్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి నెలకొందని, అలాగే ఆటగాళ్ల పరిస్థితి ఉందని, ఎక్కడికక్కడ అన్నీ మూతపడ్డాయని, సామాజిక జీవనమే స్తంభించిపోయిన ఈ స్థితిలో అథ్లెట్లు మాత్రం ఏం చేస్తారని ఆమె ప్రశ్నించింది. ‘క్రీడాకారులు శిక్షణ తీసుకునే పరిస్థితి లేదు. ప్రయాణ సదుపాయాలు లేవు. స్పాన్సర్లు, మార్కెటింగ్ వ్యవస్థలేవీ నడవట్లేదు. ఒకవేళ క్రీడల్ని నిర్వహిస్తే మాత్రం దీని వల్ల ఆటగాళ్లకే కాదు... ప్రపంచానికే తీరని అన్యాయం జరుగుతుంది’ అని హేలీ ట్విట్టర్‌లో పేర్కొంది.

# మా జీవితాలతో ఆడుకుంటారా!



**లూసానే:** టోక్యో ఒలింపిక్స్‌పై అనుమానాలే కాదు కస్సుబుస్సు కూడా పెరిగిపోతోంది. ఎలాగైనా జరిపి తీరుతామనే ఐఓసీ నిర్ణయాన్ని మేటి అథ్లెట్లు వ్యతిరేకిస్తున్నారు. మరో వైపు తమకు వేరే ప్రత్యామ్నాయమే కనిపించట్లేదని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) తెలిపింది. ‘ఇది అసాధారణ పరిస్థితి. అందుకే దీనికి అసాధారణ పరిష్కారం కనుగొనాలి’ అని ఐఓసీ ప్రతినిధి అన్నారు. మరో వైపు కొందరు మేటి అథ్లెట్లు ఒలింపిక్స్ కోసం తమ ప్రాణాలనే పణంగా పెట్టాలా అని విమర్శించడంతో ఐఓసీ స్పందించింది. ‘ఒలింపిక్స్ కమిటీ కూడా సరైనా ప్రత్యామ్నాయం కోసం అన్వేషిస్తుంది. అథ్లెట్ల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తుంది’ అని ఐఓసీ ప్రతినిధి చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో అలాంటి ప్రత్యామ్నాయమే కనపడట్లేదని, ఈ విపత్కర సమస్య నుంచి బయటపడే పరిష్కారం కూడా దొరకట్లేదని... అందుకే ఆందోళన చెందుతున్నామని ఒలింపిక్ పోల్ వాల్ట్ చాంపియన్ కటేరినా స్టెఫానిడి (గ్రీస్) పేర్కొంది. ‘ఐఓసీ మా ప్రాణాలకే ముప్పు తెచ్చేలా ప్రవర్తిస్తోంది. ఒలింపిక్స్ కోసం శిక్షణలో తలమునకలైతే రోజూ కలిసుండే సిబ్బందితో పాటు కుటుంబసభ్యులు, తోటి ప్రజల ఆరోగ్యంపై ఇది పెను ప్రభావం చూపుతుంది. ఇంకా చెప్పాలంటే ఐఓసీ మమ్మల్ని ప్రమాదంలోకి నెడుతోంది’ అని ఆమె తీవ్రస్థాయిలో ఐఓసీపై ధ్వజమెత్తింది.

# ‘చెస్’ ఆగిపోలేదు!

**మాస్కో:** విపత్కర పరిస్థితుల్లోనూ చెస్ మాత్రం ఆగకుండా దూసుకెళుతోంది. 8 మంది ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్లు మాత్రమే ఆడే ‘ది 2020 క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్’ రష్యాలో జరుగుతోంది. ఇది ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే)తో తలపడేందుకు క్వాలిఫయింగ్ టోర్నీ. ప్రేక్షకులను దగ్గరనుంచి చూసేందుకు అనుమతించకుండా దీనిని నిర్వహిస్తున్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా వీక్షణకు మాత్రం ఢోకా రాలేదు. దీన్ని డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. కొన్ని రోజుల తరబడి కరోనా న్యూస్, న్యూసెన్స్‌తో విసుగెత్తిపోయేవారు క్యాండిడేట్స్ చెస్ చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. చిత్రంగా కరోనాకు పుట్టిల్లయిన చైనా ఆ వైరస్‌కు విలవిలలాడుతుండగా... అత్యధికంగా క్యాండిడేట్స్ చెస్ చూసేవాళ్లు కూడా చైనా వాళ్లే కావడం విశేషం. ఏకంగా 10 లక్షల మంది చైనీయులు యూ ట్యూబ్‌లో గత మూడు రోజులుగా చెస్ పోటీలను తిలకిస్తున్నట్లు ‘ఫిడే’ ప్రకటించింది.

# ఫ్రాన్స్ ఫుట్‌బాల్ జట్టు సభ్యుడికి కరోనా



**రోమ్:** 2018 సాకర్ ప్రపంచకప్ గెలుచుకున్న ఫ్రాన్స్ జట్టు సభ్యుడు బ్లైసీ మటుడి కరోనా (కోవిడ్–19) బారిన పడ్డాడు. ఈ విషయాన్ని అతడి క్లబ్ అయిన యువెంటాస్ వెల్లడించింది. దాంతో కరోనా సోకిన రెండో యువెంటాస్ జట్టు సభ్యుడిగా బ్లైసీ నిలిచాడు. ఇప్పటికే సహచరుడు డానిలె రుగాని గత బుధవారం కరోనా పాజిటివ్‌గా తేలడంతో... ఇతర జట్టు సభ్యులు స్వీయ నిర్బంధంలోకి వెళ్లాల్సిందిగా యువెంటాస్ ఆదేశించింది. యువెంటాస్ ఇటలీ లీగ్ అయిన సెరీ–‘ఎ’ జట్టు. ఇదే లీగ్‌కు చెందిన హెలాస్ వెరోనా టీం సభ్యుడు మట్టియా జకాగ్నికి కూడా కరోనా ఉన్నట్లు తేలింది. దాంతో సెరీ–‘ఎ’ లీగ్‌లో ఆడే 13 మందికి కరోనా సోకినట్టైయింది. విఖ్యాత సాకర్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో యువెంటాస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న నేపథ్యంలో అతను కూడా ప్రస్తుతం స్వీయ నిర్బంధంలో ఉన్నాడు.

## వారికి డబ్బే ప్రధానం: సైనా

**న్యూఢిల్లీ:** కరోనా తీవ్రత పెరుగుతున్నప్పటికీ ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ నిర్వహించడంపై భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ సైనా నెహ్వాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ టోర్నీలో ఆడిన సైనా తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. నిర్వాహకులకు క్రీడాకారుల ఆరోగ్యంకంటే డబ్బే ప్రధానంగా మారిందని ఆమె విమర్శించింది. డెన్మార్క్ షట్లర్ కాన్రాడ్ పీటర్సన్ చేసిన విమర్శకు ఆమె మద్దతు పలికింది. ‘నేను దీనికి సంబంధించి ఒకే ఒక విషయం చెప్పగలను. ఆటగాళ్ల ఆరోగ్యం, వారి బాధకంటే ఆర్థికపరమైన అంశాలే దీనికి కారణం. లేదంటే ఆల్ ఇంగ్లండ్ టోర్నీ నిర్వహించడానికి మరే కారణం లేదు’ అని సైనా ట్వీట్ చేసింది.

# వింబుల్డన్ షెడ్యూల్ ప్రకారమే!

### తేదీలు మార్చరాదని భావిస్తున్న నిర్వాహకులు

**లండన్:** కరోనాతో పరిస్థితులు ప్రతికూలంగా మారుతున్నా... 143 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక గ్రాస్ కోర్టు గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌ను మాత్రం అనుకున్న తేదీల్లోనే నిర్వహించాలనే ఉద్దేశంలో నిర్వాహకులు ఉన్నట్లు తెలుస్తుంది. అయితే టోర్నీ ఆరంభమయ్యే జూన్ సమయానికి కరోనా అదుపులోకి వచ్చే అవకాశం ఉందని ఆల్ ఇంగ్లండ్ క్లబ్ అధికారులు విశ్వసిస్తున్నారు. ఒకవేళ టోర్నీ ఆరంభమయ్యే సమయానికి కరోనా తీవ్రత తగ్గకపోతే మాత్రమే టోర్నీని వాయిదా వేయడమో లేక రద్దు చేయడమో చేస్తామని ఆల్ ఇంగ్లండ్ లాన్ టెన్నిస్, క్రోకెట్ క్లబ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రిచర్డ్ లూయిస్ పేర్కొన్నాడు. ఈ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్ జూన్ 29 నుంచి జులై 12 వరకు జరగాల్సి ఉంది.

**యూఎస్ ఓపెన్ వాయిదా!**

**న్యూయార్క్:** కరోనా దెబ్బకు ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌ను సెప్టెంబర్‌కు వాయిదా వేస్తున్నామంటూ ఫ్రెంచ్ టెన్నిస్ సమాఖ్య మంగళవారం ప్రకటించగా... ప్రస్తుతం ఏడాది చివరి గ్రాండ్‌స్లామ్ అయిన యూఎస్ ఓపెన్ కూడా వాయిదా పడేట్లు ఉంది. యూఎస్ ఓపెన్ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 13 వరకు జరగాల్సి ఉంది. ఒకవేళ ఆ సమయానికి కరోనా తగ్గుముఖం పట్టినా యూఎస్ ఓపెన్ అనుకున్న తేదీల్లోనే జరుగుతుందా అనేది అనుమానమే... దానికి కారణం ఫ్రెంచ్ ఓపెన్ వాయిదా. మేలో ఆరంభం కావల్సిన ఫ్రెంచ్ ఓపెన్‌ను నిర్వాహకులు సెప్టెంబర్ 20కు వాయిదా వేశారు. దాంతో ఈ రెండు టోర్నీల మధ్య విరామం ఒక వారం మాత్రమే ఉంటుంది. దాంతో ఆటగాళ్లపై తీవ్ర ఒత్తిడి పడే అవకాశం ఉంటుంది.

# హాలెప్ సాయం



**న్యూఢిల్లీ:** రొమేనియా స్టార్, మాజీ వింబుల్డన్ చాంపియన్ సిమోనా హాలెప్ తన దేశంలో కరోనా కట్టడి కోసం ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చింది. ‘ఈ క్లిష్ట సమయంలో మా వైద్య సిబ్బంది చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నా. నేను కూడా నా వంతు సాయం చేయాలని నిర్ణయించుకున్నా. కరోనా కట్టడికి అవసరమైన వైద్య సామాగ్రిని విరాళంగా ఇవ్వాలనుకుంటున్నా’ అని ఆమె ట్వీట్ చేశారు. మన తోటివారికోసం మనం పెద్ద మనసు చాటే సమయం ఇదేనని, బాధ్యతతో మెలుగుదాం ఉదారత చాటుదాం అని ఆమె ఫేస్‌బుక్‌లో వీడియో సందేశం కూడా ఇచ్చింది.

# విదేశీ కోచ్‌లకు జవాబుదారీతనం ఉండాలి

### కోచ్ విమల్ కుమార్ సూచన



**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక ఒలింపిక్స్ ముందు భారత బ్యాడ్మింటన్ డబుల్స్ విదేశీ కోచ్ ఫ్లాండీ లింపెలె (ఇండోనేసియా) తన పదవికి రాజీనామా చేయడం పట్ల భారత మాజీ బ్యాడ్మింటన్ కోచ్ విమల్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారీ మొత్తం చెల్లించి వారిని తీసుకుంటే బాధ్యతారాహిత్యంగా కీలక టోర్నీల ముందు చేతులెత్తేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశీ కోచ్‌లకు కచ్చితంగా జవాబుదారీతనం ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ‘ఫ్లాండీ వెళ్లిన తీరు అనైతికం, దురదృష్టకరం. భారత డబుల్స్ జోడీ దాదాపుగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. డబుల్స్‌లో మనకు మంచి ఫలితాలు రానున్న ఈ తరుణంలో ఆయన పదవీ కాలాన్ని ముగించకుండానే అర్ధాంతరంగా వెళ్లిపోవడం నిరాశ కలిగించింది. జనవరిలో నేను ఫ్లాండీతో చాలాసేపు చర్చించాను. ఆయన మన ఆటగాళ్ల గురించి మాట్లాడారు. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి సరిదిద్దుతానన్నారు. కానీ ఇలా ఆల్ ఇంగ్లండ్ టోర్నీకి ముందే మధ్యలోనే వెళ్లిపోయారు. ఇది సరి కాదు’ అని భారత్ బ్యాడ్మింటన్‌కు 2003 నుంచి 2006 వరకు చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన విమల్ అసహనం వ్యక్తం చేశారు. గతేడాది మార్చిలో డబుల్స్ కోచ్‌గా నియమితులైన లింపెలె... కుటుంబ కారణాలను చూపిస్తూ పదవీకాలం ముగియకుండానే భారత కోచ్ పదవికి రాజీనామా చేశారు. ఇలా చేసిన నాలుగో విదేశీ కోచ్ లింపెలె. అతని కన్నా ముందు పీవీ సింధు ప్రపంచ చాంపియన్‌గా మారడంలో కీలక పాత్ర పోషించిన కొరియా కోచ్ కిమ్ జీ హ్యూన్, ఇండోనేసియా కోచ్ ముల్యో హండాయో, మలేసియా కోచ్ టాన్ కిమ్ పలు కారణాలతో ఇలాగే పదవీ కాలం ముగియకుండానే వెళ్లిపోయారు. ప్రతీసారి ఇలాగే జరుగుతుండటంతో విదేశీ కోచ్‌లను నియమించే సమయంలోనే కఠిన నిబంధనలు విధించాలని విమల్ కుమార్ అభిప్రాయపడ్డారు. ‘కోచ్‌లకు జవాబుదారీతనం ఉండేలా నిబంధనలు రూపొందించాలి. వారికి నిర్దేశించిన పనికి, వ్యక్తులకు వారే బాధ్యులుగా ఉండేలా ఫలితాలు రాబట్టేలా కాంట్రాక్టులోనే నియమాలు పొందుపరచాలి. విదేశీ కోచ్‌లకు చాలా పెద్ద మొత్తం ఇస్తున్నాం. ఇలా చెప్పాపెట్టకుండా వెళ్లిపోకూడదు’ అని విమల్ అన్నారు. ఇప్పటివరకు భారత్ నుంచి సింగిల్స్‌లో సింధు, సాయి ప్రణీత్‌తో పాటు డబుల్స్‌లో చిరాగ్ శెట్టి–సాత్విక్ సాయిరాజ్ జోడీ మాత్రమే ప్రస్తుతానికి ఒలింపిక్స్‌కు అర్హత సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అరుదైన అవకాశం

### ‘ఐసీసీ డెవలప్‌మెంట్ అంపైర్స్ ప్యానెల్’లో జనని, వృందాలకు చోటు


వృంద జనని

**సాక్షి, హైదరాబాద్:** క్రికెట్‌లో అరుదుగా కనిపించే వ్యక్తులు మహిళా అంపైర్లు. మహిళలు జాతీయ స్థాయి మ్యాచ్‌లకు అంపైర్లుగా వ్యవహరించడమే గగనంగా కనిపించే ఈ రోజుల్లో... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) డెవలప్‌మెంట్ అంపైర్స్ ప్యానెల్‌లో భారత మహిళా అంపైర్లు తమ సంఖ్య పెంచుకుంటున్నారు. ఇప్పటికే తెలుగు మహిళ జీఎస్ లక్ష్మి మ్యాచ్ ఐసీసీ రిఫరీస్ ప్యానల్‌లో చోటు దక్కించుకోగా... తాజాగా ఈ జాబితాలో మరో ఇద్దరు చేరారు. చెన్నైకి చెందిన జననీ నారాయణ్, నవీ ముంబైకి చెందిన వృందా రాఠి ‘ఐసీసీ డెవలప్‌మెంట్ అంపైర్స్’ అంతర్జాతీయ ప్యానల్‌కు ఎంపికైనట్లు బీసీసీఐ బుధవారం ప్రకటించింది. దీంతో ఈ ప్యానల్‌లో భారత మహిళా అధికారుల సంఖ్య మూడుకు చేరింది. ఈ డెవలప్‌మెంట్ అంపైర్స్ ప్యానల్ అనేది పలు రీజియన్లకు చెందిన అత్యుత్తమ అంపైర్లు, రిఫరీలను ఎంపిక చేసి అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు ఉపయోగపడుతుంది. అత్యంత కఠినంగా ఉండే బీసీసీఐ లెవల్–2 అంపైరింగ్ పరీక్షను పాసైన మహిళా అధికారులుగా గతంలోనే గుర్తింపు తెచ్చుకొని.... ప్రస్తుతం అత్యున్నత స్థాయి అంపైరింగ్ ప్యానల్‌లో చోటు దక్కించుకున్న జనని, వృందా గురించి చూస్తే...

**జననీ నారాయణ్:** 34 ఏళ్ల జనని 2018 నుంచి దేశవాళీ టోర్నీలకు అంపైర్‌గా వ్యవహరిస్తోంది. క్రికెట్ వీరాభిమాని అయిన జనని ఇంగ్లండ్ అంపైర్ డేవిడ్ షెఫర్డ్, ఎస్. వెంకటరాఘవన్ (భారత్)లను ఆదర్శంగా తీసుకుంది. 2015లోనే తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) నిర్వహించే పరీక్షలో ఉత్తీర్ణత సాధించి లోకల్ డివిజన్ మ్యాచ్‌లకు అధికారిగా వ్యవహరించింది. ఎంసీసీ నిబంధనలపై మంచి పట్టు ఉన్న ఆమె... ఎంతో కష్టపడి బీసీసీఐ లెవల్–1 కోర్సును కూడా పూర్తిచేసింది. తర్వాత థియరీ, ప్రాక్టికల్స్‌తో కూడిన కఠినమైన లెవల్–2 పరీక్షలోనూ మెరుగ్గా రాణించి.. జాతీయ, అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించింది.

**వృందా రాఠీ:** మాజీ క్రికెటర్, స్కోరర్ అయిన వృందాకు క్రికెట్‌తో మంచి అనుబంధముంది. స్వతహాగా మీడియం పేసర్ అయిన వృందా కాలేజీ స్థాయిలో 2007 నుంచి వరుసగా నాలుగేళ్ల పాటు ముంబై యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహించింది. 2008–09 ఆలిండియా చాంపియన్‌గా నిలిచిన ముంబై యూనివర్సిటీ జట్టులో ఆమె సభ్యురాలు కూడా. అదే ఏడాది నుంచి బీసీసీఐ స్కోరర్‌గా కెరీర్ ప్రారంభించిన వృందా... 2013 మహిళల ప్రపంచ కప్‌లోనూ ఆమె స్కోరర్‌గా పనిచేసింది. న్యూజిలాండ్ అంపైర్ క్యాతీ క్రాస్‌ను చూసి స్ఫూర్తి పొంది అంపైరింగ్ వైపు మొగ్గు చూపింది. 2014లో రాష్ట్ర స్థాయిలో అంపైరింగ్ పరీక్ష పాసైన వృందా వివిధ స్థాయి టోర్నీల్లో 150 మ్యాచ్‌లకు అంపైర్‌గా వ్యవహరించింది. తర్వాత 2016లో బీసీసీఐ లెవల్–1 పరీక్షలో 94 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి 2017లో లెవల్–1 కోర్సును పూర్తిచేసింది. 2018లో లెవల్–2ను ముగించి ‘బీసీసీఐ దేశవాళీ అంపైర్ల ప్యానల్’లో చోటు దక్కించుకుంది.

సాక్షి బిజినెస్
గురువారం
19-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 1,710 ▼ | 498 ▼ |
| 28,870 | 8,469 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (తొలి రెండు 11.30గంటలకు)

| | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 6,730 | ▼ 606 |
| డోజోన్స్ | 19,233 | ▼ 2,004 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 5,081 | ▼ 214 |
| డాక్స్ | 8,442 | ▼ 497 |
| షాంఘై | 2,729 | ▼ 51 |
| నికాయ్ | 16,727 | ▼ 285 |

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|
| $ యూఎస్ డాలర్ | ఎస్‌బిఐ | 73.25 | 74.90 |
| £ బ్రిటన్ పౌండ్ | ఎస్‌బిఐ | 88.27 | 91.38 |
| € యూరో | ఎస్‌బిఐ | 80.17 | 83.10 |
| ¥ జపాన్ ఎన్ (100) | ఎస్‌బిఐ | 67.87 | 70.39 |
| AUS ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బిఐ | 43.58 | 45.65 |
| S$ సింగపూర్ డాలర్ | ఎస్‌బిఐ | 51.01 | 52.75 |
| SAR సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.76 | 20.62 |
| UAE D యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.89 | 21.12 |
| ¥ చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.44 | 11.21 |

# మాంద్యం కోరల్లో!

## ప్రపంచ మార్కెట్లలో ఆగని అమ్మకాల సునామీ

- 1,710 పాయింట్లు పతనమైన సెన్సెక్స్ • 28,870 వద్ద ముగింపు • నిఫ్టీ 498 పాయింట్లు డౌన్
- 8,469 వద్ద క్లోజ్ • మూడు రోజుల్లో 15.72 లక్షల కోట్లు ఆవిరి
- కరోనాకుతోడైన టెలికం ఏజీఆర్ అంశం • బ్యాంకు స్టాక్స్‌కు భారీ నష్టాలు



**ముంబై:** కరోనా వల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించిందంటూ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ చేసిన ప్రకటనతో దేశీయ ఈక్విటీ మార్కెట్లలో అమ్మకాలు బుధవారం తీవ్రరూపం దాల్చాయి. అంతర్జాతీయంగా ఈక్విటీ మార్కెట్లు కుదేలు కాగా మన మార్కెట్లు సైతం అదే బాటలో నడిచాయి. దీనికితోడు టెలికం కంపెనీల ఏజీఆర్ చెల్లింపుల సమీక్షకు అనుమతించేది లేదని సుప్రీం కోర్టు కరాఖండిగా తేల్చేయడం బ్యాంకు స్టాక్స్‌కు ప్రతికూలంగా మారింది. బ్యాంకు స్టాక్స్‌ను విదేశీ ఇన్వెస్టర్లు తెగ బాదేశారు. కోటక్ మహీంద్రా బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 10%పైనే పతనమయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇండస్‌ఇండ్ బ్యాంకులోనూ సమస్యలు ఉన్నాయనే వదంతులతో కంపెనీ షేరు కుదేలయింది. ఇంట్రాడేలో ఇండస్‌ఇండ్ బ్యాంకు షేరు 38 శాతం నష్టంతో రూ.382.55 వరకు పడిపోగా (ఏడాది నూతన కనిష్ట స్థాయి), ఆ తర్వాత కొంత కోలుకుని 24% నష్టంతో సరిపెట్టుకుంది. 2017 జనవరి తర్వాత సెన్సెక్స్ 29,000 మార్క్ దిగువకు చేరింది.

**మాంద్యం భయాలు...**

భారత వృద్ధి అంచనాలను తగ్గిస్తూ ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ చేసిన ప్రకటన ఇన్వెస్టర్లను అమ్మకాలకు పురిగొల్పింది. 2020 సంవత్సరంలో భారత జీడీపీ 5.7 శాతం వృద్ధి సాధించొచ్చన్న గత అంచనాలను తాజాగా 5.2 శాతానికి ఎస్‌అండ్‌పీ తగ్గించింది. అలాగే, కరోనా మహమ్మారి కారణంగా అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి ప్రవేశించినట్టు ప్రకటించింది. ఆసియా పసిఫిక్ వృద్ధి 2020లో సగానికి సగం తగ్గి 3 శాతం లోపునకు పడిపోవచ్చన్న అంచనాలను ఎస్‌అండ్‌పీ విడుదల చేసింది.

**అంతర్జాతీయ మార్కెట్లు కుదేలు**

అంతర్జాతీయంగా ఈక్విటీ, చమురు మార్కెట్లు బుధవారం కుప్పకూలాయి. ఎన్ని ఉద్దీపనలు ప్రకటించినా కానీ, కరోనా ప్రతాపంతో ప్రపంచ వృద్ధి రేటు దారుణంగా పడిపోవచ్చన్న భయాలతో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకునేందుకు పోటీ పడ్డారు. యూరోప్ మార్కెట్లు లండన్, ప్యారిస్, ఫ్రాంక్‌ఫర్ట్ ఐదు శాతం పడిపోగా, ఆసియా మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. షాంఘై, హాంకాంగ్, సియోల్, జపాన్ 5 శాతం వరకు నష్టపోయాయి. ప్యారిస్‌లో అయితే ఒక నెల పాటు షార్ట్ సెల్లింగ్‌ను నిషేధించారు. అలాగే ఒక రోజు పాటు ట్రేడింగ్‌ను కూడా నిలిపివేశారు.

**అమెరికా, బ్రిటన్ భారీ ప్యాకేజీలు**

అమెరికాలో ఇప్పటికే 300 బిలియన్ డాలర్ల పన్ను చెల్లింపులను వాయిదా వేయగా, ట్రిలియన్ డాలర్ల ప్యాకేజీని సిద్ధం చేస్తున్నట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్టీవెన్‌మ్నుచిన్ ప్రకటించారు. అంటే 2008 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం సమయంలో ప్రకటించిన ప్యాకేజీలను ఇది మించిపోనుంది. కరోనాతో అమెరికాలో నిరుద్యోగ రేటు 20 శాతానికి పెరిగిపోతుందని ముచిన్ పేర్కొన్నారు. ''ప్రజలు ఉద్యోగాలు కోల్పోకూడదు. జీవించడానికి డబ్బుల్లేని పరిస్థితిలోకి వెళ్లకూడదని మేము కోరుకుంటున్నాం'' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అటు బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్ కూడా బిలియన్ డాలర్ల ప్యాకేజీలను ప్రకటించాయి.

**మాంద్యం, టెలికం ఏజీఆర్ ప్రభావం**

''మార్కెట్లు మూడేళ్ల కనిష్టం వద్ద క్లోజయ్యాయి. కోవిడ్–19 ప్రభావంతో అంతర్జాతీయ మాంద్యం తప్పదంటూ రేటింగ్ ఏజెన్సీల హెచ్చరికలతో ఆసియా, యరోప్ మార్కెట్లు నష్టపోగా, మన మార్కెట్లు అదే బాట పట్టాయి. అదనంగా సుప్రీంకోర్టు టెలికం కంపెనీలకు ఏజీఆర్ విషయంలో ఎటువంటి ఉపశమనం కల్పించలేదు. దీంతో టెలికం కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంకు స్టాక్స్‌పై ఎక్కువగా ప్రభావం పడింది. నిఫ్టీ బ్యాంకు ఇండెక్స్ 7 శాతం వరకు పడిపోయింది'' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.

- ఇండెక్స్‌లో ఇండస్‌ఇండ్ బ్యాంకు 24 శాతం, పవర్‌గ్రిడ్ 12 శాతం, కోటక్ బ్యాంకు , బజాజ్ ఫైనాన్స్ 11 శాతం చొప్పున, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 10 శాతం, ఎన్‌టీపీసీ 8 శాతం వరకు పనతమయ్యాయి.

### ఇన్వెస్టర్ల సంపదకు తూట్లు

ఈ వారంలో మొదటి మూడు రోజుల్లో అమ్మకాల కారణంగా ఇన్వెస్టర్ల సంపద రూ.15,72,913 కోట్ల మేర తరిగిపోయింది. బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.1,13,53,329 కోట్లకు పడిపోయింది.

## భారత్ 'వృద్ధి'కి ఎస్ అండ్ పీ కోత




**న్యూఢిల్లీ:** భారత్ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 2020 వృద్ధి అంచనాలకు రేటింగ్ దిగ్గజ సంస్థ ఎస్ అండ్ పీ కోత పెట్టింది. క్యాలెండర్ ఇయర్‌లో ఇంతక్రితం అంచనా 5.7 శాతంకాగా, తాజాగా దీనిని 5.2 శాతానికి తగ్గిస్తున్నట్లు పేర్కొంది. మరో అంతర్జాతీయ రేటింగ్ దిగ్గజం 5.3 శాతం అంచనాకన్నా ఇది తక్కువ కావడం గమనార్హం. కరోనా నేపథ్యంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనంలోకి ప్రవేశించే అవకాశాలు కనిపిస్తుండడం తమ తాజా అంచనాలకు కారణంగా పేర్కొంది. ఆసియా–పసిఫిక్ ఆర్థిక వృద్ధి రేటు సగానికన్నా ఎక్కువగా పతనమై, 3 శాతంకన్నా దిగువనకు పడిపోయే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కరోనా ప్రభావంతో రానున్న రెండు త్రైమాసికాల్లో అంతర్జాతీయ పర్యాటక రంగం కుదేలయ్యే అవకాశం ఉందని పేర్కొన్న ఎస్ అండ్ పీ, అమెరికా, యూరోప్ నుంచి పర్యాటకుల సంఖ్య గణనీయంగా పడిపోయే వీలుందని తెలిపింది. 2020లో చైనా వృద్ధి రేటును 4.8 శాతం నుంచి 2.9 శాతానికి కుదించింది. వృద్ధి అనేది కరోనా అదుపుపైనే ఆధారపడి ఉందని రేటింగ్ దిగ్గజం అభిప్రాయపడింది. కరోనా ప్రభావం ఉపాధి, ఉద్యోగుల పని గంటలు, వేతనాల కోతలకు దారితీయవచ్చని పేర్కొంది. కాగా, ఈ ఏడాది భారత్‌లో ఆర్‌బీఐ రెపో రేటు 1.75 శాతం తగ్గొచ్చని ఫిచ్ అంచనావేసింది.

**2020లో ప్రపంచ వృద్ధి 1 శాతమే: ఈఐయూ**

న్యూఢిల్లీ: కరోనా వైరస్ మహమ్మారి ప్రతికూల ప్రభావంతో 2020లో ప్రపంచ వృద్ధి 1%కి పడిపోనున్నట్లు ఎకనమిస్ట్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఈఐయూ) ఒక నివేదికలో తెలిపింది. వైరస్ వ్యాప్తికి ముందు వృద్ధి 2.3%గా ఉంటుందని అంచనా వేశారు. పెద్ద ఎకానమీలైన జపాన్, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్ పూర్తి ఏడాది మాంద్యంలోకి జారిపోవచ్చని ఈఐయూ పేర్కొంది. ప్రపంచ జనాభాలో 50% మంది ప్రజలకు వైరస్ సోకవచ్చని.. 20% కేసులు తీవ్రంగా ఉంటాయని, 1–3% మరణాలు సంభవించవచ్చని తెలిపింది.

## క్రూడ్, బంగారం మరింత పతనం



కోవిడ్–19 భయాల నేపథ్యంలో పెట్టుబడులకు సంబంధించి అంతర్జాతీయంగా ఇన్వెస్టర్ల భయాందోళనలు కొనసాగుతున్నాయి. ఈక్విటీలతో పాటు బంగారం, క్రూడ్ సహా ప్రతి ఒక్క సాధనం నుంచీ పెట్టుబడులు వెనక్కు మళ్లుతున్నాయి. డాలర్ మాత్రం లాభాల్లో ట్రేడవుతోంది.

- రాత్రి ఈ వార్తరాసే 10.30 గంటల సమయంలో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి ఔన్స్ (31.1గ్రాములు) ధర 37 డాలర్ల నష్టంతో (2.5 శాతం) 1,489 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక దశలో 1,484 డాలర్ల స్థాయిని కూడా తాకింది.
- ఇక క్రూడ్ విషయానికి వస్తే, స్వీట్ బ్యారల్ ధర 18 శాతం (5 డాలర్లు) నష్టంతో 22.39 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బ్రెంట్ ఆయిల్ 12 శాతంపైగా (3 డాలర్లు) నష్టంతో 26 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇవి 18 సంవత్సరాల కనిష్ట స్థాయిలు కావడం గమనార్హం.
- ఇక ఆరు దేశాల కరెన్సీతో ట్రేడయ్యే డాలర్ ఇండెక్స్ 2 శాతం (2 డాలర్లు)పైగా లాభంతో 101.868 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పాలసీల్లో ఎల్ఐసీ రికార్డు




**ముంబై:** పాలసీల విక్రయాల్లో బీమా దిగ్గజ సంస్థ– జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) రికార్డు సృష్టించింది. ఈ మేరకు విడుదలైన ఒక ప్రకటన ప్రకారం, వార్షిక ప్రాతిపదికన 2019 మార్చి నెలాంతానికి పాలసీ విక్రయాల సంఖ్య 2,14,03,905. అయితే ఈ ఏడాది మార్చి 17వ తేదీ నాటికి పాలసీ విక్రయాల సంఖ్య 2,14,22,370. ఈ నెలాంతానికి 2.5 కోట్లను అధిగమించాలన్న లక్ష్యాన్ని చేరుకునే అవకాశం ఉందని ప్రకటన పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి 29నాటికి కొత్త పాలసీల తొలి ఏడాది ప్రీమియం ఆదాయం 13 శాతం, పాలసీల సంఖ్య 22 శాతం చొప్పున పెరిగాయి.

## చిన్న పొదుపులపై వడ్డీ తగ్గింపు!



**న్యూఢిల్లీ:** చిన్న పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది. వచ్చే త్రైమాసికానికి (ఏప్రిల్–జూన్) సంబంధించి ఈ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుసరిస్తున్న సరళతర వడ్డీరేట్ల విధానం ఈ నిర్ణయానికి నేపథ్యం కానుంది. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్ (ఎన్ఎస్‌సీ) వంటి చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్లను ప్రస్తుత త్రైమాసికంలో (జనవరి–మార్చి) కేంద్రం తగ్గించలేదు. అయితే చిన్న పొదుపు పథకాలపై ఇస్తున్న వడ్డీరేట్లు ఇప్పటికీ బ్యాంకింగ్‌తో పోల్చితే ఎక్కువగా ఉన్నాయనీ, దీనివల్ల దాదాపు అదే స్థాయిలో తమ డిపాజిట్లపై వడ్డీరేట్లనూ కొనసాగించాల్సి వస్తోందని బ్యాంకులు పేర్కొంటున్నాయి. ఈ ధోరణి వల్ల తాము ఇస్తున్న రుణాలపై వడ్డీరేట్లనూ తగ్గించలేని పరిస్థితులు ఉన్నాయని బ్యాంకింగ్ పేర్కొంటోంది. ఆయా అంశాల నేపథ్యంలో వచ్చే త్రైమాసికానికి సంబంధించి చిన్న పొదుపు మొత్తాలపై వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు అధికంగా ఉన్నాయని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఏడాది మెచ్యూరిటీకి సంబంధించి బ్యాంకులు, చిన్న పొదుపు పథకాలపై వడ్డీరేట్ల మధ్య దాదాపు 1% (100 బేసిస్ పాయింట్లు) వడ్డీరేటు వ్యత్యాసం ఉంది. చిన్న పొదుపు మొత్తాలపై త్రైమాసిక ప్రాతిపదికన వడ్డీరేట్ల మార్పు నిర్ణయం ఉంటుంది.

## ఫోక్స్‌వ్యాగన్ టీ-రాక్ @ రూ. 19.99 లక్షలు



**న్యూఢిల్లీ:** జర్మనీ వాహన దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్.. కొత్త స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ (ఎస్‌యూవీ) 'టీ–రాక్' ను బుధవారం భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 1.5–లీటర్ పెట్రోల్ ఇంజిన్ అమర్చిన ఈ కారు ధర రూ. 19.99 లక్షలుగా ప్రకటించింది. ఈ అధునాతన ఎస్‌యూవీ 8.4 సెకన్ల వ్యవధిలోనే సున్నా నుంచి 100 కిలో మీటర్ల వేగాన్ని అందుకుంటుంది. టాప్ స్పీడ్ 205 కి.మీ.గా కంపెనీ ప్రకటించింది. స్పోర్టీ డిజైన్ కలిగిన ఈ కారు.. భద్రత, సాంకేతికత పరంగా మరింత పటిష్టంగా ఉందని కంపెనీ ఇండియా డైరెక్టర్ స్టెఫెన్ నాప్ చెప్పారు. యాంటీ–లాక్ బ్రేకింగ్, 6 ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్‌స్టెబిలిటీ కంట్రోల్ వంటిఫీచర్లున్నాయన్నారు.

## యస్‌పై మారటోరియం ఎత్తివేత

- బ్యాంకింగ్ సేవలన్నీ పునరుద్ధరణ
- మూడు రోజుల పాటు వేళల పొడిగింపు




**ముంబై:** ప్రైవేట్ రంగ యస్ బ్యాంక్ 13 రోజుల తర్వాత మారటోరియంపరమైన ఆంక్షల నుంచి బైటపడింది. బుధవారం సాయంత్రం 6 గం.ల నుంచి పూర్తి స్థాయిలో బ్యాంకింగ్ సేవలను పునరుద్ధరించింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు బ్యాంకింగ్ వేళలను కూడా పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. దీని ప్రకారం మార్చి 19 నుంచి 21 దాకా ఉదయం 8.30 గం.లకే శాఖలు తెరుచుకుంటాయి. సీనియర్ సిటిజన్ ఖాతాదారుల కోసం మార్చి 19 నుంచి 27 దాకా సాయంత్రం 4.30 గం.ల నుంచి 5.30 గం.ల దాకా సేవలు అందిస్తాయి.

అయితే, సేవలు పునరుద్ధరించిన కాస్సేపటికే మొబైల్ యాప్ క్రాష్ కావడం, వెబ్‌సైట్ పనిచేయకపోవడంతో ఖాతాదారులు అసహనానికి లోనయ్యారు. సోషల్ మీడియాలో బ్యాంక్‌ను ట్యాగ్ చేస్తూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ సమస్యలిక పడలేమని, తాము డిపాజిట్లను మరో బ్యాంకుకు మార్చేసుకుంటామని సూచిస్తూ పలువురు పోస్ట్ చేశారు. దీంతో ఖాతాదారులకు కలిగిన అసౌకర్యానికి యస్ బ్యాంక్ క్షమాపణలు కోరింది. సమస్యను సత్వరం పరిష్కరిస్తున్నామని పేర్కొంది. మార్చి 5 నుంచి నెలరోజులపాటు యస్ బ్యాంక్‌పై ఆర్‌బీఐ మారటోరియం విధించడం, ఈ వ్యవధిలో రూ. 50,000కు దాటకుండా విత్‌డ్రాయల్స్‌పై ఆంక్షలు విధించడం తెలిసిందే. ఎస్‌బీఐ సహా ఇతరత్రా బ్యాంకులు.. యస్ బ్యాంక్‌లో ఇన్వెస్ట్ చేయడంతో మారటోరియం తొలగింది. మరోవైపు, యస్ బ్యాంక్ వ్యవస్థాపకుడు రాణా కపూర్‌పై మనీ లాండరింగ్ కేసులో డీహెచ్‌ఎఫ్ఎల్ ప్రమోటర్లు మరోసారి విచారణకు గైర్హాజరయ్యారు. కరోనా వైరస్ వ్యాప్తి భయాలను ఇందుకు కారణంగా వారు చూపారు.

### ఇండస్‌ఇండ్ బ్యాంకు పటిష్టంగానే ఉంది

**బ్యాంకు యాజమాన్యం ప్రకటన**

**న్యూఢిల్లీ:** ఆర్థికంగా బలమైన స్థితిలో, తగినన్ని నిధులతో, లాభాలతో, బలమైన నిర్వహణతో నడుస్తున్నట్టు ఇండస్‌ఇండ్ బ్యాంకు ప్రకటించింది. యస్ బ్యాంకు సంక్షోభం అనంతరం ఇండస్‌ఇండ్ బ్యాంకు ఆర్థిక సామర్థ్యంపై పెద్ద స్థాయిలో మార్కెట్ వదంతులు, ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో ఈ వివరణ ఇచ్చింది. డిసెంబర్ త్రైమాసికం నాటికి బ్యాంకు స్థూల ఎన్‌పీఏలు 2.18%గా ఉన్నాయని, పెద్ద ప్రైవేటు బ్యాంకుల్లో ఇది తక్కువగా ఉందని తెలిపింది. ''క్రితం త్రైమాసికం స్థాయిలోనే స్థూల ఎన్‌పీఏలు ప్రస్తుత త్రైమాసికంలోనూ ఉండొచ్చు. అలాగే, క్రితం త్రైమాసికం నాటికి 1.05%ఉన్న నికర ఎన్‌పీఏలు ప్రస్తుత త్రైమాసికంలో 1%లోపునకు తగ్గనున్నాయి'' అని బ్యాంకు తన ప్రకటనలో వివరించింది. ఫిబ్రవరి నాటికి వాణిజ్య, నివాస రియల్టీ, జెమ్స్, జ్యుయలరీ రంగాలకు ఎక్స్‌పోజర్ లేదని స్పష్టం చేసింది.

## బులియన్ రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9, 10గ్రా) | 40,537 | – |
| బంగారం (99.5, 10గ్రా) | 40,375 | – |
| వెండి (కిలో) | 35,515 | – |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,850 | – |
| బంగారం (22 క్యారెట్లు) | 38,680 | – |
| వెండి (కిలో) | 35,515 | – |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,700 | ▲ 500 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,250 | ▲ 550 |
| వెండి (కిలో) | 38,500 | 0 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,800 | ▼ 500 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,870 | ▲ 170 |
| వెండి (కిలో) | 37,500 | ▼ 500 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 41,770 | ▲ 450 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,680 | ▲ 480 |
| వెండి (కిలో) | 37,700 | ▲ 1000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

## కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 19-3-2020

| | |
|---|---|
| విశాఖ | 300–00 |
| చిత్తూరు | 223–00 |
| వరంగల్ | 213–00 |
| విజయవాడ | 225–00 |
| గోదావరి | 225–00 |
| **18–3–2020 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 210–00 |

# బాకీ మొత్తం కట్టాల్సిందే..

- స్వీయ మదింపులు కుదరవు
- తప్పుడు వార్తలకు టెల్కోల ఎండీలదే బాధ్యత
- కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటాం
- ఏజీఆర్ బకాయిలపై సుప్రీం కోర్టు స్పష్టీకరణ
- టెల్కోలు, కేంద్రానికి అక్షింతలు




**న్యూఢిల్లీ:** ఏజీఆర్ బాకీల విషయంలో కేంద్రం, టెల్కోలకు సుప్రీం కోర్టు తలంటింది. ఈ అంశాన్ని టెల్కోలు సాగదీస్తుండటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది అక్టోబర్ 24న ఇచ్చిన తీర్పు ప్రకారం.. నిర్దేశిత బాకీలు మొత్తం కట్టి తీరాల్సిందేనని స్పష్టం చేసింది. స్వీయ మదింపులు, బకాయిల పునఃసమీక్ష లాంటివి కుదరదని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. బాకీల చెల్లింపునకు టెలికం సంస్థలకు 20 ఏళ్ల వ్యవధినివ్వాలంటూ కేంద్రం వేసిన పిటిషన్‌ను జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ ఎంఆర్ షా తో కూడిన బెంచ్ బుధవారం తిరస్కరించింది. రెండు వారాల తర్వాత దీన్ని పరిశీలిస్తామని పేర్కొంది. '20 ఏళ్ల వ్యవధి ఇవ్వడమనేది అసమంజసం. తీర్పులో పేర్కొన్నట్లుగా టెలికం కంపెనీలు బాకీలన్నీ తీర్చాల్సిందే' అని స్పష్టం చేసింది. వడ్డీలు, జరిమానాలపై టెలికం కంపెనీలు, ప్రభుత్వం వాదోపవాదాలన్నీ విన్న మీదటే ఏజీఆర్ బాకీలపై తీర్పునిచ్చామని, అన్ని పక్షాలు కట్టుబడి ఉండాల్సిందేనని పేర్కొంది.

**ఆ అధికారులను పిలిపిస్తాం..**

ఏజీఆర్ బాకీలపై టెలికం కంపెనీలు స్వీయ మదింపు చేపట్టడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అత్యున్నత న్యాయస్థానం ఆదేశించిన తర్వాత కూడా ఇలాంటి వాటికి ఎలా అనుమతిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఇలాంటివి కలలో కూడా ఊహించలేనివంటూ వ్యాఖ్యానించింది. స్వీయ మదింపు ప్రక్రియ చేపట్టేందుకు టెల్కోలను అనుమతించిన టెలికం శాఖ కార్యదర్శి, డెస్క్ ఆఫీసర్‌లను పిలిపిస్తామని సుప్రీం కోర్టు పేర్కొంది. స్వీయ మదింపు పేరుతో టెలికం కంపెనీలు తీవ్రమైన మోసానికి పాల్పడుతున్నాయని ఆక్షేపించింది. ఏజీఆర్ బాకీల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పే అంతిమమని, దాన్ని తు.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేసింది.

**టెల్కోల చీఫ్‌లకు హెచ్చరిక..**

టెల్కోలు తమకు అనుకూలంగా వార్తాపత్రికల్లో కథనాలు రాయించుకుంటున్నాయని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇలాంటి కథనాలు తమ తీర్పును ప్రభావితం చేయలేవని స్పష్టం చేసింది. ఏజీఆర్ బాకీలపై సుప్రీం కోర్టుకు వ్యతిరేకంగా 'తప్పుడు వార్తలు' ప్రచురిస్తే టెలికం కంపెనీల ఎండీలపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

**స్వీయ మదింపుతో భారీ వ్యత్యాసం..**

ఏజీఆర్ బాకీలకు సంబంధించి డాట్ చెబుతున్న దానికి టెల్కోల స్వీయ మదింపునకు మధ్య ఏకంగా రూ. 82,300 కోట్ల వ్యత్యాసం ఉంది. డాట్ లెక్కల ప్రకారం ఎయిర్‌టెల్, టెలినార్‌వి కలిపి రూ. 43,980 కోట్లు, వొడాఐడియా రూ. 58,254 కోట్లు, టాటా గ్రూప్ సంస్థలు రూ. 16,798 కోట్లు చెల్లించాలి. అయితే, ఆయా టెల్కోలు జరిపిన స్వీయ మదింపు లెక్కల ప్రకారం.. భారతి గ్రూప్ రూ.13,004 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ.21,533 కోట్లు, టాటా గ్రూప్ సంస్థలు రూ.2,197 కోట్లు కట్టాల్సి ఉంటుంది.

## కరోనాపై పోరుకు 650 కోట్ల డాలర్లు: ఏడీబీ



**న్యూఢిల్లీ:** కోవిడ్–19 (కరోనా) వైరస్‌పై పోరుకు ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్(ఏడీబీ) 650 కోట్ల డాలర్ల (రూ.48,100 కోట్లు)ప్యాకేజీని ప్రకటించింది. కోవిడ్–19 వైరస్ అతి పెద్ద ప్రపంచ ఉపద్రవంగా మారిపోయిందని ఏడీబీ ప్రెసిడెంట్ మస్సాత్సు అసకవ వ్యాఖ్యానించారు. దీన్ని ఎదుర్కొనడానికి జాతీయ, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో తీవ్రమైన చర్యలు తీసుకోవలసి ఉందని వివరించారు. తమ సభ్య దేశాల తక్షణ అవసరాల నిమిత్తం 650 కోట్ల డాలర్ల ప్యాకేజీని అందిస్తున్నామని తెలిపారు.

## 9% పెరిగిన విమానయానం



**న్యూఢిల్లీ:** దేశీ విమాన ప్రయాణికుల రద్దీ ఈ ఏడాది ఫిబ్రవరిలో 8.98 శాతం వృద్ధితో 1.236 కోట్లుగా నమోదైంది. డీజీసీఏ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్) ప్రకటించిన తాజా సమాచారం ప్రకారం.. జనవరితో పోల్చితే అన్ని ప్రధాన విమానయాన సంస్థల ప్యాసింజర్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) గణనీయంగా పెరిగింది. ఇక జనవరిలో ప్రయాణికుల రద్దీ కేవలం 2.2 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే.

epaper.sakshi.com

# ప్లీజ్.. పెళ్లికి అనుమతించండి

## అమెరికా నుంచి వచ్చిన అబ్బాయి

- చావుబతుకుల్లో పెళ్లి కుమారుడి తండ్రి
- పెళ్లి ఆపాలంటున్న అధికారులు, అనుమతించాలంటున్న పెళ్లివారు

**సాక్షి, యాదాద్రి:** చావుబతుకుల మధ్య ఉన్న తండ్రి కళ్ల ముందే పెళ్లి చేసుకోవాలన్న తపనతో అమెరికా నుంచి వచ్చిన ఓ యువకుడికి కరోనా వైరస్ దెబ్బ పడింది. ఈ పెళ్లి వాయిదా వేసుకోవాలని అధికారులు ఒత్తిడి తెస్తుండగా.., అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం.. పెళ్లి ఎలా ఆపగలమని పెళ్లి వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.. వలిగొండకు చెందిన యువకుడు అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి పోచంపల్లి మండలానికి చెందిన యువతితో ఏడాది క్రితం పెళ్లి నిశ్చయమైంది. కాగా, పెళ్లి కుమారుడి తండ్రి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఏప్రిల్‌లో జరగాల్సిన పెళ్లిని మార్చి 20వ తేదీకి మార్చారు. దీంతో పెళ్లి కుమారుడు అమెరికా నుంచి నాలుగు రోజుల క్రితం అబుదాబి మీదుగా ఇండియాకు చేరుకొని స్వగ్రామమైన వలిగొండకు వచ్చాడు. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నాడు. మరోవైపు పెళ్లి కూతురు వైపు కూడా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. ఇదిలా ఉంటే కరోనా వైరస్ ప్రభావం నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమెరికా నుంచి వచ్చిన ఆ యువకుడు 14రోజుల పాటు క్వారంటైన్‌లో ఉండాలి. ఆ తర్వాతే బయటకు రావాలి. కానీ పెళ్లి పనుల కోసం అవేవీ పట్టించుకోకుండా శుభలేఖలు పంచుతూ హడావుడిగా ఉన్నాడు. పెళ్లి పత్రికలను తెలిసిన ప్రజాప్రతినిధులకు కూడా పంచారు. అయితే ఈ విషయం ఆనోటా ఈనోటా అధికారుల వద్దకు చేరడంతో వెంటనే రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి పెళ్లి వాయిదా వేసుకోవాలని ఆదేశించారు. వైరస్ తీవ్రత నేపథ్యంలో శుభలేఖలు ఎక్కడెక్కడ పంచారు.. పెళ్లి కొడుకు ఎక్కడెక్కడ తిరిగాడన్న విషయాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే లక్షల రూపాయల అడ్వాన్స్‌లు ఇచ్చి పెళ్లి పనులు ప్రారంభించామని, ఎలాగైనా పెళ్లికి అనుమతి ఇవ్వాలని రెండు కుటుంబాల వారు అధికారులను వేడుకుంటున్నారు. ఈ లోపు పెళ్లి కుమారుడికి పరీక్షలు నిర్వహించడంతో కరోనా నెగెటివ్ వచ్చింది. అయినప్పటికీ కొంతకాలం ఆగాలని అధికారులు సూచిస్తున్నారు. మరోవైపు అనారోగ్యంతో చావు బతుకుల మధ్య ఉన్న తండ్రి కళ్ల ముందే పెళ్లి చేసుకోవాలని అత ను అధికారులను వేడుకుంటున్నాడు. కనీసం 10, 20 మంది కుటుంబ సభ్యుల మధ్యనైనా వివాహం జరిపించేందుకు అనుమతించాలని ఇరు పక్షాల వారు కోరుతున్నారు. మొత్తంగా ఈ వ్యవహారంపై అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నారు.



## మిర్చి క్వింటాకు రూ.26 వేలు

### వరంగల్ మార్కెట్ చరిత్రలోనే ప్రథమం

**వరంగల్:** వరంగల్ వ్యవసాయ మార్కెట్ చరిత్రలోనే మిర్చి ధర గరిష్ట స్థాయికి చేరి ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. 1933లో మార్కెట్ ప్రారంభం అయిన నాటి నుంచి ఇప్పటి వరకు క్వింటాకు రూ.26 వేల ధర పలికిన దాఖలాలు లేవు. బుధవారం వరంగల్ మార్కెట్‌కు వచ్చిన ములుగు జిల్లా దేవగిరిపట్నంకు చెందిన రైతు వి.వెంకట్‌రెడ్డి తెచ్చిన సింగిల్ పట్టి మిర్చిని రూ.26 వేలకు విక్రయించాడు. ఇవాళ మార్కెట్‌కు వచ్చిన 70 బస్తాల మిర్చికి రికార్డు ధర నమోదైందని మార్కెట్ కార్యదర్శి సంగయ్య తెలిపారు. కాగా, ఈ ఏడాది మిర్చి సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ధరలు గరిష్టంగా నమోదు కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బీబీనగర్ ఎయిమ్స్‌లో ఐసోలేషన్ కేంద్రం!

## 200 బెడ్లతో ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు

- వారం రోజుల్లో ప్రారంభం
- భవనాన్ని పరిశీలించిన కలెక్టర్



**బీబీనగర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రంగాపురం పరిధిలో గల ఎయిమ్స్ కళాశాల భవనంలో కరోనా ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఎయిమ్స్‌లో విశాలమైన భవనాలు, జన సంచారానికి దూరంగా ఉండటం, రవాణా సౌకర్యం ఉండటంతో ఉన్నతాధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించడంతో ఇప్పటికే ఎయిమ్స్‌లోని మెడికల్ కళాశాల విద్యార్థులను ఖాళీ చేయించారు. కరోనా బాధితులకు ఇక్కడ వైద్యం చేసేందుకు కావాల్సిన వైద్య పరికరాలు, బెడ్లు, ఇతర వస్తువుల ఏర్పాటుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది. వారం రోజుల్లో 200 బెడ్లతో ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వైద్య సామగ్రి త్వరలో ఎయిమ్స్‌కు చేరనుంది.

### ఎయిమ్స్‌ను సందర్శించిన కలెక్టర్

కరోనా ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో బుధవారం కలెక్టర్ అనితా రామచంద్రన్ ఎయిమ్స్‌ను సందర్శించి భవనాన్ని పరిశీలించారు. భవనంలోని గదులు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. కరోనా వైరస్ వ్యాపించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఇక్కడ ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## పాసు పుస్తకం ఇవ్వడం లేదని..

### తహసీల్ ఎదుట తల్లీకొడుకు ఆత్మహత్యాయత్నం

**కురవి:** కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వకపోవడం.. ఆ భూమి మరొకరి పేరిట ఉన్నట్లు తెలుసుకున్న ఓ మహిళా రైతు తన కుమారుడితో కలసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కురవిలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం చోటు చేసుకుంది. కురవి శివారు లింగ్యాతండాకు చెందిన ఇస్లావత్ కాంతి తమ రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిని ఇరవై ఏళ్లుగా సాగు చేస్తోంది. అయితే, తన పేరిట రైతుబంధు పథకం డబ్బు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె ఆరా తీసింది. భూమి అదే తండాకు చెందిన ఇస్లావత్ కిష్టు పేరిట ఉన్నట్లు తేలింది. దీంతో తన పేరిట పట్టా మార్చాలని కోరుతూ వీఆర్‌ఓ కొమురయ్యను కలసి రూ.10 వేలు ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ఇటీవల కురవి తహసీల్దార్‌గా వచ్చిన విజయ్‌కుమార్‌ను సంప్రదించింది. అయితే సర్వే చేయిస్తానని ఆయన చెప్పినా ఆలస్యం అవుతుండటంతో మనస్తాపానికి గురైన కాంతి.. తన కుమారుడు బాలుతో సహా బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట క్రిమి సంహారక మందు తాగేందుకు యత్నించగా వీఆర్‌ఓ కిరణ్, రైతులు అడ్డుకున్నారు. పోలీసులు తల్లీకొడుకును మహబూబాబాద్ ఆస్పత్రికి తరలించారు. కాగా, సర్వే చేయించి పట్టా ఇస్తామని కాంతికి చెప్పామని, ఇంతలోనే ఇదంతా చేశారన్నారు. అలాగే.. కిష్టు పేర ఉన్న పట్టాదారు పాసుపుస్తకాలను వెనక్కి తీసుకున్నామని స్పష్టం చేశారు.



## రైల్వే ప్లాట్‌ఫారంపై మహిళ ప్రసవం

### స్థానికుల సహకారంతో పురుడు పోసిన వైద్యులు

**గార్ల:** రైలులో ఓ మహిళకు పురిటి నొప్పులు రావడంతో మహబూబాబాద్ జిల్లా గార్ల రైల్వేస్టేషన్‌లో దించగా.. ప్లాట్‌ఫారంపైనే ప్రసవం చేశారు. కొండపల్లికి చెందిన రాతోలు శైలజకు నెలలు నిండటంతో తల్లితో కలసి గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లో అత్తగారి గ్రామమైన మహబూబాబాద్‌కు బుధవారం ఉదయం బయలు దేరింది. డోర్నకల్ రైల్వేస్టేషన్ వద్ద శైలజకు పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గార్ల రైల్వేస్టేషన్‌లో దించారు. నొప్పులతో ఇబ్బంది పడుతున్న శైలజను గమనించిన స్థానికులు సమీపంలోని గార్ల ఆస్పత్రి వైద్యుడికి సమాచారం ఇచ్చారు. ఇంతలోనే మహిళలు ఆమె చుట్టూ చీరలు పట్టుకొని అడ్డంగా నిలబడగా.. ఆస్పత్రి వైద్యులు రాణాప్రతాప్, జ్యోతి, స్టాఫ్‌నర్స్ పవన్ వచ్చి డెలివరీ చేశారు. శైలజ మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సమయానికి వచ్చి వైద్యసేవలు అందించిన వైద్యసిబ్బందిని స్థానిక ప్రజలు అభినందించారు.

# మూడు కోల్‌బ్లాకుల కేటాయింపు

## లోక్‌సభలో బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ



**సాక్షి న్యూఢిల్లీ :** సింగరేణి కాలరీస్ అవసరాలను తీర్చడం కోసం మూడు బొగ్గు బ్లాకులను కేటాయించినట్లు బొగ్గు, గనుల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషీ బుధవారం లోక్‌సభలో తెలిపారు. వీటిలో రెండు బొగ్గు బ్లాకులు ఒడిశాలో, ఒకటి తెలంగాణలో ఉన్నాయి. తెలంగాణలో పెనగడ్డప్ప, ఒడిశాలో నైనీ, న్యూ పత్రపారా బొగ్గు బ్లాకులను సింగరేణి కాలరీలకు కేటాయించినట్లు కేంద్ర మంత్రి చెప్పారు. నైనీ బొగ్గు బ్లాకును విద్యుదుత్పత్తికి, మిగతా రెండింటిని బొగ్గు అమ్మకానికి వినియోగిస్తారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్న బొగ్గు నిల్వలు, కొత్తగా కేటాయించిన బొగ్గు బ్లాకులతో 2024–25లో 85 మిలియన్ మెట్రిక్‌టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని సింగరేణి కాలరీస్ భావిస్తోందని మంత్రి చెప్పారు. లోక్‌సభ సభ్యులు కొత్త ప్రభాకర్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, వంగ గీతా విశ్వనాథ్‌లు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ ఈ విషయం వెల్లడించారు. కాగా, దేశంలోని అన్ని బ్రాడ్‌గేజ్ రైల్వేలైన్ల విద్యుద్దీకరణ పనులు 2024కల్లా పూర్తవతాయని రైల్వే మంత్రి పీయూష్‌గోయల్ లోక్‌సభలో చెప్పారు. కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ మిగిలిన బ్రాడ్‌గేజ్‌రూట్ల విద్యుద్దీకరణ కోసం రూ.30 వేల కోట్లు ఖర్చువుతాయని అంచనావేసినట్లు చెప్పారు. అన్ని రైల్వే ట్రాకుల విద్యుద్దీకరణ పూర్తయిన తరువాత విద్యుత్తు వినియోగం 30.13 బిలియన్ యూనిట్లకు చేరుతుందని మంత్రి చెప్పారు. భవిష్యత్తు అవసరాలను థర్మల్, పునరుపయోగ వనరుల నుంచి తీర్చుకోనున్నట్లు మంత్రి తెలిపారు. భారతీయ రైల్వే నెట్‌వర్క్ కింద 62,891రూట్‌కిలోమీర్ల బ్రాడ్‌గేజ్,. 2,839 కిమీల మీటర్‌గేజ్, 185 కిమీల న్యారోగేజ్ లైన్లు ఉన్నాయన్నారు. అలాగే కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడిగిని ప్రశ్నకు సమాధానమిస్తూ భద్రాచలం రోడ్–డోర్నకల్, మోటుమర్రి–విష్ణుపురం లైన్ల డబ్లింగ్ జరగదు హైడెన్సిటీ నెట్‌వర్క్ (హెచ్‌డీఎన్) హైలీ యుటిలైజ్డ్ నెట్‌వర్క్ (హెచ్‌యుఎన్ )పరిధికి వచ్చే రైల్వే లైన్లనే డబ్లింగ్‌చేస్తున్నాయని, భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)–డోర్నకల్, మోటుమర్రి– విష్ణుపురం సెక్షన్లు ఈ నెట్‌వర్క్‌లకిందకు రావని రైల్వే మంత్రి చెప్పారు. తెలంగాణకు సంబంధించి 13 ప్రాజెక్టుల పనులు వివిధ దశలలో ఉన్నాయని మంత్రి చెప్పారు. దాదాపు రూ.20 వేల కోట్ల వ్యయంతో 1,604 కిమీల పొడవు ప్రాజెక్టులలో 85 కిమీల పనులు పూర్తయ్యాయని వెల్లడించా రు. ఇందుకు రూ.3,037 కోట్లు ఖర్చయిందన్నారు. వీటిలో 9 కొత్త ప్రాజెక్టులు కాగా 4 డబ్లింగ్‌వి. తెలంగాణ కిందకు వచ్చే మౌలిక వసతుల ప్రాజెక్టులు, భద్రతా పనుల ప్రాజెక్టుల కోసం 2019–20 బడ్జెట్లో రూ . 2 వేల కోట్లు, 2020–21 బడ్జెట్లో రూ.2,600 కోట్లు కేటాయించినట్లు పీయూష్ గోయల్ తెలిపారు.

## ప్రశ్నపత్రం లీక్‌పై కేసు

**'సాక్షి' ఎఫెక్ట్**

**కాజీపేట అర్బన్:** వాట్సాప్‌లో ఇంటర్ కెమిస్ట్రీ మొదటి సంవత్సరం ప్రశ్నపత్రం లీక్‌పై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. 'వాట్సాప్‌లో ప్రశ్నపత్రం' శీర్షికన బుధవారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీంతో స్పందించిన జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి ప్రశాంత బుధవారం హన్మకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయడంతో పాటు ప్రైవేట్ లెక్చరర్స్ ఇన్ వరంగల్ వాట్సాప్ గ్రూపులో వచ్చిన పోస్టుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సీహెచ్.అజయ్ తెలిపారు.

## పెళ్లింట్లో పెను విషాదం

### పాము కాటుతో పెళ్లి కుమార్తె తల్లి మృతి



నీలమ్మ

**గూడూరు:** పెళ్లింట్లో విషాదం నెలకొంది. రెండు రోజుల్లో ఆ ఇంట పెళ్లి జరగాల్సి ఉండగా.. వధువు తల్లి పాము కాటుకు బలైంది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన సమ్మెట లోకేశ్వర్‌గౌడ్, నీలమ్మ (40) దంపతుల పెద్ద కూ తురు రుచితకు పెళ్లి ఈనెల 20వ తేదీన జరగాల్సి ఉంది. మంగళవారం అర్ధ రాత్రి 11 గంటల తరువాత చిన్న కూతురు సుచరితతో కలసి ఆమె నేలపై పడుకుంది. పది నిమిషాల తర్వాత కాలుకు ఏదో కుట్టినట్టు అనిపించడంతో లేచి చూడగా చీకట్లో ఏమీ కనిపించకపోవడంతో తిరిగి పడుకుంది. కొద్దిసేపటికే కడుపులో మంట, నాలుక ఎండిపోవడాన్ని గుర్తించిన నీలమ్మ.. కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వారు వెంటనే స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యుడు శివశంకర్ పాము కాటు వేసినట్లు గుర్తించాడు. గంట తర్వాత ఆమె పరిస్థితి విషమించి మృతిచెందింది.



# నిజామాబాద్‌పై పట్టు కోసమే..

## ప్రస్తుతం మండలికి కవిత.. వీలునుబట్టి కేబినెట్‌లోకి

- డీఎస్, అరవింద్ ప్రాబల్యానికి అడ్డుకట్ట వేసే వ్యూహం
- కవితకు లైన్ క్లియర్ చేసేందుకు రాజ్యసభకు సురేశ్‌రెడ్డి
- క్షేత్ర స్థాయి నుంచి వచ్చారని చెప్పేందుకే స్థానిక కోటాలో పోటీ

**సాక్షి, హైదరాబాద్:** శాసనమండలి నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా అభ్యర్థిగా మాజీ ఎంపీ, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 12న నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా టీఆర్‌ఎస్ పక్షాన పలువురు ఆశావహులు పార్టీఅభ్యర్థిత్వాన్ని ఆశించారు. అయితే పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ మాత్రం తన కుమార్తె, నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత అభ్యర్థిత్వం వైపు మొగ్గు చూపారు. కవిత అభ్యర్థిత్వంపై సోమవారం రాత్రి నిజామాబాద్ జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలకు సమాచారం అందించినట్లు సమాచారం. అయితే మండలి స్థానిక సంస్థల కోటా అభ్యర్థిగా కవిత నామినేషన్ వేస్తున్న విషయం మంగళవారం రాత్రి పార్టీ కేడర్‌కు సంకేతాలు అందాయి. ఈ నేపథ్యంలో మంత్రుల నివాస సముదాయంలో బుధవారం ఉదయం నిజామాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలతో కవిత మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం మంత్రి వేముల, పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి నామినేషన్ దాఖలు చేసేందుకు నిజామాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. బుధవారం శాసన మండలి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కవితను వేద పండితులు ఆమె నివాసంలో కలిసి ఆశీర్వచనాలు అందజేశారు.

### టీఆర్‌ఎస్‌కు 532 ఓటర్లు

2014 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా పార్లమెంటులో కవిత అడుగు పెట్టారు. 2019 ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా రెండో పర్యాయం టీఆర్‌ఎస్ పక్షాన నిజామాబాద్ నుంచి పోటీ చేసిన కవిత ఓటమి చవిచూశారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత కవిత పార్టీ కార్యకలాపాల్లో అంతగా కనిపించడం లేదు. ఈ నెల 13న జరిగిన రాజ్యసభ సభ్యుల నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు అసెంబ్లీకి వచ్చిన కవిత ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అదే రోజు కవిత జన్మదినం కావడంతో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు మంత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉంటే నిజామాబాద్ శాసనమండలి స్థానిక సంస్థల కోటా అభ్యర్థిగా జిల్లాలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పార్టీ అభ్యర్థిగా కవితను సీఎం కేసీఆర్ ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. స్థానిక సంస్థల కోటాకు సంబంధించి జిల్లాలో 824 మంది ఓటర్లు ఉండగా, టీఆర్‌ఎస్‌కు 532, కాంగ్రెస్‌కు 140, బీజేపీకి 85 ఓట్లు ఉన్నాయి. దీంతో శాసన మండలికి కవిత ఎన్నిక సునాయాసంగా జరుగుతుందని లెక్కలు వేసి బరిలోకి దించినట్లు తెలిసింది.

### వీలును బట్టి మంత్రి మండలిలోకి?

నిజామాబాద్ లోకల్‌బాడీ స్థానం నుంచి లోయపల్లి నర్సింగారావు, ముజీబ్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి తదితరులు అవకాశాన్ని ఆశించినా కవిత ఎంపిక వ్యూహాత్మకంగా జరిగిందని పార్టీ నేతలు భావిస్తున్నారు. కవితకు మార్గం సుగమం చేసేందుకు అసెంబ్లీ మాజీ స్పీకర్ సురేశ్‌రెడ్డిని రాజ్యసభకు పంపడంతో పాటు, కవితను స్థానిక సంస్థల కోటాకు ఎంపిక చేయడం ద్వారా దొడ్డిదారిన శాసన మండలికి వచ్చారనే అపప్రథ రాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు సమాచారం. మరోవైపు టీఆర్‌ఎస్‌కు పట్టు ఉన్న నిజామాబాద్‌లో డి.శ్రీనివాస్‌తో పాటు, ఆయన కుమారుడు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ దూకుడుకు అడ్డుకట్ట వేయడం లక్ష్యంగా కవిత ఎంపిక జరిగినట్లు పార్టీ నేతలు చెప్తున్నారు. ఇదిలా ఉంటే ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో సీఎం కేసీఆర్‌తో పాటు 16 మంది మంత్రులుగా ఉన్నారు. భవిష్యత్తులో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరిగే పక్షంలో కవితను కేబినెట్‌లోకి తీసుకునే ఉద్దేశంతోనే శాసన మండలి అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నిజామాబాద్ జిల్లాకు చెందిన మంత్రితో పాటు ఎమ్మెల్యేల వినతి మేరకు కవితను అభ్యర్థిగా ఎంపిక చేసినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

## పశువులకు వింత వైరస్



వింత వ్యాధి సోకిన పశువు

**తిరుమలాయపాలెం:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతండాలో పశువులకు వింత వైరస్ సోకింది. పశువుల శరీరంపై మచ్చలు ఏర్పడి.. వాపు వస్తుందని, ఇది ఒక పశువు నుంచి మరో పశువుకు సోకుతోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశు వైద్యాధికారులు స్పందించి వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని, లేకుంటే పశువులన్నీ వింత వైరస్‌తో మృతి చెందే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

## బజారున పడిన బకాయిదారులు !

### పన్నులు చెల్లించకపోవడంతో పేర్లతో ఫ్లెక్సీలు



**వరంగల్‌అర్బన్:** ఆస్తి పన్ను భారీగా బకాయి ఉన్న వారి నుంచి ఎలాగైనా వసూలు చేయాలనే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ముందుకు సాగుతున్నారు. తాజాగా బడా బకాయిదారులతో కమిషనర్ పమేలా సత్పతి సమావేశమై పన్ను చెల్లించాలని సూచించినా పెద్దగా స్పందన రాలేదు. దీంతో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన బల్దియా అధికారులు.. బుధవారం ప్రధాన కూడళ్లలో బకాయిదారుల జాబితాలను ప్రదర్శించారు. 60 మంది బకాయిదారుల పేర్లు, వారు చెల్లించాల్సిన ఆస్తి పన్ను, వడ్డీ, పాత బకాయిలతో పాటు ఇంటి నంబర్లతో సహా వెల్లడించారు.

# పదివేల కోళ్లు మట్టిపాలు



తుజాల్‌పూర్‌లో కోళ్లను పాతి పెడుతున్న దృశ్యం

**నర్సాపూర్ రూరల్ /వెల్దుర్తి (తూప్రాన్):** కరోనా దెబ్బకు చికెన్ అమ్మకాలు పూర్తిగా పడిపోవడంతో కోళ్లను పౌల్ట్రీ యజమానులు మట్టిలో కప్పి పెడుతున్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన బంజా శ్రీశైలం, కల్లూరి వెంకటమ్మ తమ ఫాంలోని కోళ్లను కొనుగోలు చేసే నాథుడు లేకపోవడంతో ఇద్దరికి సంబంధించి 10వేల కోళ్లను జేసీబీతో గుంతలు తీసి పాతి పెట్టారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పౌల్ట్రీ రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

### ఐదువేల కోళ్లు ఉచితంగా పంపిణీ..

మరో సంఘటనలో ఇదే జిల్లాలో కోళ్లకు దాణా పెట్టి మరింత నష్టపోవడం కంటే వాటిని ఉచితంగా పంపిణీ చేయడమే మేలనుకొని వెల్దుర్తి పట్టణానికి చెందిన ఓ పౌల్ట్రీ యజమాని తన ఫాంలోని సుమారు 5,300 కోళ్లను ఉచితంగా పంచిపెట్టారు. విషయం తెలియడంతో పెద్ద ఎత్తున జనం వచ్చి కోళ్లను పట్టుకెళ్లిపోయారు.

# వినూత్నంగా తెలంగాణ మ్యాప్



తెలంగాణ మ్యాప్ ఔట్‌లైన్

**జడ్చర్ల టౌన్:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రెండెకరాల విస్తీర్ణంలో వినూత్నంగా తెలంగాణ రాష్ట్రం ఔట్‌లైన్ మ్యాప్‌ను రూపొందించారు. కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో 33 జిల్లాలతో కూడిన తెలంగాణ ఆకృతిని తీర్చిదిద్దారు. ఈ తరహాలో ఔట్‌లైన్ మ్యాప్‌ను రూపొందించడం ఎక్కడా జరగలేదని వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ సదాశివయ్య తెలిపారు. పాలమూరు యూనివర్సిటీకి చెందిన 50 మంది, జడ్చర్ల కళాశాలకు చెందిన దాదాపు 100 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఈ మ్యాప్‌ను రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. సున్నంలో ముంచిన ఇటుకలతో విద్యార్థులు వారం రోజుల పాటు కష్టపడి ఈ ఆకృతిని తయారు చేశారని, వచ్చే వర్షాకాలంలో ఆయా జిల్లాల ఆకృతిలో మొక్కలు నాటి ఈ మ్యాప్‌ను పూర్తిగా హరిత వర్ణంలోకి మార్చనున్నట్లు సదాశివయ్య తెలియజేశారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

**మందమర్రి రూరల్:** మందమర్రిలో బుధవారం నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై శివకుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు (చెన్నూర్)జాడి బాపు తెలిపిన వివరాల ప్రకారం.. పక్కా సమాచారంతో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించారు. బొలెరోలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 16 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. ఇద్దరు డ్రైవర్లు శివ, లక్ష్మణ్, వ్యాపారి శివయ్యను అదుపులోకి తీసుకుని విచారించారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన విత్తనాల విలువ మార్కెట్‌లో సుమారు రూ.32 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com